ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
గురువారం 18.12.2025 | సంపుటి : 12 సంచిక : 149 | పేజీలు : 12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్






ఆ ఐదుగురూ పార్టీ మారినట్టు

# ఆధారాలు లేవు

## తెల్లం, బండ్ల, గూడెం, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడిలపై అనర్హత పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

### వారంతా సాంకేతికంగా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నట్లు స్పష్టీకరణ



హైదరాబాద్,డిసెంబరు17(జనంసాక్షి): ఎమ్మెల్యేలు పార్టీ మారానడానికి ఎలాంటి ఆధారాలు లేవు.. అందువల్ల వారిని అనర్హులుగా ప్రకటించలేమని తెలంగాణ తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై స్పీకర్ ప్రసా ద్‌కుమార్ తీర్పు వెలువరించారు. తెల్లం వెం కట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహి పాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ కీలక నిర్ణయం ప్రకటించారు. ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు ఆధారాలు చూపలేకపోయారని తీర్పులో పేర్కొన్నారు. అనర్హత వేటుకు తగిన ఆధారాలు లేవని, సాంకేతికంగా వారంతా భారత రాష్ట్ర సమితి లోనే ఉన్నట్టు స్పష్టం చేశారు. మొత్తం 10 మంది మిగతా 2లో..

## స్పీకర్ తీర్పు రాజ్యాంగ విరుద్ధం : బీఆర్‌ఎస్

- అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ
- ఫిరాయింపు ఎమ్మెల్యేల తీర్పుపై కేటీఆర్ ఆగ్రహం
- రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారు: హరీశ్ రావు

# హైకోర్టులో సవాల్ చేస్తాం

హైదరాబాద్(జనంసాక్షి):ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, ఆయన నిర్ణయంపై హైకోర్టుకు వెళ్తామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కె.సంజయ్ తెలిపారు. ఇది స్పీకర్ నిర్ణయం కాదని, జూబ్లీహిల్స్ ప్యాలెస్ రాజు నిర్ణయమని విమర్శించారు. స్పీకర్‌ను ముఖ్యమంత్రి మిగతా 2లో..

## మూడో విడత పల్లె తీర్పులోనూ

# కాంగ్రెస్ ఆధిక్యం



## గట్టిపోటీ ఇచ్చిన భారాస



ములుగు జిల్లా వాజేడు మండలం గుట్టలపై నుంచి ఓటు వేసేందుకు కాలినడకన వస్తున్న పెనుగోలు ఓటర్లు)

- మూడు విడతల్లో ఎన్నికలు పూర్తి
- 22న సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ప్రమాణం
- స్వల్పఘర్షణలు మినహా ప్రశాంతంగా ముగిసిన పంచాయితీ ఎన్నికలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మద్దతుదారులు పైచేయి సాధించారు. మొత్తం 4,158 స్థానాల్లో అత్యధిక స్థానాల్లో గెలిచి ఆధిక్యాన్ని చాటారు. చాలా చోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకు న్నారు. మూడో దశలో 394 పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,752 పదవులకు బుధవారం పోలింగ్ జరిగింది. ఉదయం 7నుంచి 1 గంట వరకు పోలింగ్ జరగగా, 2 గంటల నుంచి కౌంటింగ్ మొదలు పెట్టారు. మిగతా 2లో..

**పంచాయతీ ఎన్నికల ఫలితాలు**

| పోలింగ్ దశ | కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ | ఇతరులు |
|---|---|---|---|---|
| తొలిదశ | 2331 | 1168 | 189 | 539 |
| రెండవ దశ | 2245 | 1188 | 268 | 624 |
| మూడవ దశ | 2244 | 1161 | 245 | 491 |
| మొత్తం | 6820 | 3517 | 702 | 1654 |



# శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు రాష్ట్రపతి

- ముర్ముకు స్వాగతం పలికిన గవర్నర్, డిప్యూటి సిఎం
- 20,21 తేదీల్లో రెండ్రోజులు ఉపరాష్ట్రపతి పర్యటన
- ఏర్పాట్లపై ఆరా తీసిన సిఎస్ రామకృష్ణారావు


హైదరాబాద్(జనంసాక్షి):శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు చేరుకున్నారు. హకీంపేట ఎయిర్‌పోర్టులో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు డిసెంబర్ 17 నుంచి 22 వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హకీంపేట, అల్వాల్, బొలారం, తిరుమలగిరి, కార్ఖానా ప్రాంతాల్లో వాహనాల డైవర్షన్ కొనసాగుతుంది. రాష్ట్రపతి పర్యటన మిగతా 2లో..




# 24 గంటల్లో వారికి వివరాలు ఇవ్వండి

## జీహెచ్‌ఎంసీ వార్డుల డీలిమిటేషన్‌పై ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీచేసిన హైకోర్టు

- డివిజన్ల పునర్విభజన పిటిషన్లపై తీర్పు రిజర్వ్
- అభ్యంతరాల గడువు రేపటి వరకు పొడిగిస్తూ ఆదేశాలు
- జనాభా సంఖ్య, మ్యాపులను డొమైన్‌లో ఉంచాలని ధర్మాసనం ఆదేశం



హైదరాబాద్(జనంసాక్షి):జీహెచ్‌ఎంసీ డివిజన్ల పునర్విభజన పిటిషన్లపై హైకోర్టు విచారణను ముగించింది. విభజనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ ముగిసింది. డివిజన్ల వారీగా జనాభా వివరాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. డివిజన్ల విభజనపై అధికారిక మ్యాప్ కూడా ఇవ్వాలని సూచించింది. 24 గంటల్లోగా పిటిషనర్లకు వివరాలు ఇవ్వాలని జీహెచ్‌ఎంసీకి ఆదేశాలిచ్చింది. ఈ వివరాలు ఇచ్చాక రెండు రోజుల్లోపు అంటే 19 వరకు పొడిగిస్తూ పిటిషనర్లు అభ్యంతరాలను తెలపాలని హైకోర్టు ఆదేశించింది. జీహెచ్‌ఎంసీ డివిజన్ల పునర్విభజనపై దాఖలైన పిటిషన్లపై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. జీహెచ్‌ఎంసీ డివిజన్ల పునర్విభజనలో నిబంధనలు పాటించలేదంటూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. భౌగోళిక అంశాలు పరిగణనలోకి తీసుకోలేదని, ఒక డివిజన్ మరో డివిజన్ మధ్య జనాభాలో తేడా 10 శాతం కంటే ఎక్కువ ఉండొద్దని చట్టం చెబుతున్నా అధికారులు పట్టించుకోలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పునర్విభజనకి చెందిన మ్యాపులను సైతం పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదని వాదించారు. లంగర్ హౌజ్‌తో పాటు శాలిబండ డివిజన్ పునర్విభజనపై జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి మిగతా 2లో..



# తెలంగాణలో మరో కొత్త డిస్కం

## ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్(జనంసాక్షి): విద్యుత్‌శాఖలో మరో విద్యుత్ పంపిణీ సంస్థ డిస్కంను ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మూడో డిస్కమ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను బుధవారం విడుదల చేసింది. వ్యవసాయానికి, పేదల గృహాలకు 200 యూనిట్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల నిర్వహణ, అలాగే ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడం ఈ డిస్కం ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే ఉన్న తెలంగాణ సదరన్, నార్తర్న్ డిస్కమ్‌లతో పాటు ఈ కొత్త డిస్కం పనిచేయనుంది. దీనివల్ల విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్థిక స్థిరత్వం, సంక్షేమ పథకాల అమలును మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త డిస్కమ్ ఏర్పాటుపై గతంలోనే కేబినేట్‌లో నిర్ణయించారు. దీనిద్వారా విద్యుత్ వినియోగాన్ని లెక్క కట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది.

## రైళ్లలోనూ లగేజీ ఇక

# సపరేటు

### అదనపు ఛార్జీలు వసూలు చేస్తాం : అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ(జనంసాక్షి): రైళ్లలో పరిమితికి మించి లగేజీ తీసుకెళ్తే అదనపు రుసుం చెల్లించాల్సి ఉంటుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. తరగతిని బట్టి కొంత మేర లగేజీని ఉచితంగా తీసుకెళ్లవచ్చన్న ఆయన.. పరిమితి మించితే అదనపు రుసుము చెల్లించక తప్పదన్నారు. విమానాశ్రయాల్లో అనుసరిస్తున్న మాదిరిగా రైళ్లలోనూ లగేజీ మిగతా 2లో..



# తయారీరంగ బలోపేతంపై దృష్టి పెట్టాలి



- కేంద్రానికి సూచించిన రాహుల్
- కొనసాగుతున్న కాంగ్రెస్ అగ్రనేత జర్మనీ పర్యటన
- మ్యూనిచ్‌లో బిండబ్ల్యూ ప్లాంట్ సందర్శన

బెర్లిన్(జనంసాక్షి):జర్మనీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మ్యూనిచ్‌లోని బీఎండబ్ల్యూ ప్లాంట్‌ను రాహుల్ గాంధీ సందర్శించారు. అందులోని తాజా మోడల్ కార్లు, ఎలక్ట్రిక్ బైక్‌లు.. ఎం సీరిస్, బీఎండబ్ల్యూ ఐఎస్3, రూల్స్ రాయిస్ తదితర వాహనాలను ఆయన పరిశీలించారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తయారీ రంగంపై దృష్టి పెట్టాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. దేశంలో చిరు వ్యాపారులను పట్టించుకోవడం లేదంటూ కేంద్ర వైఖరిని తప్పుపట్టారు. ఈ సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోను పోస్ట్ చేసి ఆయన.. కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీఎస్ 450 సీసీ మోటర్ సైకిల్‌ను బీఎండబ్ల్యూ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇది భారతీయ ఇంజినీరింగ్ పనితనానికి గర్వకారణంగా ఉందన్నారు. తయారీ రంగం.. బలమైన ఆర్థికాభివృద్ధికి వెన్నుముక వంటిందని అభివర్ణించారు. కానీ విచారం ఏమింటే.. భారత్‌లో మాత్రం ఈ తయారీ రంగం అనేది తగ్గిపోతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిని వేగవంతం చేయాలంటే.. మనం మరిన్ని ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు.పార్లమెంట్ శీతకాల సమావేశాలు జరుగుతున్నాయి. డిసెంబర్ 15 నుంచి 20వ వరకు జర్మనీ రాజధాని బెర్లిన్ వేదికగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ జరుగుతుంది. ఇందులో పాల్గొనేందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ వెళ్లారు.రాహుల్ చేస్తున్న మిగతా 2లో..




# ఆధార్ డేటా సేఫ్

## అత్యంత సురక్షితమని పార్లమెంటులో కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ డేటా బేస్ నుంచి ఆధార్‌కార్డు హోల్డర్ల డేటా దుర్వినియోగం జరగలేదని కేంద్రం స్పష్టం చేసింది. ఆధార్ డేటా బదిలీ, స్టోరేజీ సమయంలో అధునాతన ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. నేషనల్ క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొటెక్షన్ సెంటర్ పర్యవేక్షణలో ఆధార్ వ్యవస్థ సురక్షితంగా ఉందని తెలిపారు. అధునాతన భద్రతా చర్యల కారణంగా పౌరుల ఆధార్ డేటా సురక్షితంగా ఉందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ మిగతా 9లో..

# కొత్త వంగడాలపై విస్తృతంగా పరిశోధనలు జరపాలి



- ప్రధానికి ఇథియోపియా అత్యున్నత పురస్కారం
- మోదీకి ప్రదానం చేసిన ఆ దేశ ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇథియోపియా పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న భవిష్యత్ అవసరాల కోసం కొత్త వంగడాలపై విస్తృతస్థాయిలో పరిశోధనలు నిర్వహించాలని సూచించారు.కాగా ప్రధాని మోదీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం వరించింది. అదిస్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆ దేశ ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ.. 'ది గ్రేట్ ఆనర్ ఆఫ్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా' అవార్డుతో మోదీని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారతీయులందరి తరఫునా ఈ అవార్డు స్వీకరిస్తున్నానన్నారు. భారత్–ఇథియోపియా బంధాలను పటిష్ఠం చేసేందుకు సహకరించిన ఎందరో భారతీయులకు ఇది గుర్తింపు అభివర్ణించిన మోదీ.. ఆ దేశ ప్రధాని అబీ అహ్మద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. మోదీ.. తన తొలి ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా ఇథియోపియా రాజధాని అదిస్ అబాబా చేరుకున్నారు. అంతకముందు.. విమానాశ్రయంలో ఆయనకు అబీ అహ్మద్ అలీ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రధానుల మధ్య పరస్పర ప్రయోజనకర విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. మిగతా 2లో..

## హిడ్మాఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జీతో విచారణ చేయించండి

### ఏపీ హైకోర్టులో పిల్

## ఈశాన్య రాష్ట్రాలపై బంగ్లా నేత ప్రేలాపనలు

### బంగ్లా హైకమిషనర్‌కు భారత్ సమన్లు

## దేశీయ క్యాబ్ భారత్ ట్యాక్సీ

### జనవరి 1నుంచి ఢిల్లీలో ప్రారంభం

## నేటి తరంలో టారీఫ్‌లే ఆయుధాలుగా మారాయి

### కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

వివరాలు 2వ పేజీలో..

## 24 గంటల్లో వారికి వివరాలు ఇవ్వండి

విచారణ చేపట్టారు. హడావిడిగా డివిజన్ల పునర్విభజన చేశారని అందులో శాస్త్రీయత లోపించిందని పిటిషనర్ పేర్కొన్నారు. మేయర్, కార్పొరేటర్లకి డివిజన్ల పునర్విభజనపై కనీస సమాచారం లేదన్నారు. కొత్త డివిజన్లకు సంబంధించిన జనాభా వివరాలను జీహెచ్ఎంసీ అధికారులు రహస్యంగా ఉంచుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. జీహెచ్ఎంసీ తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట జనరల్ సుదర్శన్ రెడ్డి పాలనా సౌలభ్యం కోసమే పరిధి పెంచారని వాదించారు.జనాభా, మ్యాప్ వంటి విషయాలపై కార్పొరేటర్లకు సమాచారం ఇచ్చినట్లు అడ్వకేట్ జనరల్ పేర్కొన్నారు. పాలనాపరమైన ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదన్నారు. ఆ సమయంలో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి మ్యాప్, జనాభా వివరాలను పిటిషనర్లకి ఇవ్వకపోతే ఎక్కడి నుంచి సమాచారం సేకరిస్తామని ఏజీని ప్రశ్నించారు. డివిజన్ల పునర్విభజనపై ఇప్పటికే 3వేలకు పైగా అభ్యంతరాలు వచ్చాయని అవన్నీ ఒకే తరహాలో ఉన్నాయని ఏజీ తెలిపారు. ఆ విషయంపై పిటిషనర్లు ఇప్పటికే ఫిర్యాదు చేశారని వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

**జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో విలీనంపై :** జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన శాస్త్రీయంగా జరపాలని మంగళవారం కాంగ్రెస్ కార్పొరేటర్లు విజ్ఞప్తి చేశారు. డివిజన్ల పునర్విభజనలో తమ అభిప్రాయాలను తీసుకోవాలని కోరిన కాంగ్రెస్ కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కాంగ్రెస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు సమావేశమయ్యారు. డివిజన్ల పురనర్విభజనలో తమ అభిప్రాయాలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ డివిజన్ల సరిహద్దులపై మార్కింగ్ చేసి వినతిపత్రం ఇచ్చామన్న ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ ఏ ప్రాతిపదికన విలీనం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఈశాన్య రాష్ట్రాలపై బంగ్లా నేత ప్రేలాపనలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఈశాన్య రాష్ట్రాలపై బంగ్లాదేశ్ నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు హస్నాత్ అబ్దుల్లా ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంపై భారత్ చర్యలకు ఉపక్రమించింది. బంగ్లాను అస్థిరపరిస్తే.. సెవన్ సిస్టర్స్(7 ఈశాన్య రాష్ట్రాలు)ను ముక్కలు చేస్తామని హస్నాత్ అబ్దుల్లా బహిరంగంగా హెచ్చరించారు . ఈ విషయమై ఆ దేశ హైకమిషనర్ మహ్మద్ రియాజ్ హమీదుల్లాకు భారత్ సమన్లు జారీ చేసింది. బంగ్లాదేశ్‌లోని భారత దౌత్య కార్యాలయానికి బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. బంగ్లాదేశ్‌లో భద్రతా పరిస్థితులు క్షీణించడంపై హమీదుల్లా ముందు ఆందోళన వ్యక్తం చేసింది భారత విదేశాంగ శాఖ. ఢాకాలోని ఇండియన్ ఎంబసీపై బంగ్లాదేశీయులు బెదిరింపులకు పాల్పడటాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. బంగ్లాలో ఇటీవల జరిగిన సంఘటనలకు సంబంధించి ఇండియాపై తప్పుడు కథనాలను పూర్తిగా తిరస్కరిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈ ఘటనలకు సంబంధించి తాత్కాలిక ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు నిర్వహించకపోవడం లేదా సరైన ఆధారాలను పంచుకోకపోవడం దురదృష్టకరమని భావిస్తూ అసంతృప్తి వ్యక్తం చేసింది. భారత్.. బంగ్లాదేశ్‌తో సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. ఆ దేశంతో శాంతి, స్థిరత్వాన్ని కోరుకుంటున్నామని.. శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని పిలుపునిచ్చినట్టు గుర్తు చేసింది. తాత్కాలిక ప్రభుత్వం తన దౌత్య బాధ్యతలకనుగుణంగా బంగ్లాలోని భారత మిషన్లు, పోస్టుల భద్రతను నిర్ధారించాలని ఆశిస్తున్నట్టు స్పష్టం చేసింది ఇండియా. కాగా.. గతేడాది విద్యార్థుల ఆందోళన తర్వాత బంగ్లాదేశ్ ప్రధానిగా ఉన్న షేక్ హసీనా రాజీనామా చేశారు. నాటి నుంచి భారత్– బంగ్లా సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారత్‌కు వ్యతిరేకంగా అక్కడి నాయకులు పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే.. వీటిని ఎప్పటికప్పుడు భారత్ ఖండిస్తూనే ఉంది.

### హిడ్మాఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జీతో విచారణ చేయించండి

**అమరావతి(జనంసాక్షి):**మావోయిస్టు అగ్ర నేత హిడ్మా ఎన్‌కౌంటర్ సంచలనంగా మారింది. హిడ్మాతోపాటు ఇతరుల ఎన్‌కౌంటర్ పై పీపుల్స్ యూనిటి ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైట్స్ ఫోరం అధ్యక్షురాలు జయ వింధ్యాల హై కోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సిట్టింగ్ జడ్జీతో లేదా ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జయ వింధ్యాల దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాళపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ఉంచారు. మెజిస్టీరియల్ విచారణపై పిటిషనర్ల కు అభ్యంతరం ఉంటే సెషన్స్ జడ్జ్ లేదా మెజిస్ట్రేట్‌ని ఆశ్రయించాలని పేర్కొన్నారు. నేరుగా హై కోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేయడం కంటే, కింది కోర్టులో ఫిర్యాదు చేసి విచారణ కోరడం సరైన పక్రియ అని అయన అభిప్రాయపడ్డారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత చట్టబద్ధంగా జరగాల్సిన మెజిస్టీరియల్ విచారణ ఇప్పటికే మొదలైందని, దర్యాప్తు సంస్థలు నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నాయని ఏజీ కోర్టుకు తెలిపారు. ఇదిలా ఉంటే.. అడ్వకేట్ జనరల్ దమ్మాళపాటి శ్రీనివాస్ వాదనలను పరిగణలోకి తీసుకున్న హై కోర్టు ధర్మాసనం, ఈ విషయంలో మరింత లోతుగా అధ్యాయనం చేయాలని పిటిషనర్ తరుపు న్యాయవాదిని ఆదేశించడం గమనార్హం.

## దేశీయ క్యాబ్ భారత్ ట్యాక్సీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి ప్రైవేటు సంస్థలకు దీటుగా కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా సహకార క్యాబ్ సేవలు ప్రారంభం కాబోతున్నాయి. 'భారత్ ట్యాక్సీ' పేరుతో వస్తున్న ఈ సేవలు వచ్చే నెల నుంచి ప్రారంభం కాబోతున్నాయి. తొలుత దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 1వ తేదీ నుంచి ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్టు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఆ తర్వాత ఈ యాప్ సేవలను దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తేనున్నారు. ఇందులో ఆటో, క్యాబ్, బైక్ సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. ఈ సేవలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్లు వెల్లడించింది. ఈ భారత్ ట్యాక్సీ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండింటిలోనూ అందుబాటులో ఉంటుంది. యూజర్లు తమ మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇదివరకు ఉన్న క్యాబ్ ఛార్జీల నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగించేలా.. ఎలాంటి సర్వీస్ ఛార్జీలు లేకుండానే ఈ సేవలను పొందే అవకాశముంది. సుమారు 56 వేల మంది డ్రైవర్లు భారత్ ట్యాక్సీ యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ సేవల్లో రైడ్ ద్వారా వచ్చే ఆదాయం మొత్తాన్ని డ్రైవర్లకే చెల్లిస్తారు. అతి తక్కువ నామినల్ రుసుముతో డ్రైవర్లు ఈ ప్లాట్‌ఫాంలో పనిచేయవచ్చని తెలిపింది.

## నేటి తరంలో టారీఫ్‌లే ఆయుధాలుగా మారాయి

దిల్లీ: ప్రపంచ వాణిజ్య ప్రస్తుత తీరుతెన్నులపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. టారిఫ్‌లు, ఇతర మార్గాలను ఆయుధంగా మార్చేశారని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకుంటే అదే మనల్ని కాపాడుతుందన్నారు. ఈ మేరకు టైమ్స్ నెట్‌వర్క్ నిర్వహించిన ఇండియా కాన్‌క్లేవ్ 2025లో ఆమె మాట్లాడారు.భారత్‌ను టారిఫ్ కింగ్ అన్నవారే వాటిని ఆయుధంగా మలుచుకుంటున్నారని నిర్మలా సీతారామన్ అన్నారు. నేరుగా పేరు ప్రస్తావించనప్పటికీ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నుద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. భారత్‌పై అమెరికా పెద్దఎత్తున సుంకాలు విధించింది. ఇటీవల మెక్సికో సైతం భారత్‌పై సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో నిర్మలా సీతారామన్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. కేవలం భారత్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా మనకు అదనపు ప్రయోజనం లభిస్తుందని మంత్రి అన్నారు. భారత్ మాత్రం ఏ రోజూ సుంకాలను ఆయుధంగా మలుచుకోవాలని అనుకోలేదని స్పష్టంచేశారు.

# మూడోవిడత పల్లెతీర్పులోనూ కాంగ్రెస్ ఆధిక్యం





### ఆఖరు విడత ప్రశాంతం

తెలంగాణలో మూడు విడతల పంచాయతీ ఎన్నికలు ముగిశాయి.పంచాయతీ ఎన్నికల మూడో దశ పోలింగ్ నేపథ్యంలో పలు చోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. గ్రామాల్లో ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను రానుపోను కిరాయి డబ్బులు ఇచ్చి రప్పించారు.ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ కొనసాగింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్యూలో నిల్చున్న వారికి ఓటేసేందుకు అవకాశం కల్పించారు. కాగా, మొదటి, రెండో విడతల ఎన్నికల మాదిరిగానే మూడో విడత తెలంగాణ సర్పంచ్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ గట్టి పోటీనిచ్చింది. బుధవారం మూడవ విడతలో భాగంగా 3,752 గ్రామ పంచాయతీలకు, 28,410 వార్డులకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో సుమారు 53 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా కొనసాగాయి. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది. పోలింగ్ బూత్‌లో ప్రచారం చేస్తున్నారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు పరస్పరం దాడులు చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం మాదారం పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్ఎస్ పోలింగ్ ఏజెంట్లపై కాంగ్రెస్ పార్టీకి చెందినవారు దాడికి పాల్పడ్డారు. తమకు ఓట్లు వేయాలంటూ కాంగ్రెస్ ఏజెంట్లు పోలింగ్ బూత్‌లో ప్రచారం నిర్వహిస్తుండటంతో బీఆర్ఎస్ ఏజెంట్లు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాలు ఒకరిని ఒకరు తోసుకున్నారు. దీంతో నలుగురు గాయపడ్డారు. ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు.. గాయపడిన వారిని పరిగి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇక రంగారెడ్డి జిల్లా మంచాల మండలం అస్మత్‌పూర్‌లో ఉద్రిక్తత నెలకొన్నది. కాంగ్రెస్ అభ్యర్థి పోలింగ్ బూత్‌లో ప్రచారం నిర్వహిస్తున్నాడని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రెండు పార్టీల కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో సర్పంచ్ అభ్యర్థి సహా పలువురు గాయపడ్డారు.పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి ఏకంగా పోలింగ్ కేంద్రం వద్ద కుర్చీ వేసుకు కూర్చున్నారు. ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తన సొంత గ్రామం దోమ మండలంలోని శివారెడ్డిపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే మొదటి రెండు దశల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల స్వగ్రామాల్లో ఓటమిని ఎదురుచూశారు. అలా తనకు కూడా కావొద్దని అనుకున్నారో ఏమో.. ఏకంగా పోలింగ్ కేంద్రం వద్ద కుర్చీ వేసుకుని కూర్చుకున్నారు. ఓటేయడానికి వెళ్లే వారిని కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలంటూ విజ్ఞప్తి చేసారు. ఎన్నికల నియమావలికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే పోలింగ్ కేంద్రం వద్ద కూర్చున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసారు. సొంత ఊరిలో ఓడిపోతే పరువుపోతుందనే ఉద్దేశంతోనే ఆయన ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

**ముథోల్‌లో భారీగా ఓటర్ల తరలిరాక**

పంచాయతీ ఎన్నికల్లో స్థానిక ప్రజలు ఓటేసేందుకు భారీగా తరలి వచ్చారు. దీంతో గ్రామాల్లో పోలింగ్ 85శాతం వరకు చేరుకుంది. ము థోల్ పోలింగ్ కేంద్రంలో ఓటర్లు క్యూలైన్‌లో బారులు తీరి కనిపించారు. పోలింగ్ సమయం ముగిసినా క్యూలో ఉండడంతో వారికి ఓటేసేందుకు అధికారులు అనుమతించారు. మధ్యాహ్నం ఒంటి గంట లోపు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లకు సిబ్బంది టోకెన్లు అందజేశారు. దాదాపు 10 వేలకు పైగా ఓటర్లు కలిగిన ఈ పంచాయతీలో సర్పంచ్ పదవి కోసం 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. భారీ సంఖ్యలో ఉన్న ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. మొత్తం 16 వార్డులకు గాను ఒక్క వార్డు ఏకగ్రీవమైంది. మిగిలిన 15 వార్డులకు సరిపడేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయలేదు. మరోవైపు ఈ 15 వార్డుల్లో 50 మంది అభ్యర్థుల వరకు పోటీలో ఉన్నారు. దీంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లంతా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఓటు వేసే వారందరికీ ప్రవేశం, నిష్క్రమణ ఒకే మార్గం కావడంతో రద్దీ పెరిగింది.

**ఖమ్మంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల ఘర్షణ**

ఖమ్మం జిల్లా టేకులపల్లి మండలం బద్దుతండాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తొలుత గుర్తింపు కార్డు లేకుండా పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. ఓటేసేందుకు అధికారులు నిరాకరించడంతో వెనుదిరిగాడు. ఆ తర్వాత గుర్తింపు కార్డుతో మరోసారి అక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో గమనించిన కాంగ్రెస్ అభ్యర్థి భూక్యా గంగారావు.. సదరు వ్యక్తి దొంగ ఓటు వేస్తున్నాడని ఆరోపిస్తూ ఆగ్రహానికి గురై అతడిపై చేయిచేసుకున్నాడు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. నల్గొండ జిల్లా డిండి మండలం శాంతిగూడెంలోనూ రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పరం దాడి చేసుకున్నారు. ఒకరికి గాయమైంది. అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మం డలం విలాసాగర్‌లో సర్పంచ్ అభ్యర్థి వద్ద పోలీసులు నగదు స్వాధీనం చేసుకన్నారు. స్థానిక పోలింగ్ కేంద్రం సమీ పంలో జనం గుమిగూడి ఉండటంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. సర్పంచ్ అభ్యర్థి వద్ద రూ.28,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు ఎన్నికయ్యారు. ఈ నెల 22న సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ప్రమాణం చేస్తారు. దీంతో గ్రామాల్లో పాలన ప్రారంభం కానుంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మూడో దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్ పక్రియ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్, మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. గడువు ముగిసే సమయానికి క్యూలైన్‌లో ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ మూడో దశలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,752 సర్పంచ్ స్థానాలకు, 28,410 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అయితే.. మధ్యాహ్నం 1 గంటల వరకు 80.78శాతం పోలింగ్ నమోదయ్యింది. సర్పంచ్ ఎన్నిక ఫలితాలను అధికారికంగా ప్రకటించిన వెంటనే, తదుపరి పక్రియగా ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించారు. సర్పంచ్ ఫలితం తేలిన తర్వాత, నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, వారి సమక్షంలో ఉప సర్పంచ్ ఎన్నికను పూర్తి చేసారు. మెజారిటీ గ్రామాల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి.

## రైళ్లలో లగేజీ సప'రేటు'

నిబంధనలు అమలు చేస్తారా? అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి లోక్‌సభలో సమాధానమిచ్చారు.తరగతిని బట్టి ప్రయాణికులు తమ వెంట కంపార్ట్‌మెంట్‌లో తీసుకెళ్లే లగేజీపై పరిమితి ఉందని తెలిపారు. ఉచితంగా తీసుకెళ్లగలిగే లగేజీ, ఛార్జీ చెల్లించి తీసుకెళ్లాల్సిన గరిష్ఠ పరిమితి వివరాలను ఈ సందర్భంగా వెల్లడించారు. సెకండ్ క్లాస్‌లో ఉచితంగా 35 కేజీల వరకు తీసుకెళ్లొచ్చని, ఛార్జీలు చెల్లించి 70 కేజీల వరకు లగేజీని వెంట తీసుకెళ్లొచ్చన్నారు. అదే స్లీపర్ క్లాస్‌లో అయితే ఉచితంగా 40 కేజీలు, ఛార్జీలు చెల్లించి 80 కేజీలుగా పేర్కొన్నారు. థర్డ్ ఏసీ లేదా చైర్ కార్‌లో ఉచితంగా 40 కేజీలు మాత్రమే తీసుకెళ్లొచ్చని మంత్రి పేర్కొన్నారు. ఫస్ట్ క్లాస్, ఏసీ 2 టైర్‌లో ప్రయాణికులు 50 కేజీల వరకు ఉచితంగా తీసుకెళ్లొచ్చని, 100 కిలోల వరకు గరిష్ఠంగా లగేజీని ఛార్జీలు చెల్లించి వెంట తీసుకెళ్లొచ్చని పేర్కొన్నారు. ఏసీ ఫస్ట్ క్లాస్ ప్రయాణికులు 70 కేజీలు ఉచితంగా, 150 కేజీలు వరకు ఛార్జీ చెల్లించి తీసుకెళ్లొచ్చని తెలిపారు. గరిష్ఠ పరిమితి అనేది ఉచిత పరిమితితో కలిపి లెక్కిస్తామని పేర్కొన్నారు.ఉచిత పరిమితికి మించి ఎవరైనా లగేజీ తీసుకెళ్లాల్సిన వారు ముందుగా లగేజీ బుక్ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే, నిర్దిష్ట కొలతలకు లోబడి ఉన్న ట్రంక్స్, సూట్‌కేసులు, బాక్సులను మాత్రమే కంపార్ట్‌మెంట్లోకి అనుమతిస్తామని, అంతకంటే పెద్దగా ఉన్న వాటిని బ్రేక్‌వ్యాన్/ పార్సిల్ వ్యాన్‌లో తరలించాల్సి ఉంటుందన్నారు.

## తయారీరంగ బలోపేతంపై దృష్టి పెట్టాలి

ఈ పర్యటనపై బీజేపీ వ్యంగ్యంగా స్పందించింది. ఒక వైపు పార్లమెంట్ శీతకాల సమావేశాలు జరుగుతుండగా.. ఆయన విదేశాలకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించింది. దేనికి ప్రాధాన్యత ఇవ్వల్లో రాహుల్‌కు తెలియదని ఆ పార్టీ అభిప్రాయపడింది. అంతేకాదు.. లీడర్ ఆఫ్ పర్యటన్, లీడర్ ఆఫ్ పార్టీయింగ్ అని వ్యాఖ్యానించింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఆయన పర్యటనపై బీజేపీ ఈ సందర్భంగా విమర్శలు గుప్పించింది. బీజేపీ విమర్శలపై రాహుల్ సోదరి ప్రియాంకా గాంధీ కాస్త ఘాటుగా స్పందించారు. అయితే 2005లో అప్పటి యూపీయే ప్రభుత్వం.. జాతీయ ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టింది. దీనికి జాతిపిత మహాత్మా గాంధీ పేరు పెట్టింది. తాజాగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పేరును మార్చేసింది. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ చరిత్ర నుంచి గాంధీ, నెహ్రూల పాత్ర చెరిపేసే కుట్ర జరుగుతుందంటూ కాంగ్రెస్ పార్టీ మండిపడింది. నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఇక పార్లమెంట్ శీతకాల సమావేశాలు డిసెంబర్ 19వ తేదీతో ముగియనున్నాయి. ఈ సమావేశాల చివరి మూడు రోజులు సభ్యులంతా సభకు హాజరు కావాలంటూ ఇప్పటికే ఆ పార్టీ విప్ జారీ చేసింది. మరి ఆ జాబితాలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పేరు లేక పోవడం గమనార్హం.

## శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు రాష్ట్రపతి

**– 20,21 తేదీల్లో రెండ్రోజులు ఉపరాష్ట్రపతి పర్యటన**
**– ఏర్పాట్లను ఆరా తీసిన సిఎస్ రామకృష్ణారావు**

ముగిసే వరకు డ్రోన్లు, పారా గ్లైడర్స్, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఎగురవేతపై నిషేధం. 18న సికింద్రాబాద్ లోని రాష్ట్రపతి నిలయంలో ఆమె విశ్రాంతి తీసుకుంటారు. 19న రామోజీ ఫిలిమ్ సిటీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు హాజరవుతారు. పలు అభివృద్ధి శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేస్తారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పాల్గొంటారు. 21న రాష్ట్రపతి నిలయంలో ప్రముఖుల కోసం 'ఎట్ హోమ్', పౌరుల భేటీ లో పాల్గొంటారు. 22న సాయంత్రం ప్రత్యేక విమానంలో తిరిగి ఢిల్లీకి బయలుదేరుతారు.

**20,21 తేదీల్లో రెండ్రోజులు ఉపరాష్ట్రపతి పర్యటన**

భారత ఉప రాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ హైదరాబాద్ లో ఈనెల 20 ,21 తేదీల్లో పర్యటించనున్నారు. డిసెంబర్ 20 వ తేదీన శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు చేరుకొని అక్కడ నుండి నేరుగా రామోజీ ఫిలిం సిటీ కి వెళ్తారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొని అక్కడ నుండి లోక్ భవన్ లో రాత్రి బస చేస్తారు. 21 వ తేదీ ఉదయం కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ధ్యాన దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని అక్కడి నుండి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకొని న్యూఢిల్లీ తిరిగి వెళ్తారు. ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సంబంధిత ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. బందోబస్తు ఏర్పాట్లు, ఉప రాష్ట్రపతి ప్రయాణించే మార్గంలో రహదారుల నిర్వహణ, ప్రోటోకాల్ తదితర ఏర్పాట్లపై సమీక్షించారు.

# ఆ ఐదుగురూ పార్టీ మారినట్టుగా ఆధారాలు లేవు

ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలు చేయగా.. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణ ఇంకా పూర్తి కాలేదు. అనర్హత పిటిషన్లపై సభాపతి త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై ఈనెల 19న మరోమారు విచారణ జరగనుంది. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేసిన సభాపతి.. బుధవారం ఐదుగురికి సంబంధించి తీర్పు ఇచ్చారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌కు సంబంధించి గరువారం తీర్పు వెలువడనుంది. రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక తీర్పునిచ్చారు. ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. వారిపై అనర్హత వేటు వేసేందుకు తగిన ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. పార్టీ మారినట్లు సరైన ఆధారాలు చూపలేదని తీర్పు సందర్భంగా స్పీకర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కడియం శ్రీహరి, దానం నాగేందర్, కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్ లు తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి మారారని, వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చారు. ఈ విషయంలో స్పీకర్ ఆలస్యం చేస్తుండటంతో.. బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్లపై పలు దఫాలుగా విచారించిన సుప్రీం ధర్మాసనం.. డిసెంబర్ 18వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్..బుధవారం ఐదుగురు ఎమ్మెల్యేల కేసులో తీర్పును వెలువరించారు.పార్టీ ఫిరాయింపుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేసిన పిటిషన్లను స్పీకర్ కొట్టేశారు. ఇక, మిగిలిన వారిలో ముగ్గురు ఎమ్మెల్యేలకు సంబంధించిన కేసులో గురువారం నాడు తీర్పు వెలువరించనున్నారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలను ఇంకా విచారించాల్సి ఉంది. వీరికి స్పీకర్ నోటీసులు జారీ చేసినప్పటికీ.. ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు. వీరి విషయంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది సస్పెన్స్‌గా మారింది.

### హైకోర్టులో సవాల్ చేస్తాం

ఇబ్బంది పెడుతున్నారని సంజయ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్ రాజు నుంచి ఎప్పుడో జడ్జిమెంట్ వచ్చిందని, ఆర్డర్ కాపీ జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుంచి వచ్చిందని సంజయ్ విమర్శించారు. ట్రెజరీ బెంచ్‌కి టాయిలెట్ దగ్గరగా ఉంటుందని కాంగ్రెస్ వాళ్ళ పక్కన కూర్చున్నామని తమ ఎమ్మెల్యేలు చెబుతున్నారని సంజయ్ అన్నారు. 'మా వాదనలు పట్టించుకోకుండా ఏకపక్షంగా తీర్పునిచ్చారు. స్పీకర్ తీరు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంది. తీర్పు కాపీని అధ్యయనం చేసి హైకోర్టుకు వెళ్తామ'ని సంజయ్ తెలిపారు. ట్రిబ్యునల్ చైర్మన్ గా ఉన్న స్పీకర్ తీర్పును వ్యతిరేకిస్తున్నామని, స్పీకర్ రాజ్యాంగానికి, చట్టానికి లోబడి ఉండాలని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. స్పీకర్ పూర్తిగా విఫలమయ్యారని, స్పీకర్ తీర్పుపై జనాలు నవ్వుకుంటున్నారని, వ్యవస్థలపై ఉన్న నమ్మకం పోయిందని అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారితే ఉప ఎన్నికలు వస్తాయా అని సీఎం అన్నారని, తాజాగా స్పీకర్ జడ్జిమెంట్ కూడా సీఎం మాటలలాగానే ఉందని విమర్శించారు.

**అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ : కేటీఆర్**

ఐదుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ సాక్షిగా ఇవాళ ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ నిలువునా ఖూనీ చేసిందని విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానాల పైనే కాదు.. చివరికి రాజ్యాంగంపై కూడా రాహుల్ గాంధీకి ఏమాత్రం గౌరవం లేదని మరోసారి తేలిపోయిందని అన్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటికి వెళ్లి మరీ సీఎం రేవంత్ పార్టీ ఫిరాయింపులకు తెరతీసిన నాటి నుంచి నేటి స్పీకర్ నిర్ణయం వరకూ కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని అడుగడుగునా అపహాస్యం చేస్తూనే ఉందని కేటీఆర్ విమర్శించారు. అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు సాక్షాత్తు ఫిరాయింపు ఎమ్మెల్యేలే అనేక సార్లు ప్రకటించినా వారిని కాపాడటం రాహుల్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని అన్నారు. కేవలం ఫోటోలకు ఫోజులిచ్చేందుకు చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదని.. తండ్రి చేసిన చట్టాన్నే గౌరవించలేని అసమర్థ నాయకుడిగా రాహుల్ గాంధీ చరిత్రలో మిగిలిపోతారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెండేళ్ల పాలనా వైఫల్యాలపై పంచాయతీ ఎన్నికల్లో పల్లెపల్లెనా వెల్లువెత్తుతున్న ప్రజావ్యతిరేకతకు భయపడే కాంగ్రెస్ పార్టీ బై ఎలక్షన్స్ అంటే జంకుతోందని కేటీఆర్ అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్య తీసుకోకుండా వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం ఇదేనని తెలంగాణ సమాజానికి స్పష్టంగా అర్థమైపోయిందని విమర్శించారు. గోడ దూకిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను తాత్కాలికంగా కాపాడినట్టు కాంగ్రెస్ అనుకున్నా.. ప్రజాక్షేత్రంలో వారిని ఎమ్మెల్యే పదవికి అనర్హులుగా ఆయా నియోజకవర్గాల ప్రజలు ఎప్పుడో ప్రకటించేశారని తెలిపారు. ఈ వ్యవహారంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కారని ఆరోపించారు. సేవ్ ది కానిస్టిట్యూషన్ అంటూ రాహుల్ గాంధీ ఢిల్లీలో ఉపన్యాసాలు ఇస్తారని.. కానీ ఆచరణలో మాత్రం ఆ నినాదం మాటలకే పరిమితమైందని ఆరోపించారు. ఆచరణలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా దెబ్బతీసిన ఈ ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడింది. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించిన యాంటీ–డిఫెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టి.. అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం. ఇది రాజ్యాంగాన్ని కాలరాయడమే. ఇది ఎంతో సిగ్గుచేటు. ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ అని అన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని మాజీ ఎంపి వినోద్ కుమార్ అన్నారు. స్వయంగా ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పారు. కానీ ఇవాళ స్పీకర్ మాత్రం పార్టీ మారలేదు అని చెప్పడం ఎంత వరకు కరెక్ట్. 10వ షెడ్యూల్‌లో రాజ్యాంగ సవరణ చేయాలి. పార్లమెంట్‌లో వెంటనే పార్టీ ఫిరాయింపులపై ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

## కొత్త వంగడాలపై విస్తృతంగా పరిశోధనలు జరపాలి

థియోపియాకు వెళ్లడానికి ముందు జోర్డాన్ దేశంలో పర్యటించారు మోదీ. ఆ దేశ రాజధాని అమ్మాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. రానున్న ఐదేళ్లలో భారత్–జోర్డాన్ ద్వైపాక్షిక వాణిజ్య బంధాన్ని రెట్టింపు చేసి 500 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకునేలా ప్రయత్నం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యం వహించి లబ్ది పొందాలని ఆ దేశ వాణిజ్య సంస్థలను కోరారు మోదీ. ఈ కార్యక్రమంలో ఆ దేశ యువరాజు హుసేన్ సహా వాణిజ్య, పరిశ్రమల శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

**మీ ప్రజాస్వామ్య ప్రయాణం అభినందనీయం**

ఇథియోపియా ప్రజాస్వామ్య ప్రయాణాన్ని ప్రధాని మోడీ ప్రశంసించారు.140 కోట్ల భారతీయ ప్రజల తరఫున స్నేహపూర్వక సోదరభావ శుభాకాంక్షలు తెలిపారు. ఇరుదేశాల జాతీయ గీతాలు.. ప్రజల్లో మాతృభూమి పట్ల గర్వాన్నీ, దేశభక్తినీ ప్రేరేపిస్తాయని కొనియాడారు. ఇథియోపియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సింహాల దేశంలో అడుగుపెట్టడం పట్ల తన సొంత గడ్డపైనే ఉందన్న భావన కలుగుతోందన్నారు. తన స్వస్థలమైన గుజరాత్ కూడా సింహాలకు నిలయం కావడమే ఇందుకు కారణమని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగించిన పార్లమెంట్లలో ఇది 18వది కావడం విశేషం.ఈ సందర్భంగా.. భారత జాతీయ గేయమైన 'వందేమాతరం', ఇథియోపియా జాతీయ గేయం రెండూ మాతృభూమిని తల్లిగా సూచిస్తాయని మోదీ అభివర్ణించారు. మన వారసత్వం, సంస్కృతి, ప్రకృతి అందాల పట్ల గర్వపడటమే కాకుండా.. దేశాన్ని పరిరక్షించేందుకు అవి మనల్ని ప్రేరేపిస్తాయని మోదీ పేర్కొన్నారు. తనకు లభించిన ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారాన్ని వినయంతో స్వీకరిస్తున్నట్టు తెలిపారు. భారతీయుల తరఫున ఈ గౌరవాన్ని చేతులు జోడించి దేశ గౌరవాన్ని చాటుకున్నారాయన. ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సారూప్యతలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు.

# హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తయ్యేదెన్నోడో?

- మోరంచవాగులో రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్ పాక, భూపాలపల్లి మండలం నేరేడుపల్లి గ్రామాల మధ్య గల మోరంచవాగులో హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తయ్యేదెన్నోడో..? అని రెండు మండలాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. రెండు మండలాల సరిహద్దులో గల మోరంచ వాగులో హైలెవల్ వంతెన నిర్మాణానికి గాను సుమారు మూడేళ్లక్రితం నిధులు మంజూరు కాగా పనులు కూడా ప్రారంభమయ్యాయి. మొదట్లో పనులు చురుకుగా సాగాయి. పనులు యుద్ధప్రాతిపదికన పూర్తవుతాయని ఎదురుచూస్తున్న క్రమంలో గత ఏడాది క్రితం పనులకు బ్రేక్ పడింది. అప్పటి నుండి పనుల్లో కదలిక లేకపోవడంతో వంతెన నిర్మాణానికి గ్రహణం పట్టినట్లయింది. దీంతో ఈ ప్రాంత వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

### వాగులో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

చిట్యాల, భూపాలపల్లి మండలాల మధ్య గల మోరంచవాగులో బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఈ ప్రాంత వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పక్కన నుండి వెళ్తూ, ద్విచక్ర వాహనదారులు వాగులో ఇబ్బందులు పడుతూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. వాగొడ్డున తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మోరీలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆ మోరీలను దాటించలేక వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం వాగులో మోరీలను సరిచేసి తాత్కాలిక రోడ్డును బాగు చేయకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగితే కాంట్రాక్టర్, అధికారులే పూర్తి బాధ్యత వహిం చాల్సి ఉంటుందని స్థానికులు మండి పడుతున్నారు.

### బ్రిడ్జి నిర్మిస్తే తగ్గనున్న దూర భారం

నైన్ పాక, నేరేడుపల్లి గ్రామాల మధ్య గల మోరంచవాగులో బ్రిడ్జి నిర్మిస్తే రెండు మండలాల ప్రజలకు దూర భారం తగ్గనుంది. వంతెన నిర్మాణం లేక ప్రజలు దూర ప్రయాణం చేయాల్సి వస్తుంది. వంతెన నిర్మాణం పూర్తయితో సుమారు పదిహేను కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీంతో సమయం ఆదా కానుంది. బ్రిడ్జి నిర్మాణం లేక అనేక మంది నైన్ పాక, జడల్ పేట, ఒడితల, మోరంచపల్లి, చెల్పూరు మీదుగా భూపాలపల్లికి చేరుకోవాల్సి వస్తుందని, అది పూర్తయితే నైన్ పాక శివారు మోరంచ వాగు మీదుగా నేరేడుపల్లి, గొర్లవేడు, కొంపెల్లి మీదుగా అతితక్కువ సమయంలో భూపాలపల్లి చేరుకోవడం జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చే బిల్లును ఉపసంహరించుకోవాలి

- ఈ నెల 18,19,20 తేదీల్లో సీపీఐ(ఎం) నిరసనలు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్రంలో అధికారంలో వున్న బిజేపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టింది. వ్యవసాయ కార్మికులకు, పేదలకు తీవ్రంగా నష్టం చేసే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని ఈ నెల 18,19 తేదీల్లో గ్రామ గ్రామాన నిరసన తెలుపుతూ బిల్లు ప్రతులను దగ్ధం చేయాలని, 20వ తేదీన మండల కేంద్రాల్లో నిరసనలు తెలియజేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాలకు చెందిన 30కోట్లమందికి పైగా పేదల ఉపాధిని కల్పిస్తున్న ఈ చట్టాన్ని నీరుగారుస్తున్నారని తెలిపారు. పనిదినాలను పెంచామనే పేరుతో కూలీల సంఖ్యను భారీగా తగ్గిస్తున్నారని ఇపుడున్న చట్టంలో 90శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సి వుండగా, దాన్ని 60శాతానికి కుదిస్తున్నారని తెలిపారు. కోత పెడుతున్న 40శాతం నిధులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని చెప్తున్నారని దీంతో నిధుల కొరత వున్న రాష్ట్రప్రభుత్వాలు ఈ పథకాన్ని ఎత్తివేసే ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. వ్యవసాయ పనులు వున్న సమయంలో ఈ బిల్లులో 60రోజుల పనిని నిషేధిస్తున్నారని, దీంతో కూలీలకు పని దొరకని స్థితి ఏర్పడుతుంది. కూలీ తగ్గుతుందని, మహాత్మా గాంధీ పేరు తొలగించి చట్టం పేరుమార్చి వికసిత భారత్ " గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబి జి రాం జీ )పేరుగా తీసుకువస్తున్నారని తెలిపారు. గతంలో వున్న ఉపాధి హామీ చట్టం ప్రకారం 100 తగ్గకుండా పని కల్పించాలని, పనిదినాలు 200 రోజులకు పెంచాలని, కూలీని 307 నుండి రు.600 వరకు పెంచాలని, గత ఉపాధి చట్టాన్ని అమలు చేయాలని, తక్షణమే ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# స్పీకర్ నిర్ణయం న్యాయమైనది

- పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సంగారెడ్డి (జనం సాక్షి) : పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ తీసుకున్న నిర్ణయాన్ని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్వాగతించారు. స్పీకర్ నిర్ణయం న్యాయమైందని, నేను బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే అని, కాంగ్రెస్ పార్టీలో చేరలేదని స్పీకరే నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలో ముఖ్యమంత్రులను ,ప్రధానులను ప్రజాప్రతినిధులు కలుస్తూనే ఉంటామని అంతమాత్రం చేత పార్టీ మారినట్లు కాదని అన్నారు. గుడిలోకి వెళ్ళినప్పుడు ప్రధాని కూడ మూడు రంగుల కండువా వేసుకున్నారని, మూడు రంగుల కండువా కప్పుకున్నంత మాత్రాన కాంగ్రెస్ లో చేరినట్లు ఎట్లా అవుతుందని ప్రశ్నించారు. స్పీకర్ చెప్పినదాని ప్రకారం నేను బిఆర్ఎస్ ఎమ్మెల్యే నే అని క్లారిటీ ఇచ్చారు.

# కాంగ్రెస్ నేత సమద్ నవాబ్ సేవలు చిరస్మరణీయం

- నాకా చౌరస్తాలో ఒక రోడ్డుకు సమద్ నవాబ్ మార్గ్ గా నామకరణం చేస్తాం
- సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి.. ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్..జెఎసి జిల్లా అధ్యక్షుడు అబూ బకర్ ఖాలీద్



కరీంనగర్ డిసెంబర్ 17 (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, కరీంనగర్ వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ వ్యవస్థాపక కార్యదర్శి, ఇదారా ఎ ఖాదీమానే మిల్లత్ వ్యవస్థాపకుడు అబ్దుల్ సమద్ నవాబ్ సేవలు నేటితరానికి చిరస్మరణీయంగా మిగిలిపోతాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ముస్లిం జేఏసీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబుబకర్ ఖాలీద్ అన్నారు. సమద్ నవాబ్ ఇటీవలే హఠాన్మరణం చెందగా ఆయన సంతాప సభ బుధవారం కరీంనగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు అబూ బకర్ ఖాలీద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడు నవాబ్ అని ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. క్రమశిక్షణతో తన చివరి శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం సమద్ నవాబ్ అలుపెరుగని కృషి పోరాటం చేశారన్నారు. ఈ తరం కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సమద్ నవాబ్ ఆదర్శమని ఆయన మరణం తనను కలిసివేసిందన్నారు. గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ పోరాట పటిమ, పట్టుదల కలిగిన నాయకుడిని ముస్లిం సమాజం కోల్పోయిందని ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సేవలకు గుర్తింపుగా ఆయన కుటుంబానికి కుమారులకు ఎల్లప్పుడూ ముస్లిం జెఎసి అండగా ఉంటుందన్నారు. సమద్ నవాబ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన కుమారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, ముస్లిం జేఏసీ నాయకులు ఫసియుద్దీన్ నవాబ్, ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్, జమీల్, మునీబుద్దిన్, మౌలానా అలీముద్దీన్ నిజామి, ఖైరోద్దీన్, సమద్ నవాబ్ కుమారులు, కుటుంబ సభ్యులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# రెండేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

### ఓటేసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

మహబూబ్‌నగర్, డిసెంబర్17 (జనంసాక్షి) : అధికార పార్టీ ఎన్ని ఇబ్బందులు పెట్టిన బీఆర్ఎస్ అభ్యర్థులు తెగించి కొట్లాడుతున్నారని, మూడో విడతలలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపు ఖాయమని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో గ్రామాలు అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. రెండేళ్లుగా ప్రజలు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యేల సొంత గ్రామంలో కాంగ్రెస్ ఓటమి పాలవుతుండడంతో కాంగ్రెస్ సర్పంచును గెలిపిస్తేనే నిధులు మంజూరు చేస్తామని అనేక చోట్ల ఎమ్మెల్యేలు ఓటమితో ఫ్రస్ట్రేషన్‌తో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో అందరికీ ప్రజా ప్రతినిధిగా ఉంటారని, అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలను సమానంగా చూడాలన్నారు. సీఎం జిల్లా నుంచి ఉన్నప్పటికీ ఆశించినంత అభివృద్ధి జరగడం లేదని ఆరోపించారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని వెల్లడించారు.

# అమ్మ రక్షిత కార్యక్రమాన్ని సమర్థవంతంగా కొనసాగించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




నిర్మల్ రూరల్, డిసెంబర్17 (జనం సాక్షి) : జిల్లాలో ప్రసవ మరణాల నిర్మూలనకు అమలు పరుస్తున్న అమ్మ రక్షిత కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లాలో అమ్మ రక్షిత కార్యక్రమం అమలుపై వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రసవ మరణాలు నిర్మూలించేందుకు ఎక్కడా లేనివిధంగా అమలుపరిచిన అమ్మ రక్షిత కార్యక్రమం ప్రారంభించి ఇటీవలి సమస్యల కాలం పూర్తి చేసుకుందని గుర్తు చేశారు. అమ్మ రక్షిత కార్యక్రమం అమలు ద్వారా ప్రసవ మరణాలు జిల్లాలో గణనీయంగా తగ్గిపోయాయని తెలిపారు. అమ్మ రక్షిత కార్యక్రమం అమలు చేసి ప్రసవ మరణాలు తగ్గింపులో కృషి చేసినందుకు గాను, ఇటీవలి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లాఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులు సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు మరింత ఉత్సాహంతో ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. ప్రసవ మరణాల నిర్మూలనలో కావాల్సిన తోడ్పాటు నిరంతరం అందిస్తామని అధికారులకు కలెక్టర్ తెలిపారు. అమ్మ రక్షిత కార్యక్రమంలో గ్రామస్థాయిలో అంగన్వాడీ ఆశ కార్యకర్త మొదలుకొని, జిల్లాస్థాయి ప్రసూతి ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణ, చొరవ వల్ల జిల్లాలో ప్రసూతి మరణాలు గణనీయంగా తగ్గినట్లు వివరించారు. వీరందరిని కలెక్టర్ అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. గర్భిణుల ఆరోగ్య సలహాలు, పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన టెలిఫోన్ కాల్ సహాయ సదుపాయం నిరంతరం కొనసాగాలని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో ప్రసవ మరణాల తగ్గింపుకు అమ్మ రక్షిత కార్యక్రమం అమలుపరిచి ప్రసవ మరణాలను కట్టడి చేసినందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం అమలులో కలెక్టర్ ప్రోత్సాహం గొప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, వైద్యశాఖ అధికారులు గోపాల్ సింగ్, సౌమ్య, సరోజ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మైలార్‌దేవ్‌పల్లిలో ఇన్నోవా కారు బీభత్సం

### ఒకరు మృతి..తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు



హైదరాబాద్, డిసెంబర్17 (జనంసాక్షి) : నగరంలోని మైలార్‌దేవ్‌పల్లిలో ఇన్నోవా కారు బీభత్సం సృష్టించింది. ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారిపైకి కారు దూసుకెళ్లడంతో ఒకరు మరణించగా, తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో వేదంగా దూసుకొచ్చిన ఇన్నోవా కారు అదుపుతప్పి దుర్గానగర్ వద్ద ఓ షెడ్డులోకి దూసుకెళ్లిది. దీంతో అందులో నిద్రిస్తున్న వారిపైనుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో దీపక్ (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. అతని తండ్రి ప్రభుమహరాజ్ (60), సత్తునాథ్ (27) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఉస్మానియా దవాఖానకు తరలించారు. బాధితులు మధ్యప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. శంషాబాద్ నుంచి సంతోశ్‌నగర్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారులో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని వెల్లడించారు.

# వరి ధాన్యం దొంగతనం

నల్లబెల్లి, డిసెంబర్ 17 (జనంసాక్షి): మండలంలోని గోవిందాపురం గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని గుర్తు తెలియని దుండగులు దొంగిలిచ్చినట్లు బాధిత రైతు భూక్య శారద తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. డిసెంబర్ 16 రాత్రి రెండు ఎకరాల వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా తరలించినట్లు ఆమె బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు ధాన్యం బస్తాలు లోడ్ చేస్తున్నట్లు కనిపించడంతో దొంగతనం జరిగిందని అనుమానం బలపడిందన్నారు. ఈ ఘటనతో తనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని, కుటుంబ జీవనం ఇబ్బందుల్లో పడిందని వాపోయారు. పోలీసులు విచారణ చేసి దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# సిరిసిల్ల గడ్డ.. గులాబీ అడ్డా

- మరోసారి రుజువైంది
- 117 పంచాయతీల్లో 80 స్థానాలు కైవసం చేసుకున్న బీఆర్ఎస్
- అధికారంలో ఉండి చతికిలపడ్డ కాంగ్రెస్.. ప్రగల్భాలకే పరిమితమైన బీజేపీ
- రెండు దశాబ్దాలుగా మా పార్టీతో సిరిసిల్ల బంధం చెక్కుచెదరలేదు: కేటీఆర్



హైదరాబాద్ (జనంసాక్షి) : సిరిసిల్ల నియోజకవర్గంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అద్భుత విజయం సాధించిందని, సిరిసిల్ల గడ్డ మరోసారి గులాబీ అడ్డా అని రుజువైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మొత్తం 117 గ్రామ పంచాయతీలకుగాను, బీఆర్ఎస్ మద్దతుదారులు ఏకంగా 80 స్థానాల్లో ఘనవిజయం సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించారని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో మొత్తం ఐదు మండలాలలోని 117 గ్రామపంచాయతీలో ఎన్నికలు జరగగా 80 స్థానాలలో బిఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపిన పార్టీ నాయకులు విజయం సాధించారని అధికార దుర్వినియోగం, బల ప్రయోగం వంటి పద్ధతుల్లో ప్రయత్నం చేసిన అధికార పార్టీ కాంగ్రెస్ కేవలం 24 స్థానాల్లో చాలా కష్టం మీద గెలిచిందన్నారు.. బిజెపి మాత్రం కేవలం 13 గ్రామ పంచాయతీల్లో తమ పార్టీ మద్దతు దారులను గెలిపించుకోగలిగిందన్నారు. 'గత రెండు దశాబ్దాలుగా సిరిసిల్ల ప్రజలకు బీఆర్ఎస్ పార్టీతో ఉన్న అనుబంధం ఎంత బలమైనదో ఈ ఫలితాలు మరోసారి తేల్చిచెప్పాయి. ఉద్యమ పార్టీగా ఉన్నా, అధికార పార్టీగా ఉన్నా, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండానే గుండెల్లో పెట్టుకున్నారు" అని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేటీఆర్ తెలియజేశారు. ఎన్నికల కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపిన కేటీఆర్ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ విజయం సిరిసిల్ల ప్రజలు అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా, బీజేపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టి, కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. బీఆర్ఎస్ పార్టీపై నమ్మకం ఉంచి 80 స్థానాల్లో గెలిపించిన సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలకు పాదాభివందనం చేస్తున్నాను" అని కేటీఆర్ తెలిపారు.

### బీజేపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రగల్భాలకు చెక్

బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు వ్యాఖ్యలకు భిన్నంగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి. "సిరిసిల్లలో మెజారిటీ స్థానాలు గెలుస్తామని బండి సంజయ్ గారు ప్రగల్భాలు పలికారు. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు బీజేపీని పూర్తిగా తిరస్కరించారు. కేవలం 13 స్థానాలతో బీజేపీ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దాదాపు అన్ని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులు నామమాత్రపు పోటీ ఇచ్చి ఓటమి పాలయ్యారు. బీజేపీకి సిరిసిల్లలో ఉనికి లేదని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి.

# నూతన సర్పంచులు మినరల్ ఫండ్ కోసం పోరాడాలి

- తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు మడావి వెంకటేశ్వర్



కాసిపేట, డిసెంబర్ 17 (జనం సాక్షి ) : కాసిపేట మండల అభివృద్ధి కోసం నూతనంగా ఎన్నికైన సర్పంచులు అందరు కూడా ఐక్యంగా మినరల్ ఫండ్ కోసం పోరాడాలని తుడుం దెబ్బ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మడవి వెంకటేశ్వర్ పిలుపు నిచ్చారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు మడావి వెంకటేశ్వర్ తెలిపారు. రాజకీయాలు ఇక ఒదిలేయాలని, ఎన్నికల పూర్తయిన సందర్భంగా గెలిచిన వారికి శుభాకాంక్షలు తెలిపి, ఇక రాజకీయాలు వదిలేసి అభివృద్ధి వైపు బాట వేయాలన్నారు. కాసిపేట మండలంలో నిధులు ఉన్న ఇక్కడ వినియోగించు కోకపోవడం వల్ల కాసిపేట మండలం అభివృద్ధి చెందడం లేదన్నారు. ఇప్పటి నూతన సర్పంచులు ఐక్యంగా ఉండి మినరల్ ఫండ్ కాసిపేట మండలంలోని వినియోగించే విధంగా పోరాడాలన్నారు. దేవాపూర్ సిమెంట్ కంపెనీ నుంచి వచ్చే రూ. కోట్ల రూపాయల నిధులు పక్క ప్రాంతాలకు పోతుంది కాని కాసిపేట మండలంలో మాత్రం ఉపయోగించడం లేదన్నారు. దింతో పాటు మంచిర్యాల గోదావరి నీళ్లు కాసిపేటకు తీసుకురావాలని డిమెండ్ చేశారు. మంచిర్యాల నుంచి గోదావరి నీళ్లు 300 కిలోమీటర్ల దూరంలోని హైదరాబాద్ కు తీసుకెళ్తున్నారు కానీ పక్కన ఉన్న కాసిపేట మండలంకు కనీసం తీసుకు రాకపోవడం మరీ అన్యాయమన్నారు. మంచిర్యాల నుంచి వెంటనే గోదావరి నీళ్లు కాసిపేట మండలంకు తీసుకువచ్చి తాగు, సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
18 డిసెంబర్ 2025

# గాంధీజీపై విద్వేషంతో పేరు తొలగింపు

## ‘ఉపాధి’ హామీ చట్టానికి తూట్లు పొడిచిన బీజేపీ




ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి గాంధీ ఆలోచనలు అన్నా, పేద ప్రజల హక్కులు అన్నా ఎంతమాత్రం గిట్టవు అన్న సంగతి ప్రపంచానికంతటికీ తెలుసు. సరిగ్గా 20 సంవత్సరాల క్రితం నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ (కాంగ్రెస్) తెచ్చిన ఈ ఉపాధి పథకం గాంధీజీ గ్రామ స్వరాజ్ దార్శనికతకు సజీవ రూపమే కాక, కోట్లాది మంది గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలిచింది. కోవిడ్ -19 వ్యాపించిన సమయంలో దేశం మొత్తానికి ఆర్థిక భద్రత కల్పించిన మహత్తర పథకం ఇది. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే దాని ప్రాముఖ్యతను నీరు కార్చటానికి శతం విధాలా ప్రయత్నించింది. గ్రామీణ పేద ప్రజలకు పట్టెడన్నం పెడుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజిఎస్ఆర్ఎజిఎ) చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలో మోదీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఈ చట్టం పేరు మార్చే సాకుతో పేదల ‘ఉపాధి’ ఉసురు తీసేందుకు కుట్ర పన్నుతోంది. ఎంజిఎస్ఆర్ఎజిఎ రద్దు కోసమే ఉద్దేశించిన బిల్లుగా ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న ‘విబి-జి రామ్ జీ’ బిల్లును ప్రతిపక్షాల నిరసనల మధ్యనే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లోక్ సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. దీంతో ప్రతిపక్షాల సభ్యులు లేచి ముక్తకంఠంతో వ్యతిరేకించారు. జాతిపిత మహాత్మాగాంధీని అవమానించడానికి వీలు లేదని నినాదాలతో హోరెత్తించారు. గాంధీజీ చిత్రపటాలు చేబూని సభ్యులు వెల్లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. దీంతో సభా కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదాపడ్డాయి.

**నిరుపేదలపై కక్షసాధింపు:**
గాంధీపై ద్వేషంతో పేరు మార్చారని, నిరుపేదలకు మొండి చేయి చూపేందుకు చట్టంలో మార్పులు చేశారని ప్రతిపక్షాలు విమర్శించారు. ప్రతిపక్ష ఎంపిలు టిఆర్ బాలు, ప్రియాంక గాంధీ, శశిథరూర్, సౌగత రాయ్, సుప్రియాసూలే, ధర్మేంద్ర యాదవ్ తదితరులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ పట్ల కోపం, ద్వేషమే ఈ చట్టం పేరు మార్చడానికి అసలు కారణమని సభ్యులు విమర్శించారు. ‘మహాత్మా గాంధీ మొత్తం దేశానికి ఆస్తి, జాతిపిత పేరును మార్చడానికి కేంద్ర ప్రభుత్వం చూపుతున్న ఉత్సాహం ఆమోదయోగ్యం కాదు. దేశంలోని పేదలకు, నిరుపేదలకు ఆధారం, ఆశ్రయంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీసే విధంగా ఈ బిల్లు తీవ్ర పరిణామాలను కలిగి ఉంటుంది. ఉపాధి హామీ రోజులను 125 రోజులకు పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది.కానీ నిజానికి ఈ కొత్త బిల్లులో చట్టాన్ని బలహీనపరచే అనేక నిబంధనలు ఉన్నాయి’. ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. ఇప్పటికే కొన ఊపిరితో ఉన్న ఈ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం సమూలంగా మార్చి వేయడానికి కంకణం కట్టుకుంది. అందు కోసం అర్థం పర్థం లేని ఒక దిక్కుమాలిన ఒక పేరును వెదికి చివరికి మా’జీ రామ్ జీ’ అంటూ ఓ కొత్త పేరు పెట్టింది. ఈ కొత్త పథకంలో గాంధీ పేరుతో పాటు, మొత్తం ఉపాధి పథకానికే ఎసరు పెట్టే చర్యకు బీజేపీ పూనుకొన్నదని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ దేశ ప్రజలకు ఒక హెచ్చరిక చేశారు.

బీజేపీ చెప్పేది ఏమిటంటే...గత 20 ఏళ్ళలో దేశం లోని గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితుల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి కనుక... ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో మారిన సామాజిక ఆర్థిక పరిస్థితులకు తగినట్టుగా నూతన బిల్లును తీసుకొచ్చామని చెపుతుంది. గాంధీ పథకం కంటే ఈ “రామ్ జీ పథకం” మెరుగైనదని, మరింత మందికి ఉపాధిని ఇస్తుందని, గ్రామాల్లో తాగు నీరు, సాగు నీటి వనరులను మెరుగు పరుస్తుందని, ఉమ్మడి వసతులు, మౌలిక కల్పిస్తామని బీజేపీ చెపుతుంది. కానీ ఒక ప్రభుత్వం పథకంలో ఎన్నైనా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. దానికోసం పని కట్టుకొని ఒక పాపులర్ పథకానికి ఉన్న పేరును మార్చవలసిన అవసరం లేదు. ఇలా దేశంలో వివిధ పథకాలకు, రోడ్లకు,కట్టడాలకు దశాబ్దాలుగా ప్రజల మెదళ్ళలో స్థిరపడిన పేర్లను మార్చే దిక్కుమాలిన “ పిచ్చి తుగ్లక్” పనిని బీజేపీ తలకెక్కుత్తు కొన్నది. అసలు పేర్లు మార్చటం వల్ల వచ్చిన అదనపు లాభం ఏమీ లేనప్పటికీ ఎందుకు ఇలా ఆర్భాటం, హంగామా బీజేపీ చేస్తున్నదో...ఎవరికీ అంతు పట్టటం లేదు.
గత పథకం లోని ఉన్న మంచి ఆదర్శాలూ, ఆశయాలను ఈ కొత్త పథకంలో లేకపోతే,... ఈ నూతన పేరును ప్రజలు కచ్చితంగా నిలదీస్తారు. ఈ కొత్త బిల్లులో ద్వారా ఈ పథకం మీద కేంద్ర ప్రభుత్వం నియంత్రణను మరింత పెంచుకోనున్నదని, ఏ రాష్ట్రానికి ఎన్ని నిధులు ఇవ్వాలన్న అంశంతో సహా చాలా అధికారాలు కేంద్రం దఖలు పరచు కోవడం ప్రమాదకర సంకేతాలేనని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

**‘ఉపాధి’కి కొత్త రూపురేఖలు:**
ఇటీవలే ఈ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ రోజ్ గార్ యోజనగా మార్చి, పని దినాల సంఖ్యను కూడా నూట పాతిక చేసి, ఒక రోజు కనీస వేతనాన్ని 240 రూపాయలకు సవరించిన కేంద్ర ప్రభుత్వం ఇంతలోనే మనసు ఎందుకు మార్చుకుందో ఎవరికీ తెలియటం లేదు. కార్మిక చట్టాలను లేబర్ కోడ్స్ గా మార్చేసి నట్టుగా, ఈ పేర్ల మార్పిడి ఉద్యమంలో భాగంగానే ఇదీ జరిగిందని అనుకోలేం. ఈ పథకం అమలయ్యే ఆయా రాష్ట్రాలు, గ్రామీణ ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వమే ఎంపిక చేయడం. ఏయే రాష్ట్రాల్లో ఎంత మేరకు ఉపాధి పనులు అమలు జరగాలో నిర్దేశించడం, కేటాయించే నిధుల పరిమాణాన్ని నిర్ణయించడం వంటివి గాంధీ పథకం దిశదశ పూర్తిగా మారాయనడానికి ఒక నిదర్శనం.ఇప్పుడున్న 10 శాతం వాటా కే కష్టపడున్న రాష్ట్రాలు ఇకపై 40 శాతం బరువు నెత్తు కోవాలనడతోనే ఈ పథకం ఎంత ఘనంగా ఉండబోతుందో అర్థమవుతుంది. ఉపాధి పనులు, వాటి తీరుతెన్నులు, నిలిపివేత సమయాలు, కేటాయించే నిధులూ సర్వమూ ముందుగానే నిర్ణయమై పోతున్నందున ఇంత కాలమూ డిమాండ్ ఆధారిత పథకంగా ఉన్న ఉపాధి అవకాశాలు కాస్తా... “సప్లయ్” ఆధారిత మై పోతోంది . సంక్షేమం ఒక హక్కుగా ఉన్న గాంధీ పథకాన్ని మోదీ ప్రభుత్వం దాతృత్వ కార్యక్రమంగా నీరుగార్చిందని విమర్శకులు అంటున్నారు. పంచాయితీలు, రాష్ట్రాల చేతుల్లోంచి నిర్ణయాధికారాలను స్వాధీనం చేసుకుంటున్న కేంద్రం, అనేక రెట్ల ఆర్థిక భారాన్ని మాత్రం రాష్ట్రాల మీద రుద్దింది. రాజ్యాంగ బద్ధంగా దక్కిన పని హక్కును ఈ కొత్త బిల్లుతో కార్మికులు కోల్పోతున్నారు. ఇప్పటివరకూ స్వగ్రామం లోనే ఉపాధిని డిమాండ్ చేసి సాదించుకున్న గ్రామీణులు ఇకపై తమ గ్రామానికి కేంద్రం పని కేటాయించని పక్షంలో వలస పోవలసి రావచ్చు. పథకం పేరులో ఇంకా గ్యారంటీ మిగిలివున్నా, లోతుగా చూస్తే దేనికి గ్యారంటీ లేని రీతిలో మార్పు తెలివిగా జరిగింది. కొత్త చట్టంతో రాష్ట్రాల మీద యాబైవేలకోట్ల రూపాయల అదనపు భారం పడవచ్చునని ఓ అంచనా.
బిల్లు ఉపసంహరించు కోవాలన్న విపక్షాల డిమాండ్ ను ప్రభుత్వం అంగీకరించకున్నా, స్టాడింగ్ కమిటీకి పంపి అది తన చిత్తశుద్ధిని రుజువు చేసుకోవచ్చు. సభాముఖంగా విస్తృతమైన చర్చలు జరిపి, తదనుగుణమైన మార్పుచేర్పులు చేసి, అన్ని పార్టీల మద్దతుతో బిల్లును గట్టెక్కించినప్పుడే ఈ భారీ ప్రజాసంక్షేమ పథకం విలువ, గౌరవం నిలబడతాయి. కాంగ్రెస్ ఆరోపిస్తున్నట్ల గా ఒకవేళ గాంధీ పేరు ఇష్టంలేక తొలగించినా, తమకు ఎంతో ప్రీతిపాత్రమైన ‘రామ్’ అన్న సంక్షిప్త రూపాన్ని ఉపయోగిస్తున్నందుకైనా పాలకులు ఈ కొత్త పథకం ద్వారా నిరుపేదలకు, అన్నార్తులకు అన్యాయం జరగకుండా చూస్తే అంతే చాలు.



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9859328496

# ట్రంప్ జాతీయ భద్రతా వ్యూహం

## యూరప్ ఎదుర్కొంటున్న అస్తిత్వ సంక్షోభం!




యూరోపియన్ నాయకులు చాలా కాలంగా ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద సంస్థకు అమెరికా నుంచి నిర్భంధరహిత మద్దతు లభిస్తుందని ఆశించారు. కానీ మ్యూనిక్‌లో జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షుడి స్థాయిలోనే యూరోపియన్ మిత్రదేశాలపై దాడి చేసే వ్యాఖ్యలు, వలస విధానాలపై తీవ్ర విమర్శలు, స్వేచ్ఛా విలువలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. చివరకు అమెరికా యూరప్‌తో ఎలాంటి స్థాయిలో నిలుస్తుందనే ప్రశ్న అనిశ్చితిలో పడింది. ట్రంప్ పరిపాలన విడుదల చేసిన జాతీయ భద్రతా వ్యూహం అనే 31 పేజీల పత్రం, అమెరికా తన పతనాన్ని ఆపిందని అధ్యక్షుడిని ప్రశంసించడంలో ఎక్కువ సమయం కేటాయించింది. అదే సమయంలో ఇది పూర్తిగా ‘అమెరికా ముందు’ అనే వ్యాపార దృష్టితో రూపొందిన వ్యూహంగా కనిపిస్తుంది. ఆఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి ప్రాంతాలను దాదాపు పట్టించుకోకుండా, పశ్చిమార్థగోళాన్ని అమెరికా ప్రయోజనాల కోణంలో మాత్రమే చూసింది. యూరప్‌ను ఒక భాగస్వామిగా కాకుండా సమస్యగా వర్ణించింది. యూరోప్ గురించి ఈ వ్యూహం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. యూరోపియన్ యూనియన్ వలస విధానాలు, భావప్రకటన స్వేచ్ఛపై నియంత్రణలు, రాజకీయ ప్రత్యర్థుల అణచివేత వల్ల యూరోప్ తన సాంస్కృతిక గుర్తింపును కోల్పోతుందని పేర్కొంది. ప్రస్తుత దిశలోనే యూరోప్ సాగితే, కొద్ది దశాబ్దాల్లోనే కొన్ని నాటో సభ్యదేశాలు యూరోపియన్టేతర మెజారిటీ దేశాలుగా మారుతాయని హెచ్చరించింది. అమెరికా యూరోప్ తన గత మహత్తును తిరిగి పొందేందుకు సహాయం చేస్తుందని చెబుతూ, దేశభక్తి గల రాజకీయ శక్తులను ప్రోత్సహిస్తామని పేర్కొంది. యూరోపీయులకు ఇది స్వతంత్ర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యంలా కనిపిస్తోంది. కొందరికి ఇది ప్రభుత్వ మార్పు యత్నంలా అనిపిస్తోంది.
ఈ వ్యూహం ప్రకారం యూరోప్ తన రక్షణ బాధ్యతలను స్వయంగా భుజాలపై వేసుకోవాలి. రష్యాతో వ్యూహాత్మక స్థిరత్వాన్ని తిరిగి స్థాపించాలి. నాటో ఎప్పటికీ విస్తరిస్తూనే ఉండే కూటమి కాదని హెచ్చరిక ఇచ్చింది. రష్యా 2022లో ఉక్రెయిన్‌పై దాడి చేసిన తర్వాత స్వీడన్, ఫిన్లాండ్ నాటోలో చేరిన అంశాన్ని ఇది దాదాపు విస్మరించింది. ఈ పత్రంలో ప్రధాన ప్రమాదంగా చైనాను కాదు, యూరోప్ సాంస్కృతిక పతనాన్ని చూపించింది.జాతీయ భద్రతా వ్యూహం అనేది నేరుగా విధానం కాదు, కానీ పరిపాలన ఆలోచనా ధోరణికి మార్గదర్శకం. గతంలో ఇలాంటి పత్రాలు సంఘటనలతో మారిపోయిన సందర్భాలున్నాయి. అయినప్పటికీ, ఇది పార్లమెంట్ ఆదేశంతో రూపొందిన అధికారిక పత్రం కావడంతో నిర్లక్ష్యం చేయలేం. అక్షరాలా అమలు అవుతుందని భావించకపోయినా, దీనిని గంభీరంగా తీసుకోవాల్సిందే. ఇప్పుడు యూరప్ ముందున్న ఎంపికలు మూడు. మొదటిది, ఈ వ్యూహాన్ని పట్టించుకోకుండా కాలం గడిచిపోతుందని ఆశించడం. రెండవది, అధ్యక్షుడిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు పెంచడం. మూడవది, అమెరికా ఇక విశ్వసనీయ మిత్రుడు కాదని అంగీకరించి స్వయం రక్షణకు సిద్ధమవడం. మ్యూనిక్ సమావేశం తర్వాత యూరోప్ మొదటి రెండు మార్గాల మిశ్రమాన్ని ప్రయత్నించింది. రష్యా సామ్రాజ్యవాద ఆశయాల గురించి మాటలు చెప్పినా, చివరకు నాటోలో అమెరికా ఉండేలా చేయడంపైనే దృష్టి పెట్టింది. అధ్యక్షుడికి రెండోసారి రాజకీయం స్థాయి ఆహ్వానం ఇచ్చింది. జర్మనీ యూరోపియన్ స్వతంత్ర రక్షణ సామర్థ్యాలపై ఆలోచనలను పక్కన పెట్టి మరిన్ని అమెరికా ఆయుధాలను ఆర్డర్ చేసింది. అవి పనిచేయాలంటే అమెరికా గూఢచార సమాచారంపై ఆధారపడాల్సి వస్తుంది. హేగ్‌లో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశం, సభ్యదేశాలు తమ సైనిక వ్యయాన్ని జిడిపిలో ఐదు శాతానికి పెంచేందుకు అంగీకరించడమే కాకుండా, ప్రధాన కార్యదర్శి చేసిన వ్యాఖ్యలతో కూడా గుర్తుండిపోయింది.మూడవ మార్గం అత్యంత కఠినమైనది. యూరోప్ ఒక ఏకైక సైనిక శక్తిగా ఎప్పుడూ తనను తాను రక్షించుకోలేదు. సమగ్ర యూరోపియన్ రక్షణ వ్యవస్థ అనే భావన ఇప్పటికీ లేదు. సంయుక్త ఆయుధ అభివృద్ధి ప్రాజెక్టులు కూడా ముందుకు సాగడంలేదు. అమెరికా తన దళాలను వెనక్కి తీసుకుంటే, యూరోప్ తీవ్ర సైనిక లోటును ఎదుర్కోవాల్సి వస్తుంది. స్వచ్ఛంద నియామకాలు ఆ లోటును పూడ్చలేవు. అణు నిరోధక శక్తి, బ్రిటన్‌తో యూరోప్ సంబంధాల వంటి ప్రశ్నలు మరింత క్లిష్టంగా మారతాయి. ఈ వ్యూహంపై చర్చ కేవలం ఒక పత్రం గురించేం కాదు. యూరోప్ నియమాలపై ఆధారపడిన స్వేచ్ఛా ప్రపంచ వ్యవస్థను కాపాడాలనుకుంటుందా, లేక లావాదేవీల ఆధారంగా ప్రపంచాన్ని చూసే దృక్పథానికి తలవంచుతుందా అనే ప్రశ్న ఇది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన ప్రపంచ వ్యవస్థ లోపాలున్నప్పటికీ, అరణ్య న్యాయానికి అడ్డుగోడలా నిలిచింది. ఆ వ్యవస్థను కాపాడుకోవాలా లేక శక్తివంతుడే చట్టం అనే ప్రపంచానికి దారి ఇవ్వాలా అన్నది యూరోప్ ముందున్న కీలక నిర్ణయం.



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# వలసదారుల హక్కులను పరిరక్షించాలి

**డిసెంబర్ 18...అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం.**




ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వివిధ కారణాల వల్ల వలస వెళ్తుంటారు. ఈ వలసలు వారి జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి గానీ, జీవితాన్ని కాపాడు కోవడానికి గానీ జరుగుతుంటాయి. ఇలాంటి వలసదారుల హక్కులను గుర్తించడం, వారి కష్టాలను అర్థం చేసుకోవడం, వారికి సహాయం చేయడం కోసం అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 18న జరుపుకుంటారు. డిసెంబర్ 18ను అంతర్జాతీయ వలసదారుల దినోత్సవంగా 2000లో ఐక్యరాజ్యసమితి ప్రధాన అసెంబ్లీ ప్రకటించింది. 1990లో ఇదే తేదీన అంతర్జాతీయ వలసదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన కన్వెన్షన్ ఆమోదించ బడింది. ఈ నేపథ్యంతో వలసదారుల హక్కులను, వారితో ఉన్న సమస్యలను చర్చించేందుకు ఈ రోజు గుర్తింపును పొందింది.

**వలసదారుల పెరుగుదల వెనుక కారణాలు**

**ఆర్థిక అసమానతలు:** తక్కువ ఉపాధి అవకాశాలు, దారిద్ర్యం వలన వేలాది మంది మెరుగైన జీవనోపాధి కోసం వలస వెళ్లాల్సి వస్తుంది.
**పర్యావరణ విపత్తులు:** వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు (ఎడతెరిపి లేని వరదలు, కరువులు, అగ్నిపాతాలు) ప్రజలను వలసలకు బలవంతం చేస్తాయి.
యుద్ధాలు, రాజకీయ అస్థిరత: కొంతమంది జీవితం కోసం శరణార్థులుగా వలస వెళ్తే, మరికొందరు భద్రత కోసం కొత్త ప్రాంతాలను ఆశ్రయిస్తారు.
**శిక్షణా మరియు విద్యావకాశాలు:** అంతర్జా తీయ స్థాయిలో మెరుగైన విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం యువత వలసలు చెయ్యటం సర్వసాధారణం.

**వలసదారుల పాత్ర**

**ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు:** వలసదారులు వారి కృషితో అతిథి దేశాలకు ఆర్థికంగా విశేష ప్రయోజనం కలిగిస్తారు. రెమిటెన్సుల రూపంలో స్వదేశాలకు పెద్ద మొత్తంలో ఆర్థిక మద్దతును అందిస్తారు.
**సాంస్కృతిక మార్పిడి:** వారి సాంస్కృతిక సంపదతో కొత్త ప్రాంతాలను సుసంపన్నం చేస్తారు. సంగీతం, భాష, ఆహారపు అలవాట్లు వంటి అంశాల్లో కొత్త మార్పులను తీసుకు రావడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారు.
**సామాజిక శక్తుల అనుసంధానం:** వలస దారులు వారి మేధస్సు, సాంకేతిక నైపుణ్యాలను అతిథి దేశాలకు అందించడంతో పాటు స్థానిక సమాజ అభివృద్ధికి తోడ్పడతారు.
వలసదారుల ఎదుర్కొనే సవాళ్లు
**మానవ హక్కుల ఉల్లంఘన:** వలస దారులు తరచూ వివక్షకు గురవుతుంటారు. తక్కువ వేతనాలు, నిస్సహాయ పరిస్థితులు, చట్టపరమైన రక్షణల లోపం కారణంగా వారు తీవ్ర కష్టాలను అనుభవిస్తున్నారు.
**సాంస్కృతిక, సామాజిక ఒంటరితనం:** భాషా, ధార్మిక భిన్నత్వాలు వలసదారులను ఒంటరితనానికి గురిచేస్తాయి.
రాజకీయ అసమర్థత: అనేక దేశాలు వలసదారుల హక్కులను పరిగణలోకి తీసుకోవడం లేదా వారి అవసరాలను సరైన విధంగా సమర్థించడం లేదని విమర్శలు వస్తున్నాయి.
**ఆర్థిక అస్థిరత:** కొన్నిసార్లు వలస దారులు స్థిరమైన ఉపాధి లేకుండా ఆర్థిక అనిశ్చితిలో చిక్కుకు పోతున్నారు.

**భారతదేశంలో వలసదారుల స్థితి**

భారతదేశం ప్రాచీన కాలం నుండి వలసదారులను స్వీకరించే సంప్రదాయాన్ని కలిగి ఉంది.
అంతర్గత వలసలు: గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు వలసలు. ఉపాధి కోసం కార్మిక వలస ఎక్కువగా కనిపిస్తుంది.
అంతర్జాతీయ వలసలు: ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వలస పోయే భారతీయుల సంఖ్య గణనీయంగా ఉంది. వీరు భారతీయ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన విదేశీ మారక ద్రవ్యాన్ని తెస్తున్నారు.
శరణార్థుల సమస్యలు: తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అరుణాచల ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన శరణార్థులు భారత ప్రభుత్వం ద్వారా మద్దతు పొందుతున్నారు.


**వలసదారుల దినోత్సవం ప్రాముఖ్యత**

**అవగాహన పెంపుదల:** వలసదారుల కష్టాలను సమాజం గుర్తించడం, వారిపై ఉన్న అపనమ్మకాల్ని తొలగించడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం.వలస విధానాలు రూపకల్పన: వలస దారుల రక్షణ, హక్కుల కోసం అంతర్జాతీయ స్థాయిలో పటిష్ఠమైన విధానాలను రూపొందించేందుకు ఇది ప్రేరణగా పనిచేస్తుంది. **సమాజ అనుసంధానం:** వలసదారులు స్థానిక సమాజంలో సమగ్ర పరచబడేందుకు అవసరమైన చర్యలను ప్రోత్సహించడానికి ఈ రోజు దోహద పడుతుంది.
వలసదారులు ప్రపంచ ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక రంగాలకు ఎంతగానో తోడ్పడుతున్నారు. వారి కృషిని గౌరవించడం మన కర్తవ్యం. అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం ఈ అంశంపై మరింత అవగాహన కలిగించి, వారి హక్కులకు శ్రద్ధ వహించే దిశగా సమాజాన్ని ప్రోత్సహిస్తుంది. వలసదారులను అర్థం చేసుకుని, వారికి సహకరించడం ప్రపంచ సమాజంగా మన సామూహిక బాధ్యత.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

| | | | |
|---|---|---|---|
| **సుడులదారులు** | కథాభూషణం | గంతలు లేని రాజ్యం | నిజసంపద |
| నీతి పాలన | సత్యహరిశ్చంద్రుడు | ధర్మపతాకం | రేడియమ్ |
| అందరి అభిమతం | నిత్యస్మరణం | చెమట కష్టం | 9291527757 |
| ఆశల తోట | న్యాయ పాలన | పొట్టకూటికి యద్ధం | |

# పాలిటిక్స్ ఆఫ్ ది మైండ్: మార్క్సిజం అండ్ మెంటల్ డిస్ట్రెస్




డాక్టర్ ఇయాన్ ఫెర్గుసన్ (డాక్టర్ ఐయాన్ ఫెర్గుసన్) రాసిన పుస్తకం, “పాలిటిక్స్ ఆఫ్ ది మైండ్” ప్రస్తుతం ‘మానసిక ఆరోగ్యం’పై రాజకీయ స్థితిగతులు ఎలా ఉన్నాయో మార్క్సిస్ట్ దృక్పథంలో వివరిస్తుంది.
రచయిత, ఈ పుస్తకాన్ని ఒక స్పష్టమైన లక్ష్యంతో రాశాడు. ఆధునిక మానసిక ఆరోగ్య సంక్షోభాన్ని వ్యక్తిగత రోగం ముసుగులో దాచిపెట్టే పెట్టుబడిదారీ వ్యవస్థను బట్టబయలు చేస్తాడు. పుస్తకంలో మొదటి నుంచి చివరి వరకూ ఉన్న బలం ఇదే. ఇది సైకాలజీ మీద రాసిన పుస్తకం కాదు. ఇది రాజకీయ, ఆర్థిక వ్యవస్థ ఎలా మన మనసులను నిర్మిస్తుందో చూపే గ్రంథం. ఈ రంగంలో ఉన్న వాదనల్ని శాస్త్రీయ సమాచారం, ఆర్థిక డేటా, వర్గ సంబంధాలూ వంటి వాటితో కలిపి చూస్తే, ‘మానసిక ఆరోగ్య రంగం’ కేవలం వైద్య సమస్య కాదని స్పష్టమవుతుంది. ఇది ఒక రాజకీయ-ఆర్థిక నిర్మాణం.

**ఫెర్గుసన్ ప్రతిపాదిస్తున్న ప్రధాన భావనలు:**
పరాయితనం, దురవస్థలు (ఏలియేనేషన్ అండ్ డిస్ట్రెస్): ఆధునిక మానసిక వ్యధలకు మూలం మార్క్స్ చెప్పిన పరాయీకరణ ప్రక్రియలో ఉంది. అంటే, మనుషులు తమ పనిపై గానీ, జీవితంపై గానీ, సమాజంపై గానీ తమ ఆధిపత్యం (నియంత్రణ) లేకపోవడం అనే నిస్సహాయ స్థితిని కలిగించే పరాయీకరణలో ఉంది. మానవ శ్రేయస్సు కోసం కాక, పెట్టుబడి సేకరణ (అక్యుమిలేషన్ సంచయం) కోసం నడిచే వ్యవస్థ ఇది. శక్తిహీనతా, పరాయితనం వంటి బలమైన భావన ఆందోళననీ, నిరాశనీ, క్రుంగిపోవడాన్నీ, ఇతర వ్యధలనీ కలిగిస్తుంది. పని మీద నియంత్రణ లేకపోవడం, జీవన వేగం పెరగడం, వ్యక్తులకు గొంతు వినిపించనివ్వని రాజకీయ వాతావరణం, దోపిడి మీద నడిచే ఉత్పత్తి పద్ధతీ వంటి వాటి గురించి ఈ పుస్తకం చర్చిస్తుంది.
“కంటెంటెడ్ కౌ” (కంటెండెడ్ కౌ) పుస్తకం ప్రకారం, పాజిటివ్ సైకాలజీ అంటూ వెల్నెస్ యాప్స్ లతో సాగే “సంతోష పరిశ్రమ” (హ్యాపీనెస్ ఇండస్ట్రీ) నిజానికి, ప్రజలను నయం చేయడానికి కాకుండా, ఉత్పాదక శ్రామికులను ‘కొనసాగించడాని’ కోసం ఉంది. “రైతు సంతోషంగా ఉన్న ఆవులను పిండేస్తూ, పని చేయిస్తున్నట్టే, పెట్టుబడిదారు సంతృప్తికర ఉద్యోగులను దోపిడీ చేస్తూవుంటాడు.” ం క్రిస్ హార్మన్. అంటే, వ్యవసాయంలో పశువులను సంతోషంగా ఉంచడానికి వెనక ఉన్న ఉద్దేశ్యం, వాటి ఆరోగ్యం కాదు. ఉత్పత్తి పెరగాలి అన్నదే. అదే విధంగా కాపిటలిస్టు వ్యవస్థలో కార్మికుల మానసిక ప్రశాంతత ఉద్దేశ్యం కూడా మెరుగైన పనితీరూ, అధిక ఉత్పత్తీ, అత్యధిక లాభం. అంతేకానీ, మానవ జీవితం కాదు.
ఈ నేపథ్యంతో చూస్తే, ఆరోగ్య పరిశ్రమా (వెల్నెస్ ఇండస్ట్రీ), ధ్యానం యాప్లూ (మెడిటేషన్ యాప్స్), ఆఫీసుల్లాంటి పనిస్తలాల్లో హ్యాపీనెస్ కార్యక్రమలూ (వర్క్‌ప్లేస్ హ్యాపీనెస్ ప్రోగ్రామ్స్) వంటి వన్నీ నటనలుగా కనిపిస్తున్నాయి. వ్యక్తి తిరిగి పని చేయడానికి వీలు కల్పించడం కోసం ఉన్నాయి ఇవన్నీ!
జీవితం వైద్యీకరణ (ది మెడికలైజేషన్ ఆఫ్ ఎగ్జిస్టెన్స్): ఫెర్గుసన్ పుస్తకంలోని ఇది అత్యంత శక్తివంతమైన భాగం. ఇది ఆయన స్వంత వృత్తిపరమైన అనుభవంతో కూడిన భాగం. ఇది పుస్తకంలో నెమ్మదిగా నిర్మించిన కీలక వాదన. మానసిక వైద్యశాస్త్రానికీ, ఔషధ పరిశ్రమకీ (“బిగ్ ఫార్మా”) మధ్య ఉన్న బంధుత్వాన్ని రచయిత గట్టిగా విమర్శిస్తాడు. రోజువారీ మనిషి బాధలను కొత్త కొత్త వైద్య రుగ్మతలుగా నిర్వచిస్తూ ఉంటారు కేవలం లాభాలు ఉత్పత్తి చేసేందుకే అంటూ వాదిస్తాడు.
**గణాంక ప్రధానాంశాలు:** వైద్యీకరణ ప్రభావం, కార్పొరేట్ ప్రభావం ఎంత భారీ ఎత్తుగా జరుగుతుందో చూపించడానికి ప్రత్యేక సంఖ్యలను రచయిత అందిస్తాడు: 2012లో యూకేలో జారీ చేసిన యాంటీడిప్రెసెంట్ ప్రిస్క్రిప్షన్ల సంఖ్య 50 మిలియన్లు (ఆ సమయంలో అదే అత్యధికం). యూకేలో కొన్ని ప్రాంతాలలో ఒక నెలలో సగటున ప్రతీ ఆరుగురిలో ఒక వ్యక్తి యాంటీడిప్రెసెంట్లను తీసుకోవడం జరిగింది. షిజోఫ్రెనియా, మూడ్ డిసార్డర్ల విషయంలో ఏర్పరచిన ‘డీ ఎస్ ఎమ్-4’ (డీఎస్ఎమ్-ఐవీ) ప్యానల్ ఉన్న 100 శాతం సభ్యులకు ఔషధ పరిశ్రమతో డబ్బు సంబంధాలు ఉన్నాయి. మొత్తం డీఎస్ఎమ్-ఐవీ రచయితలలో 50 శాతం మంది ఔషధ పరిశ్రమతో ఆర్థిక లావాదేవీలు కలిగివున్నారు. ‘అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్’ వార్షిక ఆదాయం 100 మిలియన్ డాలర్లు, ఇందులో అధికభాగం డీఎస్ఎమ్ నుంచే. 2020 నాటికి టాప్ 10 ఔషధ కంపెనీల లాభాలు, ఫార్చ్యూన్ 500లో ఉన్న మిగతా 490 కంపెనీల మొత్తం లాభాలను మించి ఉంటాయని ఈ పుస్తకం అంచనా వేసింది. మానసిక రుగ్మతల నిర్ధారణా, గణాంక మాన్యువల్ (డీఎస్ఎమ్) అనేది కేవలం ఒక వైద్య పుస్తకం కాదు. కాపిటలిజం అవసరాలకు సరిపడే “వ్యక్తి ఎలా ఉండాలి” అనే ప్రమాణ పుస్తకం!
నిజానికి, ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కావు. ఇవి రాజకీయ, ఆర్థిక వాస్తవాలు. ఒక శాస్త్ర శాఖ స్వతంత్రం కాదు. అది తయారు చేసేది ఏ వర్గ ప్రయోజనానికి అనుకూలంగా ఉందీ అనేదే దాని దిశ. ఈ అంకెలను సంచలనం కోసం పెట్టలేదు. “ఇది రోగం” అని నిర్ణయించేది ఎవరు? దాన్ని చికిత్స చేయడంలో లాభం ఎవరికి? అనే ప్రశ్నలు ఇక్కడ ముఖ్యం. “పెట్టుబడిదారీ విధానం (కాపిటలిజం) దుఃఖాన్ని రోగంగా మార్చుతుంది. ఆ రోగానికి చికిత్స పేరుతో మార్కెట్‌ను తెరుస్తుంది” అంటూ రచయిత వివరిస్తారు.పుస్తకంలోని అసలు లైను ఇదే: “వీ లివ్ ఇన్ ఏ వరల్డ్ విచ్ పాథాలజైజెస్ ఆర్డినరీ సాడ్నెస్.” అంటే, దుఃఖం అనేది రోగం కాదు. దుఃఖం అనేది మనిషి జీవించే వాతావరణానికి సహజ ప్రతిస్పందన. ఈ వాతావరణం తప్పుగా నిర్మితమైంది అని.
మానసిక ఆరోగ్యంపై విభిన్న నమూనాలు (కాన్ఫ్లిక్టింగ్ మోడల్స్ ఆఫ్ మెంటల్ హెల్త్): ఆధిపత్యంలో ఉన్న “మెడికల్ మోడల్”ను “రేడికల్/మార్క్సిస్ట్ మోడల్”తో పోలుస్తూ, ఫెర్గుసన్ వైరుధ్యాలను పుస్తకం పొడుగునా చూపిస్తాడు.

**మెడికల్ (లేదా క్యాపిటలిస్ట్) మోడల్ ఏం చెపుతోంది?**
మనిషిలో రసాయనాల లోపం ఉందనీ, జన్యువుల్లో దోషం ఉందనీ, వ్యక్తినే మూల కారణంగా చూపిస్తుంది. దుఃఖం, ఆందోళనా వంటి భావవేశాలు కూడా రుగ్మతలే ఇక్కడ. కాబట్టి, మందులతో వ్యక్తిని చికిత్స చేస్తుంది. లాభాలనీ, ఉత్పాదకతనీ సంపాదిస్తుంది. ఇదంతా వ్యక్తి స్థాయిలో జరుగుతుంది.

**రాడికల్ (లేదా మార్క్సిస్ట్) మోడల్ ఏం చెప్తోంది?**
మానసిక గాయాలూ, పేదరికం, దోపిడీ, ఒంటరితనం, హింసా, అణచివేతలూ, అసమానతలూ వంటివి అసలు కారణంగా వివరిస్తుంది. కాబట్టి, చికిత్స, మూల కారణం అయిన సామాజిక వ్యవస్థకి కావాలంటుంది. ఇక్కడ మానవ అవసరాలు ముఖ్యం. వారి విముక్తి ముఖ్యం.పుస్తకంలో రచయిత చెప్పే ముఖ్య అంశం: దుఃఖం వ్యక్తికి సంబంధించిన సమస్యలా కనిపించినా వాస్తవానికి అది సమాజ నిర్మాణ సమస్య. అంటే వ్యక్తి ఒంటరిగా “కోప్” చేయలేడు. వ్యవస్థ రూపం మారాలి.ఇవి రెండు వర్గాల దృక్పథాలు. ఒకటి లాభం కోసం పాటుపడితే, రెండోది మనిషి విముక్తి కోసం పాటుపడుతుంది. మెడికల్ మోడల్ వ్యక్తిని విడదీస్తుంది. కానీ, రాడికల్ మోడల్ వ్యక్తిని సమాజంతో మళ్లీ కలుపుతుంది. పెట్టుబడిదారీ విధానం ప్రపంచాన్ని చిన్న చిన్న వ్యక్తులుగా చీల్చి చూస్తుంది. మార్క్సిజం ప్రపంచాన్ని సంబంధాలుగా చూస్తుంది.
కొత్త దృష్టికోణం (ది న్యూ పారడైమ్): ఈ పుస్తకం 21వ శతాబ్దంలో బయాలజీ, సమాజ శాస్త్రాన్ని కలిపే మోడల్ వైపు సాగే మార్పును గుర్తిస్తుంది. ఫెర్గుసన్ సంపూర్ణ బయాలజీని ఖండించడం లేదు. పుస్తకం చివర్లో ఆయన న్యూరోసైన్స్, ట్రామా రీసెర్చ్, అటాచ్‌మెంట్ థియరీ వంటి మార్గదర్శకాలను చర్చిస్తాడు. ‘మెదడు నిర్మాణం’ జీవిత అనుభవాల ద్వారా (సమాజ పరిస్థితుల ప్రభావం ద్వారా) రూపొందుతుందని రచయిత వక్కాణిస్తాడు. ప్రధాన చలన శక్తులు: ఆఘాతం (ట్రామా), వియోగం (డిసోసియేషన్), అనుబంధం (అటాచ్‌మెంట్) అంటూ న్యూరోసైన్స్ కూడా చెప్తోంది. కాబట్టి, మార్క్సిస్ట్ మోడల్, న్యూరోసైన్స్ ఇప్పుడు ఒకదానికొకటి వ్యతిరేకం కాదు. ఒకే దిశలో నడుస్తున్నాయి. సమాజాన్ని సమానత్వ పద్ధతిలో నిర్మిస్తే, వ్యక్తిగత బాధలు గణనీయంగా తగ్గుతాయి. ఇదే రచయిత చెప్పే “సేన్ సొసైటీ” (ఆరోగ్యవంతమైన సమాజం). ఇది వైద్యరంగం కాదు. రాజకీయ ప్రణాళిక.

**సారాంశ సమీక్ష:**
‘పాలిటిక్స్ ఆఫ్ ది మైండ్’ పుస్తకం మూడు వాదనలను ఒకేసారి చేస్తుంది: మానసిక ఒత్తిడి వ్యక్తిగత వైఫల్యం కాదనీ, ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మించే అనారోగ్య జీవన విధానమనీ, దీని పరిష్కారం మందుల్లో కాదు, రాజకీయ-ఆర్థిక మార్పులో ఉందనీ. ఇది ఒక వైద్యశాస్త్ర గ్రంథం కాదు. ఇది ఒక రాజకీయ గ్రంథం. కానీ, రచయిత శాస్త్రీయ డేటాను వర్గ విశ్లేషణలో కలిపి చూపిస్తాడు. ఇదే దీనికి బలమైన స్థానం.

**రచయిత గురించి:**
డాక్టర్ ఇయాన్ ఫెర్గూసన్ (పీ.హెచ్.డీ) అనేక ఆర్టికల్స్, అనేక పుస్తకాలు రచించారు. ఉదాహణకు, ‘రిక్లైమింగ్ సోషల్ వర్క్: ఛాలెంజింగ్ నియోలిబరలిజం అండ్ ప్రమోటింగ్ సోషల్ జస్టిస్’, ‘రాడికల్ సోషల్ వర్క్ ఇన్ ప్రాక్టీస్’ (రోనా వుడ్‌వార్డ్‌తో), ‘గ్లోబల్ సోషల్ వర్క్ ఇన్ ఏ పొలిటికల్ కాంటెక్స్ట్: రాడికల్ పెర్స్పెక్టివ్స్’ (మైఖేల్ లావాలెట్ మరియు వాసిలియోస్ ఇయోకిమిడిస్‌తో), పాలిటిక్స్ ఆఫ్ ది మైండ్: మార్క్సిజం అండ్ మెంటల్ డిస్ట్రెస్ (2వ ఎడిషన్, 2023). అతను సోషల్ వర్క్ యాక్షన్ నెట్‌వర్క్ (ఎస్‌డబ్ల్యుఏఎన్) వ్యవస్థాపక సభ్యుడు. క్రిటికల్ అండ్ రాడికల్ సోషల్ వర్క్: యాన్ ఇంటర్నేషనల్ జర్నల్ యొక్క మాజీ వ్యవస్థాపకుడు/సహ-సంపాదకుడు, ప్రస్తుత సలహా సంపాదకుడు. ఇంటర్నేషనల్ సోషలిజం జర్నల్ (ఐఎస్‌జే.ఆర్గ్.యూకే) లో ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు. (బ్లాగ్ చిరునామా: హెచ్‌టీటీపీఎస్://యునైటెడ్‌వరల్డ్2025. బ్లాగ్‌స్పాట్.కామ్/)

ఆర్కే వెంకట్
హైదరాబాద్, 8096480227

# మంచన్‌పల్లి పంటలకు కోటిపల్లి ప్రాజెక్టు నీటిని విడుదల చేయండి

**• ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి**



**తాండూరు, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** పెద్దేముల్ మండలం మంచన్పల్లి గ్రామ రైతుల పంట పొలాలకు కోటపల్లి ప్రాజెక్టు నీటిని వెంటనే విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ను తెలంగాణ శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి కోరారు. బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఆయనకు మంచన్పల్లికి చెందిన నాయకులు సర్పంచ్, మాజీ సర్పంచ్ లు గోపి నాయక్ ,మాన్య నాయక్ తదితరులు కోటపల్లి ప్రాజెక్ట్ కాలువల మరమత్తుల కారణంగా తమ పంటలకు నీటిని అధికారులు నిలిపివేస్తున్నారని మహేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఇరిగేషన్ శాఖ అధికారులు మంచన్ పల్లి గ్రామాంలో పర్యటించనున్నారని, ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కు సమస్యను వివరించి, తమ పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేయించాలని రైతులు మహేందర్ రెడ్డిని కోరారు. వెంటనే స్పందించిన మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతి జైన్ కు ఫోన్ చేసి కాల్వల మరమ్మత్తుల నేపథ్యంలో పంట పొలాలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచనపల్లిలో చాలా మటుకు గిరిజన రైతులు ఉన్నారని, వారిపంట దిగుబడులు వస్తున్న తరుణంలో నీరు అందుకుంటే నష్ట పోతారని పేర్కొంటూ , రైతులు నష్టపోకుండా మరో కొన్ని రోజులు పంటలకు నీటిని వదిలి ఆ తర్వాత మరమ్మత్తులు చేసేలా చూడాలని ఆయన కలెక్టర్ కోరారు. అందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ రైతులకు నష్టం జరగకుండా చూస్తామని పంటలు ఎండిపోకుండా నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పెద్దేముల్ సర్పంచ్ డీవై నర్సింలు, పలువురు రైతులు తదితరులు ఉన్నారు.

## జిహెచ్‌ఎంసీ 16 డివిజన్‌కు కుషాయిగూడ పేరు పెట్టాలి




**కాప్రా, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** జిహెచ్ఎంసి 16 వ డివిజన్ కి కుషాయిగూడ పేరు ను పెట్టాలని కోరుతూ కుషాయిగూడ వెలోర్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో నేడు జోనల్ కమిషనర్ ఆఫీస్ లో అభ్యన్తర పత్రం సమర్పించడం జరిగింది. ఈ అభ్యన్తరానికి మద్దతుగా అభ్యన్తరంతెలుపుతూ సీసీస్ అధ్యక్షులు,శివసాయి నగర్ కాలనీ అధ్యక్షులు వెంపల్లి పద్మారెడ్డి, నాగార్జున నగర్ కాలనీ అధ్యక్షులు యావపురం రవి, సాయినగర్ కాలనీ అధ్యక్షులు సారా వినోద్ ముదిరాజ్, వైష?వి ఎంక్ లెవ్ అధ్యక్షులు గంప క ృష?, ఇంద్రనగర్ కాలనీ మాజీ అధ్యక్షులు సారా అనిల్ ముదిరాజ్ లు వారి వారి కాలనీ ల నుండి అభ్యన్తర పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కుషాయిగూడ వెలోర్ అసోసియేషన్ తరపున కుషాయిగూడ వెలోర్ అసోసియేషన్ కోశాధికారి చిత్తుల కిషోర్ గౌడ్, జాయింట్ సెక్రటరీ నాలచెరువు జనార్దన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిట్ల రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొని అభ్యన్తరం తెలుపుతూ నిరసన తెలియజేయడం జరిగింది.

## తుర్కపల్లి డ్రైనేజీ కాలవ పనులకు శంకుస్థాపన



**అల్వాల్, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** మచ్చబొల్లారం డివిజన్‌లోని తుర్కపల్లి ఎల్లమ్మ ఆలయం సమీపంలో 80 మీటర్లు 4.70 లక్షలు, మసీదు గల్లీలో 100 మీటర్లు 5.60 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిచ్చనున్న కొత్త డ్రైనేజీ కాలవ పైపు లైన్ పనుల కు స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రాంత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాంతీయులు బోర్వెల్లు పనిచేయడం లేదని, వీధిదీపాలు వెలగడం లేదని, ఉదయం%--%సాయంత్రం పీక్ సమయాల్లో అదనపు బస్సులు కావాలని ఫిర్యాదు చేశారు. జితేంద్రనాథ్ ఈ సమస్యలను మైనంపల్లి ద ృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు రాము, బాల్ రెడ్డి, శ్రీనాథ్, రమేష్, ఆనంద్, రేవతి, కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి, బొబ్బిలి, లడ్డుపాటెల్, వెంకటేష్ గౌడ్, శ్రీశైలం, యాదవ్, దిడ్ల స్వామి, నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్ ఆదిత్య మరియు ఇతర స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేవెళ్లలో ఆర్‌ఎస్‌ఎస్ సేవా ప్రస్థానంపై కరపత్రాల పంపిణీ



**చేవెళ్ల, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జాతి సేవలో వందేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని చేవెళ్ల వివేకానంద కళాశాల ఏబీవీపీ విద్యార్థులు బుధవారం చేవెళ్లలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంచుతూ...సమర్థ భారత నిర్మాణ భావనను ప్రజలకు వివరించారు. ఆర్ఎస్ఎస్ 1925లో ప్రారంభమై రాజకీయాలకు అతీతంగా సమాజ శ్రేయస్సే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నదని తెలిపారు. భారతీయ సంస్కృతి, సామాజిక సమరసత, స్వావలంబన, దేశభక్తి వంటి విలువలపై ప్రజలకు వివరించారు. స్వదేశీ ఉత్పత్తుల వినియోగం, ప్రక ృతి పరిరక్షణ ప్రాధాన్యతను వివరించడంతో పాటు సమాజంలో ఐక్యత అవసరమని తెలియజేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో కరపత్రాల పంపిణీ, చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమాలకు స్థానికుల నుంచి మంచి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు.

## జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఖో-ఖో పోటీలకు తుంకుంట విద్యార్థులు



**శామీర్‌పేట్, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** యాదద్రి బువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగిలో 69వ ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 సంవత్సరాల రాష్ట్ర స్థాయి బాల బాలికల ఖో- ఖో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూముకుంటకు చెందిన10వ తరగతి చదువు తున్న మధు సాయి గౌతమ్ 9వ తరగతికి చదువుతున్న జి సాయి, అలేఖ్య జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాలల క్రీడల సమాఖ్య జోనల్ కార్యదర్శి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖో - ఖో సంఘం ఉపాధ్యక్షుడు గుర్రం సత్తిరెడ్డి తెలిపారు . ఈనెల 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు అయోధ్యలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని బుధ వారం బయలుదేరి వెళ్లారని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే తెలంగాణ బాలుర జట్టుకు కోచ్ గా వినోద్ కుమార్, బాలికల జట్టుకు కోచ్‌గా శ్రీనివాస్ యాదవ్ వ్యవహరిస్తారని అయన అన్నారు. జాతీయ జట్టుకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వెంకట్ రెడ్డి, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు తిరుమలేష్, ఉపాధ్యాయ బ ృందం, విద్యార్థులు తదితరులు అభినందించారు.

## నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్



**హయత్ నగర్, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** హయత్ నగర్ డివిజన్‌లోని బృందావన్ కాలనీలో నూతన సిసి రోడ్ల నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "కాలనీలో ఉన్న రహదారుల దయనీయ స్థితిని గమనించి ప్రజల అభ్యర్థన మేరకు సిసి రోడ్ల పనులను ప్రారంభించామని, డివిజన్‌లో ఎక్కడ సమస్య ఉన్నా అక్కడ వెంటనే పనులు చేపట్టడం మా బాధ్యత అని వారు అన్నారు. రాబోయే రోజు లలో మరిన్ని వసతులను కల్పించేలా సంబంధిత అధికారులతో కలిసి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తాం అని వారు తెలిపారు. ప్రజలు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలిని వాటిని పరిష్కరించేందుకు మా వంతు క ృషిని చేస్తాం అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో బ ృందవాన్ కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మధుర నగర్ కాలనీ అధ్యక్షులు అమల్, సంక్షేమ సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు సురేష్ రెడ్డి, శ్రీకాంత్, ప్రేమ్, అఖిలేష్, ప్రణవ్, తదితరులు పాల్గొన్నారు.

## శామీర్‌పేట్ డివిజన్‌గా మార్చాలి



**శామీర్‌పేట్, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** నూతనంగా ఏర్పడినటువంటి తుంకుంట డివిజన్ పేరును షామీర్ పేట్ డివిజన్‌గా మార్చాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయిని శివ బీజేవైఎం మేడ్చల్ డిస్ట్రిక్ట్ వైస్ ప్రెసిడెంట్, దేశం పవన్ గౌడ్ డిస్టిక్ సీనియర్ నాయకుడు, వంగ రవి కిరణ్ రెడ్డి యాష్కి ప్రవీణ్ గౌడ్, దుర్గాప్రసాద్ కార్తీక్ రెడ్డి అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధి వినాయక కాలనీలో పర్యటించిన కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు సిద్ధి వినాయక కాలనీలో పర్యటించి కాలనీలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు పనులను పరిశీలించారు. కాలనీవాసులు కాలనీలో ఉన్నటువంటి పలు వీధుల్లో భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ సదుపాయం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్పొరేటర్‌కి వివరించడంతో వారు వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా భూగర్భ డైనేజ్ పైప్‌లైన్ సదుపాయం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వారు కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు దుర్గా ప్రసాద్, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, చరణ్, కనకారావు, లింగం, భాస్కర్, భీమరాజు, వేణుగోపాల్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## హస్తెపూర్ గ్రామాభివృద్ధికి సహకరిస్తాం

**• చేవెళ్ల సొసైటీ దేవర వెంకట్ రెడ్డి**



**చేవెళ్ల, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** హస్తెపూర్ గ్రామాభివ ృద్ధికి సహకరిస్తామని చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం హస్తెపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా గెలుపొందిన జ్యోతి భూపాల్ గౌడ్‌ను చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండల మహిళా అధ్యక్షురాలు దేవర సమతా వెంకట్ రెడ్డి, ఛన్వెల్లి సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా, మాజీ చేవెళ్ల యూత్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ పాటి దామోదర్ రెడ్డి లు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండల మహిళా అధ్యక్షురాలు దేవర సమతా వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హస్తెపూట్ సర్పంచ్ మాట్లాడుతూ...గ్రామ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి

**• ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**చేవెళ్ల, డిసెంబరు 17 (జనంసాక్షి) :** చేవెళ్ల మండలంలోని నూతనంగా ఎన్నికైనా సర్పంచ్ ల గ్రామాల అభివ ృద్ధికి క ృషి చేస్తానని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలం రేగడి ఘనాపూర్ సర్పంచ్ గా గెలుపొందిన తిప్పని మాదవి రాంరెడ్డి, ఉపసర్పంచ్ మహేశ్వరీ రాములు, నూతనంగా గెలుపొందిన వార్డు సభ్యులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేవెళ్ల మనలంలోని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ల గ్రామాల అభివ ృద్ధికి క ృషి చేస్తాన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాలను అభివ ృద్ధి చేయడంలో సర్పంచ్లు ముందుండాలని సూచించారు. అనంతరం సర్పంచ్ మాధవిరామ్ రెడ్డి మాట్లాడుతూ... రేగడి ఘనాపూర్ గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. వరుసగా 7 సార్లు మద్దతుదారులు తమ కుటుంబాన్ని గెలిపించినట్లు ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామ ప్రజలు నాపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాన్ని అభివ ృద్ధి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రేగడిఘనాపూర్ కు పార్టీ కార్యకర్తలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

**• ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



**తాండూరు, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివ ృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూర్ మండలం మల్కాపూర్ గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన సిరిగిరిపేట్ పండరి మరియు వార్డ్ మెంబెర్స్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియాజేసి గ్రామ అభివ ృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేస్తూ మేజర్ గ్రామ పంచాయతీ అయినా మల్కాపూర్ ను ఆదర్శ గ్రామంగా అభివ ృద్ధి చేసే విధంగా పని చేయాలనీ,గ్రామ సమస్య పరిష్కరనికి ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారిగ పరిష్కారం చేసే విధంగా చూడలని,ఎమ్మెల్యేగా పూర్తి సహాయ సహాకరలు ఉంటాయని గ్రామస్తులకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## బీఎన్ రెడ్డి, భరత్ నగర్‌లను చర్లపల్లి డివిజన్‌లో కలపాలి



**కాప్రా, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** జీహెచ్ఎంసి వార్డుల విభజనలో భాగంగా చర్లపల్లి డివిజన్ పరిదిలోని బి.ఎన్.రెడ్డి నగర్ భరత్ నగర్ కాలనీలను ఇతర డివిజన్లలో కలిపారని తిరిగి చర్లపల్లి డివిజన్లో కలపాలని బిఆర్ఎస్ నాయకులు జౌండ్ల ప్రభాకర్ రెడ్డి , డప్పు గిరిబాబులు కోరారు. చర్లపల్లి డివిజన్ కు చెందిన అన్ని పార్టీల నాయకుల అధ్వర్యంలో బుదవారం కాప్రా సర్కిల్ కార్యలయంలో డిప్యూటి కమిషనర్ జగనన్ ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల విభజనలో చర్లపల్లి డివిజన్ కు తీవ్ర అన్యాయం జరిగిందని ఈప్రాంతానికే గుర్తింపుగా ఉన్న చర్లపల్లి రైల్వే స్టేషన్, భరత్ నగర్ కాలనీలను శక్తిసాయినగర్ డివిజన్లో, చర్లపల్లి జైలుతో పాటు బిఎన్ రెడ్డి నగర్ కాలనీ ని ఎక్కడో దూరంగా ఉన్న చక్రిపురం డివిజన్ లో కాలిపారని అన్నారు. అలాగే ఈసినగర్ కాలనీని విడదీసి రెండు డివిజన్లలో చేర్చడమేమిటని ఈసినగర్ కాలని ని చర్లపల్లి డివిజన్లో ఈసినగర్ కాలనీ గణేష్ దేవాలయంను చక్రిపురం వార్డులో చేర్చడమేమిటని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో కాలనీవాసులు, వివిద పార్టీల నాయకులు మెట్టు మన్మోహన్ రెడ్డి, కోల నరేష్ గౌడ్, కొక్కొండ బాలరాజు, కడియాల అనిల్ కుమార్, రెడ్డినాయక్, రాజిరెడ్డి, రమాపతి, ఏజాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులకు సన్మానం



**చేవెళ్ల, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలో ఇటీవల నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో గుండాల గ్రామ సర్పంచ్‌గా నక్క బుచ్చిరెడ్డి, 7వ వార్డు సభ్యుడిగా తలారి యాదయ్య (రాజు) ఘన విజయం సాధించిన నేపథ్యంలో వారిని చేవెళ్లకు చెందిన సామాజిక కార్యకర్త అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ్ రెడ్డి టీం సభ్యులు యాసీన్, విష్ణు, మోసిన్, శ్రీనాథ్ రెడ్డి, జాహేద్‌లు పాల్గొని శాల్వాలు కప్పి మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ... ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల సర్వతోముఖాభివ ృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అవసరమైన సదుపాయాల విస్తరణ, ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేస్తూ గ్రామాలను అభివ ృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా గొల్లపల్లి సర్పంచ్‌గా లొంక శ్రీనివాస్ గౌడ్, ఖానాపూర్ సర్పంచ్‌గా సింధూర వెంకటేష్, మిర్జాగూడ సర్పంచ్‌గా సుష్మ మల్లేష్, ఆలూరు సర్పంచ్‌గా భాగ్య శేఖర్ గౌడ్, హస్తెపూర్ సర్పంచ్‌గా జ్యోతి భూపాల్‌లను కూడా శాల్వాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు పాల్గొని నూతన ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు.

# ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

**● మక్తల్ నియోజకవర్గంలో 83.53 శాతం**

**మక్తల్, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో తుది విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఐదు మండలాల్లో 110 గ్రామ పంచాయతీలు, 994 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా 10 గ్రామ పంచాయతీలు, 219 వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో మిగిలిన 100 గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకు, 775 వార్డు సభ్యులకు ఎన్నికలు బుధవారం నిర్వహించారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది. నియోజకవర్గంలోని మక్తల్, మాగనూర్, కృష్ణ, నర్వ, ఊట్కూర్ మండలాల్లో బుధవారం పోలింగ్ నిర్వహించారు. సంగంబండ పోలింగ్ కేంద్రంలో మక్తల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గవినోళ్ళ రాధా మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా గడ్డంపల్లి పంచాయతీ పోలింగ్ కేంద్రంలో మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సత్యవార్ పోలింగ్ కేంద్రంలో



మాజీ వైస్ ఎంపిపి రామేశ్వరమ్మ ఓటు వేశారు. అలాగే సర్పంచ్ అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఐదు మండలాల్లో మొత్తం 1,52,648 ఓట్లలో పోలైన ఓట్లు 1, 27, 502 గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తుది విడత ఎన్నికల పోలింగ్ 83. 53శాతం నమోదు అయింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 83.53 శాతం పోలింగ్ నమోదు అయింది. మండలాల వారిగా ఓటర్లు నమోదు అయిన పోలింగ్ శాతం మక్తల్ మండలంలో మొత్తం ఓటర్లు 43,701మంది ఉండగా, 37,998 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.95 శాతం నమోదు అయింది. మాగనూర్ మండలంలో మొత్తం ఓటర్లు 19, 145 మంది ఉండగా, 16, 269 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 84.98 శాతం నమోదు అయింది. కృష్ణా మండలంలో మొత్తం ఓటర్లు 21,847 మంది ఉండగా, 17,550 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.33 శాతం నమోదు అయింది. నర్వ మండలంలో మొత్తం ఓటర్లు 26,175 మంది ఉండగా, 22,013 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 84. 1 శాతం నమోదు అయింది. ఊట్కూర్ మండలంలో మొత్తం ఓటర్లు 41,780 మంది ఉండగా, 33, 672 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.59 శాతం నమోదు అయింది. మండలాల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయం ముగిసినా కొన్నిచోట్ల ఓటర్లు లైన్లో ఉండగా గేట్లు వేసి మధ్యాహ్నం ఒంటి గంటలోపు క్యూలైన్ లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా జిల్లా యంత్రాంగం పట్టిష్టమైన చర్యలు చేపట్టినట్టు, ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

## గుడేబల్లూరు కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు



**కృష్ణ, డిసెంబర్ 17 (జనం సాక్షి,) :** గ్రామపంచాయతీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కృష్ణ మండలంలోని గుడేబల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద కృష్ణ ఎస్సై ఎస్.ఎం. నవీద్ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.కౌంటింగ్ ప్రక్రియ శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నామని ఎస్సై నవీద్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో అనవసర గుమికూడరాదని, ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.అనుమతి లేని వ్యక్తులు కౌంటింగ్ కేంద్రానికి సమీపంలోకి రాకుండా నిఘా పెంచడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు సహకరించి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను శాంతియుతంగా ముగిసింది.

## హుస్నాబాద్‌లో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు




**హుస్నాబాద్, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** హుస్నాబాద్ పట్టణంలోని వీధి కుక్కలను సిద్దిపేటలోని ఏబీసీ సెంటర్‌కు తరలించి శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు కమిషనర్ టీ మల్లికార్జున్ తెలిపారు. వీధి కుక్కల నియంత్రణ, ప్రజల భద్రత దృష్ట్యా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వీధి కుక్కలను తరలించే ప్రత్యేక వాహనాన్ని సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాగా ఎల్లం పర్యవేక్షిస్తూ, ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడనున్నట్లు కమిషనర్ తెలిపారు.

# తూముకుంట గ్రామంలో రీ పోలింగ్ జరపాలి

**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** అయిజ మండలం తూముకుంట గ్రామంలో సర్పంచ్ ఎన్నికలను రద్దు పరిచి రీ పోలింగ్ జరపాలని బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం ముందు తూముకుంట గ్రామ సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేసిన అల్వాల శ్రీనివాస్ గౌడ్,చిట్టెం కిష్టన్న,ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండవ విడతలో ఈ నెల 14న అలంపూర్ తాలూకా అయిజ మండలం తూముకుంట గ్రామంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికారులు నిర్లక్ష్యం చేశారని, ఎన్నికల అధికారులు ఇచ్చిన స్లిప్పుల పై దాదాపుగా 70కి పైగా ఓటర్లు సంతకాలు చేసిన కౌంటర్ ఫైల్ తో పాటు బ్యాలెట్ పేపర్ తో సహా బ్యాలెట్ బాక్స్ లో వేశారని, దీంతో అధికారులు ఓటర్ గోప్యతకు భంగం కల్పించారని ఈ నిర్లక్ష్యానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంతే గాక ఎన్నికల అనంతరం రిటర్నింగ్ అదికారులు ధృవీకరించిన పత్రంలో గ్రామంలో మొత్తం ఓట్లు 1819 వుండగా ఒక ధృవీకరణ పత్రంలో 1699 ఓట్లు చెల్లు బాటు అయినట్లు ఇచ్చారని, మరోసారి 1659 ఓట్లు చెల్లుబాటు అయినట్లు ధృవీకరణ చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. గ్రామంలో జరిగిన ఎన్నికల



నిర్వహణలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని వారు ఆరోపించారు. ఈ ఎన్నికల్లో మాకు తీవ్ర అన్యాయం జరిగిందని అందుచేత తూముకుంట గ్రామంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించిన సర్పంచ్ అభ్యర్థి గెలుపును రద్దు చేయాలని, ఉప సర్పంచ్ ఎన్నికను కూడా రద్దు పరిచి గ్రామంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించి రీ పోలింగ్ జరపాలని వారు కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కిష్టన్న, కృష్ణయ్య గౌడ్, ఏసు రాజు, కేసారం, రసూల్, ఆంజనేయులు, వెంకటేష్ మణి, తిమ్మరాజు గౌడ్, మాజీ ఉపసర్పంచ్ భీమన్న, మహేష్, రామాంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పల్లెపూరులో పెరిగిన ఓటింగ్ శాతం



**వెల్దుర్తి, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** వెల్దుర్తి మండల వ్యాప్తంగా మూడో విడత ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి మండల వ్యాప్తంగా 87.6% పోలింగ్ నమోదు కాగా అత్యధికంగా ఏదుల్లపల్లి గ్రామపంచాయతీలో 94 శాతం పోలింగ్ నమోదైనట్లు అలాగే అత్యల్పంగా మంగళపర్తి గ్రామంలో 76% పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు గత పల్లెపూరు కన్నా ఈ సంవత్సరం ఆరు శాతం పోలింగ్ అత్యధికంగా నమోదైనట్లు వారన్నారు ముఖ్యంగా యువత పోలింగ్లో పాల్గొని పోలింగ్ శాతాన్ని పెంచారు నెల్లూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా రంగారెడ్డి అలాగే చేరిలా గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బంజరవి యశ్వంతరావుపేట్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మల్లేష్ గౌడ్ అందుగులపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఎండి షాదుల్ ఉప్పు లింగాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా వంచ భూపాల్ రెడ్డి హస్తాల్పూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నరసింహారెడ్డి వెల్దుర్తి సర్పంచ్ అభ్యర్థిగా ఆదర్శ 535 కోట్ల మెజార్టీతో గెలుపొందడం జరిగింది బండ పోచంపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నరేందర్ రెడ్డి రామయపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పావని గెలుపొందగా మండలంలో అత్యధిక స్థానాల్లో టిఆర్ఎస్ కైవసం చేసుకోగా రెండో స్థానంలో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది గెలుపొందిన అభ్యర్థులు బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు.

## శ్రీ తిమ్మప్పస్వామికి వెండి వితరణ



**మల్దకల్, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహాలకు 108 కేజీల వెండితో వెండి కవచాలు తయారు చేయడానికిగాను వెండిని సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం కర్నూలు జిల్లా కోడుమూరు గ్రామానికి చెందిన మాచర్ల చంద్రిక కుటుంబ సభ్యులు 211 గ్రాముల వెండినీ దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావుకు అందజేశారు.దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దాతలకు స్వామివారి శేషవస్త్రంస్వామి వారి చిత్రపటం ప్రసాదం బహూకరించారు.

# ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

**● పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్**

**సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. నిజాంపేట్ మండల కేంద్రంతో పాటు ర్యాలమడుగు గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, పోలింగ్ బూత్‌లలో చేపట్టిన ఏర్పాట్లు, క్యూలైన్ నిర్వహణ విధానం, ఓటర్లకు అందుతున్న సౌకర్యాలు, ముఖ్యంగా వికలాంగులు మరియు వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సదుపాయాలను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందికి సూచనలు చేశారు.అనంతరం కల్హేర్ మండలం రాపర్తి గ్రామంలోని కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి, కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, తదితరాలను పరిశీలించి తగిన మార్గదర్శకాలు ఇచ్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు కార్తీక్ రెడ్డి నిజాంపేట్, బాచిపల్లి, మీర్‌ఖాన్‌పేట్, రాపర్తి, కడ్పల్, సిర్గాపూర్, చాప్ట(కె), ఆకుల లింగపురం గ్రామాల పోలింగ్ కేంద్రాలను



సందర్శించారు. పోలింగ్ సరళి, పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ వాసర్, కంగ్టి, కల్హేర్, కడ్పల్ గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాలలో పరిస్థితులు, ఉప సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన వివిధ ఫారాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.జిల్లాలో మూడు విడతల లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని,ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**సదాశివపేట, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నిమ్మల మల్లేశం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ను బుధవారం నాడు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చేతుల మీదగా నూతన క్యాలెండర్ను ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. సంఘం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘ భవనం కోసం అన్ని విధాల సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింత సాయినాథ్, సంగం జిల్లా సంయుక్త కార్యదర్శి టి. శ్రీనివాస్, కోశాధికారి షీలా విశ్వనాథం,పట్టణ కార్యదర్శి,తుగుడేదాస్, పెద్దలు అంబటి విశ్వనాథం, నాగారం పెంటయ్య, సిహెచ్ మల్లేశం,తదితరులు పాల్గొన్నారు.

## గెలిచిన సర్పంచ్‌లకు సన్మానం



**పటాన్చెరు డిసెంబర్ 17 (జనంసాక్షి) :** ఎన్నికలలో గెలుపొందిన సర్పంచులు గ్రామ అభివ ృద్ధి లక్ష్యంగా పనిచేసి ప్రజల నుంచి మన్ననలు పొందాలని పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం నాడు పటాన్‌చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదల మండలంలోని గ్రామ పంచాయతీలకు మొదటి విడత ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచులుగా విజయం సాధించిన సర్పంచ్ లతో పాటు వార్డు మెంబర్లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత స్థానిక ఎన్నికల్లో నూతనంగా విజయం సాధించిన సర్పంచులు గ్రామాల్లో వీధిలైట్లు, శానిటేషన్, త్రాగునీరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.సర్పంచుల గెలుపు వెనుక పార్టీ నాయకుల కార్యకర్తల సమిష్టి కృషి మరువలేనిది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పథకాలను సర్పంచులు ఎప్పటికప్పుడు ప్రజల ద ృష్టికి తీసుకుపోవాలనీ అదేవిధంగా సర్పంచులు బాధ్యతగా పనిచేస్తూ గ్రామస్తుల మన్నలను పొందాలి అన్నారు. సేవాగుణంతో పని చేసే వారికి ప్రజల గుర్తింపు ఉంటుంది అని గుర్తు చేశారు. పార్టీలో పని చేసే ప్రతి ఒక్కరు నా కుటుంబ సభ్యులేనని, గ్రామ పాలనలో వారందరి సేవ వెలకట్టలేనిదని, మీతో పాటు నేను గ్రామాల ప్రగతి లక్ష్యంగా నిరంతరం పని చేస్తామనీ అన్నారు. ఓటమి పాలైన కాంగ్రెస్ నాయకులు ఎవ్వరూ అధైర్యపడవద్దని ఎన్నికల్లో గెలుపోటములు సహజమని వారందరూ సంయమనంతో గ్రామాల్లో మరింత సేవ చేయాలని కోరారు.

# ఓటర్లు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలి

**● జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** బుధవారం వనపర్తి జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా శ్రీరంగాపురం మండల పరిధిలోని వెంకటాపురంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం, శ్రీరంగాపురం మండల కేంద్రం లోని జిల్లా పరిషద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం, పెబ్బేరు మండలంలోని కంచిరావు పల్లి గ్రామపంచాయతిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ ప్రక్రియ, ఏర్పాట్లను పరిశీలించారు.జిల్లాలో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ఐదు మండలాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ అమూల్యమైన ఓటును ప్రశాంతంగా వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధ ఓటర్లకు ప్రత్యేక సౌకర్యాలను పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వనపర్తి జిల్లాలోని 5 మండలాల్లో జరిగిన మూడో



విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం వనపర్తి జిల్లాలో మూడో విడత పోలింగ్ జరిగిన పాన్గల్, పెబ్బేరు, శ్రీరంగాపూర్, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.పోలింగ్ ఉదయం 7 గంటల నుండి ప్రారంభమయి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ తీరును కలెక్టరేట్లోని సమావేశం మందిరం నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, సాధారణ ఎన్నికల పరిశీలకులు మల్లయ్య భట్టు, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్ తో కలిసి పర్యవేక్షించారు.జిల్లా కలెక్టర్ కంట్రోల్ రూమ్ నుండి మాత్రమే కాకుండా శ్రీరంగాపురం మండలం వెంకటాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం, శ్రీరంగాపూర్ మండల కేంద్రం, పెబ్బేరు మండలం కంచిరావు పల్లి గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుచున్న ప్రక్రియను పరిశీలించారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ భద్రతలు కట్టుదిట్టం చేశారు.కంచిరావు పల్లి గ్రామంలో మీడియాతో మాట్లాడిన కలెక్టర్ ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, తెలియజేశారు. మధ్యాహ్నం 1.00 గంట వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లకు పోలింగ్ కేంద్రాల గేట్లు మూసి క్యూ లైన్లలో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. పోలీస్ శాఖ ద్వారా కట్టుదిట్టమైన శాంతిభద్రతలు అమలు చేసినట్టు తెలిపారు.మూడో విడతలో పోలింగ్ జరిగిన పాన్గల్, పెబ్బేరు,శ్రీరంగాపూర్, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లో మొత్తం కలిపి 1,11,357 ఓట్లు పోల్ కాగా,85.55% వోటింగ్ పర్సంటేజీ నమోదయింది.వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పరిశీలన



**కౌడిపల్లి, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్, కౌడిపల్లి మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని,పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు.ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా,నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ సెంటర్ ఉన్నతాధికారి జూలకంటి శ్రీనివాస్, ఆర్డీవో మహిపాల్ ఎంపీడీవో శ్రీనివాస్, ఎమ్మార్వో కృష్ణ, పంచాయతీ సెక్రటరీ వెంకటేశం, ఎంపీఓ రామారావు, తోపాటు ఎన్నికల నిర్వహణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలన



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 17(జనంసాక్షి):** జిల్లాలో జరుగుతున్న మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుండి జరుగుతున్న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకులు బాల మాయాదేవి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడవ విడతలో నర్సంపేట, ఖనాపూర్, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల్లోని గుర్తించిన 110 సేన్సిటివ్, 282 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ను జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నేరుగా వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఈ నాలుగు మండలాలకు సూక్ష్మ పరిశీలకులను (మైక్రోఅబ్జర్వర్లు) నియమించి, పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డిపిఓ కల్పన, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వగ్రామంలో ఓటు వేసిన వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**ఆత్మకూరు, డిసెంబర్ 17 (జనం సాక్షి):** హన్మకొండ జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తన సతీమణి ఇనగాల ఛారిటబుల్ ట్రస్టు ట్రస్టీ మెంబర్, అపోలో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ అవంతి రెడ్డి తో తన స్వగ్రామమైన ఆత్మకూరులోని పాఠశాల ప్రాంగణంలో సాదారణ ఓటరులా క్యూ లైన్లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రంలో కలిసిన గ్రామస్తులతో సరదాగా మాట్లాడుతూ ఎన్నికల తీరును అడిగి తెలుసుకొని, పోలింగ్ కేంద్రం బయట సిరా చుక్కను చూపుతూ ప్రతి ఒక్కరూ భాధ్యతగా ఓటు వేయాలని కోరారు.

# సొంత గడ్డపై పట్టు నిలుపుకున్న హన్మకొండ డీసీసీ అధ్యక్షులు

- ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
- సొంత గడ్డపై 'ఇనగాల' పట్టు
- డీసీసీ అధ్యక్షుడిగా తొలి విజయం ఆత్మకూరులోనే !



**ఆత్మకూరు, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన నాటి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, రాజకీయ క్షేత్రంలో తనదైన ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా ఆయన డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే తన సొంత గ్రామమైన ఆత్మకూరులో కాంగ్రెస్ జెండాను ఎగురవేసి సత్తా చాటారు. ఆత్మకూరు గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఇనగాల, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పర్వతగిరి మహేశ్వరి ని సర్పంచిగా భారీ మెజారిటీతో గెలిపించుకోవడంలో కీలక పాత్ర పోషించారు. జిల్లా స్థాయి బాధ్యతల్లో ఉంటూనే, క్షేత్రస్థాయిలో గ్రామ రాజకీయాలను చక్కదిద్ది తన కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపారు. సొంత గ్రామంలో ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా పక్కా వ్యూహంతో పర్వతగిరి మహేశ్వరిని గెలిపించి రాజకీయ పట్టును నిరూపించుకున్నారు. ఈ విజయం ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి డీసీసీ అధ్యక్షుడిగా నైతిక బలాన్ని ఇవ్వడమే కాకుండా, జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నమ్మకాన్ని కలిగించింది. తన స్వంత మండలమే కాకుండా హుస్నాబాద్, హుజూరాబాద్, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, భూపాలపల్లి, పరకాల నియోజకవర్గాలలోని 12 మండలాలలో కుడా జిల్లా స్థాయి బాధ్యతల్లో ఉంటూనే, క్షేత్రస్థాయిలో గ్రామలలో పర్యటించి కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపారు.


# ఒకే కుటుంబం నుండి రాజకీయ పట్టం

- ఆదర్శ గ్రామంగా హనుమాన్ తాండ



**సారంగాపూర్, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో హనుమాన్ తండా గ్రామపంచాయతీలో ఒకే కుటుంబం నుండి రెండు దశాబ్దాల కాలంగా రాజకీయం కొనసాగడం గ్రామ ప్రజలకు వారికి మద్దతు ఇవ్వడం రాజకీయపట్టం ఇవ్వడం మండలంలో గ్రామం ఆదర్శంగా నిలిచింది. 2013 సంవత్సరంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పవార్ శేవంత బాయి ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. ఆమె కుమారుడు పవర్ రాజేష్ 2018 సంవత్సరంలో గ్రామ సర్పంచ్ గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో కూడా హనుమాన్ తాండ గ్రామానికి జనరల్ మహిళా రిజర్వేషన్ రావడంతో తమ సోదరుడు జ్ఞానేశ్వర్ భార్య పుష్పలత సర్పంచ్ గా విజయం సాధించింది. మళ్లీ రాబోయే జెడ్పిటిసి ఎన్నికల్లో పవర్ రాజేష్ బరిలో ఉన్నట్లు రాజకీయ వర్గాలు తెలుపుతున్నాయి. ప్రస్తుతం నిర్మల్ జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. రాజకీయపరంగా వారికి కలిసి రావడం వారి కుటుంబం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.

# పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు




**నిర్మల్ రూరల్, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం బుధవారం జిల్లాలో మూడో విడత ఎన్నికలు జరుగుతున్న పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భైంసా, బాసర, ముధోల్, తానూరు మండలాల్లో ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని చూశారు. ఓట్లు వేయడానికి వచ్చిన ఓటర్లకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని పకడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు.

# మూడో విడత 88.21శాతం పోలింగ్

- ఎమ్మెల్యే దొంతి ఇలాకాలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులదే హవా
- యువకులు ఉత్సాహంతో ఓటింగ్





**వరంగల్ ప్రతినిధి/ చెన్నారావుపేట డిసెంబర్ 14 (జనం సాక్షి):** మూడో విడత పంచాయతీ సంగ్రామంలో భాగంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో వరంగల్ జిల్లాలోని నాలుగు మండలాల్లో పంచాయతీ ఎన్నికలు 88.21శాతం ఓటింగ్ శాతం నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయం నుండే వరంగల్ జిల్లాలోని చెన్నారావుపేట ఖానాపురం నర్సంపేట నెక్కొండ మండలాల్లో యువతి యువకులు బార్లు తీరి ఓటింగ్ వేయడానికి క్యూలైన్లకు విచ్చేసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తమ స్వగ్రామమైన అమీనాబాద్ లో తమ కుటుంబ సభ్యులతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నర్సంపేట డివిజన్లోని చెన్నారావుపేట మండల కేంద్రంతో పాటు పత్తి నాయక్ తండలో స్వల్ప వివాదం కాదా పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని అల్లరి మూకలను అదుపు చేయడంతో గొడవ సద్దుమణిగింది. ఎన్నికల నిర్వహణకు వరంగల్ జిల్లాలోని నర్సంపేట మండలంలోని లక్నేపల్లి చెన్నారావుపేట మండల కేంద్రం పాత ముగ్గరం గ్రామాలలో మూడు గ్రామాలలో తీవ్రంగా కోతుల బెడద ఉండడంతో ఎన్నికల అధికారులకు ఇబ్బందులు జరిగే కౌంటింగ్ ప్రక్రియకు కొంత ఆటంకం కాదా ఎన్నికల ప్రక్రియను సజవుగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సమస్య ఆత్మ గ్రామాల్లో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టి పోలింగ్ సరలని ప్రశాంతంగా నిర్వహించ డానికి చర్యలు చేపట్టారు. నాలుగు మండలాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టి ప్రశాంత వాతావరణంలో హరిత కేంద్రాల ద్వారా జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించారు. చివరి విడత ఎన్నికల్లో భాగంగా వరంగల్ జిల్లాలోని చెన్నారావుపేట మండలంలో 31, వేల 351 కోట్లు ఉండగా 28 వేల 163 మంది ఓటర్లు ఓటు నమోదు చేసుకోగా 89.93శాతం ఓటింగ్ నమోద ˇయింది. ఖానాపురం మండలంలో 27 వేల 139 మంది ఓటర్లు ఉండగా 23 వేల ఎనిమిది వందల 15 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖానాపు రంలో 87.75 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నర్సంపేట మండలంలో 22 వేల 472 ఓట్లు ఉండగా 19 వేల 740 మంది ఓటర్లు పోలింగ్ కేంద్రాల ద్వారా తమ ఓట్లు వేశారు. నర్సంపేటలో 87 శాతం ఓట్లు నమోదయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నెక్కొండ మండలంలో 43 వేల 593 ఓట్లు ఉండగా 38వేల 152 మంది ఓటర్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. నాలుగు మండలాల్లో ఉదయం నుండే ఎన్నికల పరిశీలకులు ఎన్నికల అధికారులు పకడ్బందీ పర్యవేక్షణలో పోలింగ్ అధికారులకు సూచనలు ఇస్తూ ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛను సంఘటన జరగకుండా భారీ బందోబస్తు మధ్య ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడానికి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రణాళిక ప్రకారం గ్రీన్ పోలింగ్ స్టేషన్లో దగ్గర ఓటు హక్కు వినియోగించుకోవడానికి చర్యలు చేపట్టడంతో నూతన ఓటర్లు సంతోషాన్ని వ్యక్తం చేశారు. బుధ వారం. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించారు. గురిజాల గ్రామంలో 1 గంట వరకు పోలింగ్ కేంద్రం క్యూ లైన్‌లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతిచ్చారు. పోలింగ్ ముగియడంతో ఫలితాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని రెండు గంటలకు ప్రారంభించారు. జిల్లాలోని నాలుగు మండలాల్లో గ్రీన్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వికలాంగులు, వృద్ధులు స్వేచ్ఛపూరిత వాతావరణం లో తమ ఓటు హక్కును వినియోగించు కొన్నారు. పలు గ్రామాలలో యువత ఓటు హక్కు సద్వినియోగం చేసుకొని గెలుపు అభ్యర్థుల గురించి చర్చించుకోవడం మొదలుపెట్టారు. గెలుపు గుర్రాలపై వార్డు మెంబర్లు, సర్పంచ్ అభ్యర్థుల ఫలితాలు ఎన్నికలు అధికారుల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల వారీగా ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించి సర్పంచ్ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంతంగా నిర్వహించడంతో జిల్లా అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోని నాలుగు మండలా ల్లో 8 హరిత పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. హరిత పోలింగ్ కేంద్రాలకు యువత ఉత్సాహంగా వచ్చి ఫోటోలు దిగడం జరిగింది. జిల్లాలో కొత్త ఓటర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతో జిల్లా అధికారులు వివిధ పార్టీల నాయకులు అవాంఛనీయ సంఘటన లు జరగకపోవడంతో ఎన్నికల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.. గ్రామపంచాయతీ ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం పట్ల పలు రాజకీయ పార్టీలు ప్రజాసఘాలు అధికారులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం పట్ల అధికార తీరును అభినందించారు.

# ములుగులో ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు బ్యూరో, డిసెంబర్17 (జనంసాక్షి):** ములుగు జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా ముగిసింది. మూడు విడతలలోనూ ఎన్నికలు సజావుగా కొనసాగాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. మూడవ విడత పోలింగ్ బుధవారం ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. వాజేడులో విపరీతమైన మంచు కురుస్తున్నప్పటికీ చలిని సైతం లెక్క చేయకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు. వెంకటాపురం, కన్నాయిగూడెం, వాజేడు మండలాల పరిధిలో ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మూడవ విడతలో మొత్తం 46 సర్పంచ్ స్థానాలకు గాను, నామినేషన్ల ఉపసంహరణ నాటికే 01 స్థానం ఏకగ్రీవం అయ్యాయి. దీంతో మిగిలిన 45 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అదేవిధంగా మొత్తం 408 వార్డు స్థానాలకు గాను 79 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. వీటిని మినహాయిస్తూ, 329 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మూడు మండలాల వ్యాప్తంగా 53,918 ఓటర్లు ఉండగా వారిలో 45,228 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని మూడవ విడతలో 83.88 శాతం పోలింగ్ నమోదయిందని తెలిపారు. మొదటి విడత ఎన్నికల్లో భాగంగా డిసెంబర్ 11వ తేదీన గోవిందరావుపేట, తాడ్వాయి ఏటూర్ నాగారం మూడు మండలాలలోని 39 సర్పంచ్ స్థానాలకు, 287 వార్డు మెంబర్స్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించామని, మూడు మండలాల వ్యాప్తంగా 60,361 ఓటర్లు ఉండగా వారిలో 47,472 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని మొదటి విడతలో 78.65 శాతం పోలింగ్ నమోదు కావడం జరిగిందని వివరించారు. రెండవ విడత ఎన్నికలలో భాగంగా డిసెంబర్ 14వ తేదీ న ములుగు, వెంకటాపూర్, మల్లంపల్లి మూడు మండలాలలోని 37 సర్పంచ్ స్థానాలకు, 315 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించామని మూడు మండలాల వ్యాప్తంగా మొత్తం 54,949 ఓటర్లు ఉండగా వారిలో 45,565 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని రెండవ విడతలో 82.93 శాతం పోలింగ్ నమోదు కావడం జరిగిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 1306 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, భారీగా ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



# వరంగల్ కోటలో పురావస్తు అభివృద్ధి పనులు

- కేంద్ర పురావస్తు శాఖ అధికారుల పర్యటన

**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 17 ( జనం సాక్షి) :** శతాబ్దాలుగా కాకతీయుల కీర్తి, వైభవాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిన ఓరుగల్లు కోట అభివృద్ధి కోసం కేంద్ర పురావస్తు శాఖ అధికారులు బుధవారం వరంగల్ కోటలో పర్యటించారు. కాకతీయులు 13వ శతాబ్దంలో నిర్మించిన కోటలోని ప్రసిద్ధ స్వయంభు దేవాలయం, కీర్తి తోరణాల (కాకతీయ కళా తోరణం) త్వరలో పరిరక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐటి ప్రొఫెసర్ రమణమూర్తి, కేంద్ర పురావస్తు శాఖ డిఈ కృష్ణ చైతన్య, ఏ ఈ కిషోర్ రెడ్డి, గోల్కొండ కోట కన్జర్వేషన్ అసిస్టెంట్ మల్లేశం, వరంగల్ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ అజిత్, కన్జర్వేషన్ అసిస్టెంట్ తేజ్ పాల్గొన్నారు. ఈ బృందం స్వయంభు దేవాలయ ప్రాంగణంలో ఉన్న హంసల శిల్పాలను త్వరలో ఉత్తర తోరణం పై ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తూర్పు తోరణం అభివృద్ధి కోసం సంబంధించిన. రక్షణ, పునరుద్ధరణ పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

# విజయవంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో నిర్వహించిన రెండో సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికల మూడో దశ పోలింగ్ విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మూడో దశలో భాగంగా కాటారం, మహాదేవ్‌పూర్, మహాముత్తారం, మల్హర్‌రావు మండలాల్లో పోలింగ్ నిర్వహించగా, ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు దశలవారీగా ఓటింగ్ శాతం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. మూడో దశలో మొత్తం సగటు 84.02 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. కాటారంలో 82.28, మహదేవపూర్ లో 84.38, మహా ముత్తారంలో 86.42, మల్హర్ లో 83.80 పోలింగ్ జరిగినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి, పోలీస్ యంత్రాంగానికి, పాత్రికేయులకు అలాగే శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ప్రజలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మూడు దశలుగా నిర్వహించిన గ్రామ పంచాయితీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా పూర్తవడం ప్రజల సహకారం వల్లనే సాధ్యమైందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా ప్రజలు చూపిన బాధ్యతాయుత ప్రవర్తన ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు.


జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం కాటారం మండలంలోని సుందర్ రాజుపేట, కాటారం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్, పోలింగ్ శాంతియుతంగా, పారదర్శకంగా కొనసాగినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది విధులను నిబద్ధతతో నిర్వర్తించారని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. కాటారం జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్లు లెక్కింపు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మహాదేవ పూర్ జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ల్లో ఎస్పీ సంకీర్త్ తో కలిసి పోలింగ్, ఓట్లు లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్య క్రమంలో ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్లు, ఎంపిడిఓ, ఆర్ఓలు పాల్గొన్నారు.

**కంట్రోల్ రూమ్ నుండి ఎన్నికల ప్రక్రియ పరిశీలన**

మూడో దశలో కాటారం, మల్హర్, మహా ముత్తారం, మహదేవపూర్ మండలాలలో జరిగిన గ్రామ పంచాయతీ పోలింగ్ ప్రక్రియను బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి పరిశీలించారు. గుర్తించిన 35 క్రిటికల్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కార్యాలయంతో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం ద్వారా పర్యవేక్షించినట్లు తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి డిసెంబర్ 17 (జనంసాక్షి) :** మూడు విడతలో భాగంగా చివరి విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు, భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ లతో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. 3వ విడత ఎన్నికలలో భాగంగా జిల్లాలోని చెన్నూర్, మందమర్రి, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు. ఇందులో 102 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు గాను 390 నామినేషన్లు వచ్చాయని, 4 స్థానాలు ఏకగ్రీవం కాగా 98 స్థానాలకు, 868 వార్డు సభ్యుల స్థానాలకు గాను 1 వేయి 905 నామినేషన్లు వచ్చాయని, 4 స్థానాలలో నామినేషన్లు రాకపోవడం/సరైన నామినేషన్లు సమర్పించకపోవడం మినహాయించి 153 స్థానాలు ఏకగ్రీవం కాగా 711 స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ఎన్నికలలో 1 లక్ష 6 వేల 889 మంది ఓటర్లు ఉండగా 87.78 శాతంతో 93 వేల 822 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 18వ తేదీన ఉదయం 10 గంటల వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని, ఎన్నికలలో గెలుపొందిన వారు విజయోత్సవ వేడుకలు నిర్వహించకూడదని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
18 డిసెంబర్ 2025

## ఎమ్మెల్యే కుంభంను కలిసిన పెద్దగూడెం నూతన సర్పంచ్ లత నర్సిరెడ్డి



**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** మండలంలోని పెద్దగూడెం గ్రామ నూతన సర్పంచ్ పక్కీర్ లత నర్సిరెడ్డి బుధవారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే నూతన సర్పంచ్ ను శాలువా తో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా లత నర్సిరెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మూడో విడత పంచాయతీ ఎన్నికలు

- **జిల్లాలో 89.25శాతం పోలింగ్ నమోదు**

**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లాలో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి.మూడో విడతలో భాగంగా జిల్లాలోని ఏడు మండలాలలో జరిగిన ఎన్నికల్లో 89.25 శాతం పోలింగ్ నమోదైంది.జిల్లాలో మూడో విడతలో 146 గ్రామ పంచాయతీ సర్పంచ్, 1318 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇందులో 22 సర్పంచులు, 257 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 124 సర్పంచులు,1061 వార్డు సభ్యుల స్థానాలకు 1176 పోలింగ్ స్టేషన్ లలో ఎన్నికలు నిర్వహించారు.జిల్లాలో ఉదయం 9 గంటల వరకు 24.83శాతం, 11 గంటల వరకు 60.13 శాతం, ఒంటి గంట వరకు 86.19 శాతం నమోదు అయింది.పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి వరకు నిర్వహించారు. ఒంటి గంట వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వారికి ఓటు హక్కును వినియోగించుకునే సదుపాయం కల్పించారు.ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటింగ్ లో పాల్గొన్నారు. జిల్లాలో



మొత్తంగా 89.25 శాతం పోలింగ్ నమోదు అయింది. సూర్యాపేట జిల్లాలో మూడో విడతలో భాగంగా ఎన్నికలు జరిగిన చింతలపాలెం మండలంలో 90.99 శాతం, గరిడేపల్లి మండలంలో 88.84 శాతం, హుజూర్ నగర్ మండలంలో 90.78శాతం, మఠంపల్లి మండలంలో 89.91శాతం, మేళ్లచెరువు మండలంలో 86.59శాతం, నేరేడుచర్ల మండలంలో 88.10శాతం, పాలకీడు మండలంలో 90.27 శాతం పోలింగ్ నమోదైంది.మూడో విడత ఎన్నికలు జరిగిన మొత్తం ఏడు మండలాలలో మొత్తం 192617 మంది ఓటర్లలో 171903 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో పురుషులు 83390, మహిళలు 88507, ఇతరులు ఆరుగురు ఉన్నారు.పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటేయడానికి పట్టణాలు,నగరాల నుంచి ప్రజలు పల్లె బాట పట్టారు.పెద్ద ఎత్తున సొంతూళ్లకు తరలివచ్చారు.మొత్తం మూడు దశల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహ ఎన్నికలు జరిగిన మండలాల్లోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

## మొక్కజొన్న పంటలను పరిశీలించిన సహాయ వ్యవసాయ సంచాలకులు

**చింతకాని, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** చింతకాని మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో మొక్కజొన్న పంటలను మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయ్ చంద్ర పరిశీలించారు. రైతులకు యాసంగిలో మొక్కజొన్న సాగుచేసినప్పుడు ఎరువులను కూడా సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని, ఎకరానికి 96 కిలోల నత్రజని 32 కిలోల భాస్వరం 32 కిలోల పొటాషియంనిచ్చే ఎరువులను వేసుకోవాలి అని మొక్కజొన్న లో కత్తెర పురుగు యాజమాన్యం గురించి వివరించారు. ్కత్తెర పురుగు ఉధృతిని తగ్గించుకొనుటకు విత్తనం మొలకెత్తక ముందు ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలు పెట్టి, పురుగు యొక్క ఉధృతిని తెలుసుకొని తగిన చర్యలు చేపట్టాలి అని, మొక్కజొన్నలో సిఫారసు చేసిన ఎరువులను సరియైన మోతాదులో వేసుకొని ఎకరానికి 80-96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, 32 కిలోల పోటాష్ వేసుకోవాలి అని తద్వారా మొక్కజొన్న ఏపుగా పెరిగి



కత్తెర పురుగు ఉధృతిని తగ్గించి పైరులో 45 రోజుల వరకు కలుపు లేకుండా ఎప్పటికప్పుడు కలుపు నివారణ చర్యలు చేపట్టాలి అన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటె , ఎదిగిన లార్వాల నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా స్పైనటోరమ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారిచేసి లేదా లింగాకర్షక బుట్టల ద్వారా పురుగుల ఉధృతిని గమనించి, ఉధృతి 5-10% ఉంటే, బ్యాసిల్లాస్ తూరింజెనిసిస్ 2 గ్రా. లీటరు నీటికి లేదా మెటారైజియం ఎనైసోప్లియ లేదా బెవెరియా బ్యాసియానా 5 గ్రా. లీటరు నీటికి కలిపి సాయంకాలం వేళలో పిచికారీ చేసి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి అని పైన చెప్పిన మందులనే అవసరాన్ని బట్టి మార్చి మార్చి పిచికారీ చేసి ఒకటి రెండవ దశ లద్దె పురుగులను నివారించుకోవచ్చు అని పంట కాలంలో రెండు లేక మూడు సార్లు మాత్రమే క్రిమిసంహారక మందులను వాడాలి రైతులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోములపల్లి మానస, వ్యవసాయ విస్తరణ అధికారి తేజ రైతులు పాల్గొనడం జరిగింది.

## మందలపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష పదవికి ఆకుల కృష్ణారావు రాజీనామా

**దమ్మపేట, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** దమ్మపేట మండలం మందలపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష పదవికి ఆకుల కృష్ణారావు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.వ్యక్తిగత కుటుంబ పరిస్థితులు,దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని,ప్రస్తుతం ఈ పదవిలో కొనసాగలేని పరిస్థితి నెలకొందనీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పార్టీకి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయానని, పార్టీకి,గ్రామ ప్రజలకు నష్టం కలగకూడదనే ఉద్దేశంతో నా పరిమితులను గుర్తించి,పూర్తి స్పృహతో,స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నాననీ, నా రాజీనామా వెనుక ఎటువంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు,బాహ్య ప్రభావాలు ఏమాత్రం లేవనీ, ఇది పూర్తిగా నా వ్యక్తిగత ఆరోగ్య సమస్యలు కుటుంబ పరిస్థితుల కారణంగా తీసుకున్న నిర్ణయం అని తెలిపారు.అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూ,ఇకపై కూడా కాంగ్రెస్ పార్టీ సాధారణ కార్యకర్తగా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేసారు.పార్టీ కోసం, గ్రామ అభివృద్ధి కోసం నా వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందనీ తెలిపారు.

## మండలంలో 88.10 శాతం పోలింగ్ నమోదు

- **ప్రశాంతంగా గ్రామపంచాయతీ ముగిసిన ఎన్నికలు**



**నేరేడుచర్ల, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 88.10% శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.మండలంలో 19 గ్రామ పంచాయతీలకు 3 గ్రామ పంచాయతీలు సర్పంచ్ ఏకగ్రీవం కావడంతో మిగల 16 గ్రామపంచాయతీలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.మండలంలో 20560 ఓట్లకు గాను.18104 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో పురుషులు 8759 మంది మహిళలు 9345 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం అయ్యి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన పోలింగ్ మండల వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది.మండలంలో కందులవారి గూడెం 95 ఏళ్ల వృద్ధుడు. ఓటును సద్వినియోగం చేసుకున్నాడు. పలు గ్రామాల్లో యువతీ యువకులు తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో దిర్శించర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ పోలింగ్ సరళని పరిశీలించారు.మండలంలో సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన, గ్రామాల్లో భారీ బందోబస్తు నిర్వహించారు.ఎన్నికల నిర్వహణలో జోనల్ ఆఫీసర్లు, ఆర్వోలు, పిఓలు, ఓపి ఓలు, నిర్వహణలో పాల్గొన్నారు. ఎన్నికల సరళిలో తహసిల్దార్ సైదులు, ఎంపీడీవో సోమ సుందర్ రెడ్డి, ఎస్ఐ రవీందర్, పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేత

**కేశంపేట, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన కాడెమోనీ అన్విక , తట్టేపల్లి శివకుమార్ హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వం తరపున సహాయం అందించాలని గ్రామ సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్ ను కోరారు. గ్రామ సర్పంచ్ విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి దృష్టికి తీసుకువెళగా స్పందించిన ఎమ్మెల్యే శంకర్ అన్వికకు 2 లక్షల యాభై వేలు, శివకుమార్ కు 2 లక్షల యాభై వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసి లను మంజూరు చేయించారు. బాధిత కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే శంకర్, గ్రామ సర్పంచ్ హైమావతి జగదీశ్వర్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గుమ్మడవల్లి సర్పంచ్‌గా ఆదిరాల సుమలత ఘన విజయం

**కొండమల్లేపల్లి, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** మూడో విడత స్థానిక సంస్థల గ్రామపంచాయతీ ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగింది. ముఖ్యంగా గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాల్లో ఒక్కో ఓటు ఎంత విలువైందో అది అభ్యర్థుల తలరాతలను ఎలా పోరు మార్చగలదో స్పష్టమైంది. అనేక గ్రామాల్లో గెలుపోటముల మధ్య వ్యత్యాసం కేవలం తక్కువ ఓట్ల తేడా మాత్రమే ఉండటం విశేషం. స్వల్ప మెజారిటీతో విజయం సాధించిన అభ్యర్థులు ఊపిరి పీల్చుకోగా ఓటమి పాలైనవారు అదృష్టం చేజారిందని ఆవేదన వ్యక్తం చెందినవారు కూడా ఉన్నారు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో హోరా హోరిగా జరిగిన స్థానిక సంస్థలు ఎన్నికలలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆదిరాల సుమలత రమేష్ కుమార్ కి 629 ఓట్లు పడగా, బిఆర్ఎస్ అభ్యర్థి జిట్ట సంధ్యారాణి కిరణ్ కి 627 ఓట్లు పడ్డాయి. కేవలం రెండంటే రెండు ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. ప్రజాస్వామ్యంలో ఒక్క ఓటు విలువ ఎలా ఉంటుందో ఈ ఎన్నికల్లో స్పష్టంగా తెలిసింది. రెండు ఓట్ల తేడాతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆదిరాల సుమలత రమేష్ కుమార్ మాట్లాడుతూ గుమ్మడవల్లి గ్రామానికి ఐదేళ్లు సేవకుడిగా పని చేసే అవకాశం ఇచ్చిన గ్రామ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరిస్తానని అన్నారు. ఎమ్మెల్యే బాలు నాయక్, దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య



నాయకులు, మాజీ ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మా విజయానికి సహకరించిన గ్రామ ప్రజలకు, యువతకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాబోయే ఎన్నికలకు సైతం సిద్ధంగా ఉండాలి

**ఖమ్మం, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** మొదటి విడత జరిగిన స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన రఘునాథపాలెం మండలం బీఆర్ఎస్ సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన 11 మంది బీఆర్ఎస్ సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డ్ సభ్యులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన వెనకాడకుండా ఎన్నికల్లో పోరాడినందుకు నాయకులు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలకు కూడా సిద్ధంగా ఉండాలని అందరు కలిసికట్టుగా పనిచేసి అత్యధిక స్థానాలు గెలుచుకోవాలని, కార్యకర్తలకు అండగా ఎల్లవేళలా ఉంటానని, ఎవరి బెదిరింపులకు బయపడొద్దని ధైర్యం చెప్పారు. సన్మానించిన వారిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు కొంటెముక్కల వెంకటేశ్వర్లు, తేజవత్ శంకర్, పొట్లపల్లి



రమాదేవి,బానోతు సునీత,మాలోతు జ్యోతి,గుగులోతు మూర్తి,నునావత్ పెంట్యా,మాలోతు సుశీల,జర్పుల సౌందర్య,జర్పుల రవీందర్,భూక్యా సరిత ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరునాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్జెసి కృష్ణ,నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ వైస్ ఎంపీపీ గుత్తా రవి,మాజీ సర్పంచ్లు హరిప్రసాద్, మెంటం రామారావు, చెరుకూరి ప్రదీప్,నాయకులు మందడపు నరసింహారావు, మాధవరావు, పిన్ని కోటేశ్వరరావు, పొట్లపల్లి రాజా, తాత వెంకటేశ్వర్లు, కుతుంబాక నరేష్,యాస రామారావు, సైదులు, మోహన్ రావు, వెంకటప్పారావు, రవిప్రకాష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి అభినందనలు



**తాండూరు, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చాకచక్యంగా వ్యవహరించి ఏకగ్రీవ సర్పంచులతో పాటు అధిక స్థానంలో కాంగ్రెస్ సర్పంచ్ లను గెలిపించినందుకు గాను ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని అభినందించారు.బుధవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సుమర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తాండూర్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు,ఏకగ్రీవైన సర్పంచ్ స్థానలపై మీనాక్షి నటరాజ్ ఆరా తీశారు. అనంతరం భవిష్యత్ లో నియోజకవర్గంలో పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు.

## డ్రోన్ ద్వారా తక్కువ ఖర్చుతో లాభదాయక వరిసాగు

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**బూర్గంపహాడ్, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్ ద్వారా విత్తనాలు మందులు పిచికారి చేయడంతో లాభదాయకమైన వరి సాగు చేయవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండలం సోంపల్లి గ్రామంలో డ్రోన్ సాంకేతికత ద్వారా నేరుగా వరి విత్తనాలు వెదజల్లే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై డ్రోన్ ద్వారా వరి విత్తనాల వెదజల్లే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే తక్కువ ఖర్చుతో లాభదాయకంగా వరి సాగు చేయవచ్చని తెలిపారు. డ్రోన్ ద్వారా వరి విత్తనాలను నేరుగా వెదజల్లడం, అలాగే గడ్డి మందులు, పురుగు మందులను పిచికారీ చేయడం ద్వారా కూలీ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. అదేవిధంగా సమయం ఆదా కావడంతో



పాటు పంట స్థాపన సమానంగా జరిగి మంచి దిగుబడులు సాధించవచ్చని ఆయనన్నారు. రైతులు ఈ విధమైన ఆధునిక పద్ధతులను స్వీకరించి వ్యవసాయంలో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి భరత్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా వరి విత్తనాలు వెదజల్లే విధానంలో సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే తక్కువ విత్తనాలు సరిపోతాయని, దీంతో విత్తన వ్యయం తగ్గుతుందని వివరించారు. ఈ విధానం ద్వారా సాగు ఖర్చులు కూడా గణనీయంగా తగ్గడంతో పాటు రైతులకు అధిక లాభాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు డ్రోన్ ద్వారా వరి విత్తనాలు వెదజల్లే ప్రత్యక్ష ప్రదర్శనను వీక్షించి, ఈ ఆధునిక సాంకేతికత ప్రయోజనాలపై అవగాహన పొందారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రోన్ వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం రైతుల్లో ఆధునిక సాంకేతికతపై నమ్మకాన్ని పెంచి, తక్కువ ఖర్చుతో లాభదాయకమైన వరి సాగుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త డా. ఎన్ శరత్ చంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త బి శివ, ఏడిఏ తాతారావు, శంకర్, సోంపల్లి గ్రామానికి చెందిన అధికారులు, సిబ్బంది, సుమారు 80 మంది అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో మందుబాబుల వీరంగం

- **వైన్ షాపు ముందు యువకుడిపై మారణాయుధాలతో దాడి**

**భద్రాచలం, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** భద్రాచలం పట్టణంలో వైన్ షాప్ ముందు మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో జరిగిన ఘర్షణ రక్తపాతానికి దారితీసింది. స్థానిక చర్ల రోడ్డులో ఉన్న వైన్ షాపుల ఎదుట బుధవారం ఈ దారుణ సంఘటన చోటుచేసుకుంది. భద్రాచలం నుంచి చర్ల వెళ్లే రహదారిలోని వైన్ షాపుల వద్ద



మద్యం మత్తులో కొందరు యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో, ఆవేశానికి లోనైన కొంతమంది యువకులు రవి వర్మ అనే వ్యక్తిపై మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడి చేశారు. యువకులు కత్తులతో పొడవడంతో రవి వర్మ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దాడిలో రవి వర్మ శరీరపై తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న రవి వర్మను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు అతనికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బహిరంగ ప్రదేశాల్లో వైన్ షాపుల వద్ద ఇలాంటి దాడులు జరగడం పట్ల స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.




# వరుసగా మూడో రోజూ నష్టాల్లో సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మళ్లీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలున్నా.. విదేశీ మదుపర్ల అమ్మకాలు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఆలస్యం వంటివి మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా మీడియా, రియాల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో సూచీలు వరుసగా మూడోరోజూ నష్టాలకే పరిమితమయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 84,856.26 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,679.86) లాభాల్లో ప్రారంభమైంది. కానీ, ఎంతోసేపు ఆ ఆనందం నిలవలేదు. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 84,415.98 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరకి 120.21 పాయింట్ల నష్టంతో 84,559.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 41.55 పాయింట్ల నష్టంతో 25,818.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.37గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, టీసీఎస్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.34 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4320.20 వద్ద ట్రేడవుతోంది.

# కేంద్రం చర్యలతో బంగారం మరింత పైపైకి..

**భారతదేశంలో బంగారం వినియోగానికి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారాన్ని దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ ఒకటి.అయితే, ఇటీవల మారుతున్న అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు, రూపాయి విలువ క్షీణత వంటి కారణాలతో కేంద్ర ప్రభుత్వం బంగారంపై బేస్ ఇంపోర్ట్ ట్యాక్స్‌ను పెంచడంపై చర్చిస్తోంది. ఈ నేపథ్యంలో, ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన కారణాలు, దీనివల్ల కలిగే పర్యవసానాలను చూద్దాం.**

ఇంపోర్ట్ ట్యాక్స్ పెంచడానికి ప్రధాన కారణాలు
భారత ప్రభుత్వం సాధారణంగా కరెంట్ అకౌంట్ డెఫిసిట్(ద్రవ్యలోటు) నియంత్రించడానికి, రూపాయి విలువను కాపాడటానికి ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికన్ డాలర్ బలోపేతం కావడం, భారత రూపాయి విలువ ఆల్-టైమ్ కనిష్టానికి (దాదాపు రూ.91 మార్కుకు) పడిపోవడం ఆందోళనగా మారింది. రూపాయి పతనమైతే దిగుమతి చేసుకునే వస్తువుల ఖరీదు పెరుగుతుంది. బంగారం దిగుమతులకు డాలర్లలో చెల్లింపులు చేయాల్సి



రావడంతో విదేశీ మారక నిల్వలు హరించుకుపోకుండా చూసేందుకు ట్యాక్స్‌ను ఆయుధంగా వాడుతున్నారు.
**పెరుగుతున్న వాణిజ్య లోటు:**దేశం నుంచి అయ్యే ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉన్నప్పుడు వాణిజ్య లోటు ఏర్పడుతుంది. భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకునే వస్తువుల్లో ముడి చమురు తర్వాత బంగారం రెండో స్థానంలో ఉంది. దిగుమతులు తగ్గించడం ద్వారా ఈ లోటును పూడ్చాలని ప్రభుత్వం భావిస్తోంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ అనిశ్చితి వల్ల ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇది మన దిగుమతి బిల్లును మరింత పెంచుతోంది.
దిగుమతి సుంకం రేట్లు (ప్రస్తుతం):గతంలో (2024 బడ్జెట్‌లో) ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 15% నుంచి 6%కి తగ్గించింది. అయితే ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నిపుణులు ఈ సుంకాన్ని మళ్లీ పెంచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.
**పర్యవసానాలు:**
వినియోగదారులపై భారం:సుంకం పెరగడం వల్ల దేశీయంగా బంగారం ధరలు పెరుగుతాయి. సామాన్యులకు, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనడం భారంగా మారుతుంది. ఇప్పటికే 10 గ్రాముల ధర రికార్డు స్థాయిలకు చేరడంతో అదనపు పన్ను కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది.
**స్మగ్లింగ్ పెరిగే ప్రమాదం:**దిగుమతి సుంకం ఎక్కువగా ఉంటే దేశీయ మార్కెట్ ధరలకు, అంతర్జాతీయ ధరలకు మధ్య వ్యత్యాసం పెరుగుతుంది. ఈ గ్యాప్‌ను సొమ్ము చేసుకునేందుకు అక్రమ మార్గాల్లో (స్మగ్లింగ్) బంగారాన్ని తరలించే ముఠాలు చురుగ్గా మారే అవకాశం ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ హెచ్చరిస్తోంది.
జ్యువెలరీ పరిశ్రమపై ప్రభావం:పెరిగిన ధరల వల్ల అమ్మకాలు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల ఆభరణాల తయారీ రంగంలో పనిచేసే లక్షలాది మంది కార్మికుల ఉపాధిపై ప్రభావం పడుతుంది. అలాగే, భారత్ నుంచి జరిగే ఆభరణాల ఎగుమతులు కూడా అంతర్జాతీయ


దేశం నుంచి అయ్యే ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉన్నప్పుడు వాణిజ్య లోటు ఏర్పడుతుంది. భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకునే వస్తువుల్లో ముడి చమురు తర్వాత బంగారం రెండో స్థానంలో ఉంది. దిగుమతులు తగ్గించడం ద్వారా ఈ లోటును పూడ్చాలని ప్రభుత్వం భావిస్తోంది.

మార్కెట్‌లో పోటీని తట్టుకోవడం కష్టమవుతుంది.
ప్రత్యామ్నాయ మార్గాలు:ప్రభుత్వం కేవలం పన్నుల మీదనే ఆధారపడకుండా భౌతిక బంగారం దిగుమతిని తగ్గించడానికి కొన్ని ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలి. గోల్డ్ ఈటీఎఫ్‌లు స్టాక్ మార్కెట్ ద్వారా బంగారంపై పెట్టుబడి పెట్టేందుకు సాధనాలుగా ఉన్నాయి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్‌ల ద్వారా ఇళ్లలో ఉన్న బంగారాన్ని బ్యాంకుల ద్వారా చెలామణిలోకి తీసుకురావాలి. ఇప్పటికే ఈ పని చేస్తున్నా దీన్ని మరింతగా పెంచాలి.
బేస్ ఇంపోర్ట్ ట్యాక్స్ పెంపు అనేది ఆర్థిక వ్యవస్థను సమతుల్యం చేయడానికి ప్రభుత్వం తీసుకునే ఒక కఠినమైన నిర్ణయం. రూపాయి విలువను కాపాడటం, వాణిజ్య లోటును తగ్గించడం దీని వెనుక ఉన్న సానుకూల ఉద్దేశ్యాలు అయినప్పటికీ దీనివల్ల దేశీయంగా ధరలు పెరగడం, జ్యువెలరీ రంగం మందగించడం వంటి సవాళ్లు తప్పవని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఉద్యోగం చేస్తూ కోటీశ్వరులు కావాలంటే..



ఉద్యోగం చేసేవారికి కోటీశ్వరులు కావాలనే కల నెరవేర్చుకోవడానికి క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి ప్రణాళిక చాలా ముఖ్యం. కేవలం పొదుపు చేయడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం.అందుకే పెట్టుబడి పెట్టడం ద్వారా మీ డబ్బు మీ కోసం పనిచేసేలా చేయాలి. దీనికి తోడు చక్రవడ్డీ శక్తిని అర్థం చేసుకోవడం, వీలైనంత త్వరగా పెట్టుబడి పెట్టడం, రిస్క్‌ను తట్టుకునే సామర్థ్యాన్ని బట్టి వివిధ మార్గాల్లో పెట్టుబడులను విభజించడం చాలా అవసరం. పెట్టుబడి పెట్టడానికి ఉద్యోగులకు అందుబాటులో ఉన్న ప్రధాన మార్గాలు ఏమిటో చూద్దాం.
**మ్యూచువల్ ఫండ్స్:**ఉద్యోగులకు కోటీశ్వరులయ్యే లక్ష్యాన్ని చేరేందుకు మ్యూచువల్ ఫండ్స్ అత్యంత ప్రజాదరణ పొందిన మార్గాలలో ఒకటి. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఒక నిర్ణీత మొత్తాన్ని పెట్టుబడి పెట్టడానికి సిప్ విధానం అనుకూలంగా ఉంటుంది. ఇది మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గిస్తుంది. చిన్న మొత్తంతో మొదలుపెట్టి జీతం పెరిగే కొద్దీ సిప్ మొత్తాన్ని పెంచుకుంటూ పోవడం మంచి పద్ధతి.
**ఈక్విటీ ఫండ్స్:**దీర్ఘకాలంలో అధిక రాబడిని ఆశించేవారికి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అనుకూలం. ఇవి అధిక రిస్క్‌తో కూడినప్పటికీ ద్రవ్యోల్బణాన్ని అధిగమించే శక్తిని కలిగి ఉంటాయి.
**డెట్ ఫండ్స్:**ఇవి బాండ్‌లు, గవర్నమెంట్ సెక్యూరిటీస్ వంటి స్థిర ఆదాయ సాధనాల్లో పెట్టుబడి పెడతాయి. తక్కువ రిస్క్, స్థిరమైన రాబడి కోరుకునే వారికి ఇవి ఉపయోగపడతాయి.
**ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్:**ఇవి ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్. పెట్టుబడిపై ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం లభిస్తుంది. అయితే వీటికి కనీసం మూడు సంవత్సరాల లాక్ ఇన్ పీరియడ్ ఉంటుంది.
**ఈక్విటీ, స్టాక్ మార్కెట్:**పెట్టుబడిపై అధిక నియంత్రణ, అధిక రాబడిని కోరుకునే వారికి స్టాక్ మార్కెట్‌లో నేరుగా పెట్టుబడి పెట్టడం ఒక మార్గం. స్టాక్ మార్కెట్‌లో నేరుగా పెట్టుబడి పెట్టాలంటే మార్కెట్‌పై, కంపెనీల ఫండమెంటల్స్‌పై మంచి అవగాహన ఉండాలి. ఇది మ్యూచువల్ ఫండ్స్ కంటే అధిక రిస్క్‌తో కూడుకున్నది. దీర్ఘకాలికంగా బలంగా ఉన్న మంచి వృద్ధి సామర్థ్యం కలిగిన నాణ్యమైన కంపెనీల షేర్లను ఎంచుకోవడం వల్ల అద్భుతమైన రాబడిని పొందే అవకాశం ఉంది. మీ పోర్ట్‌ఫోలియోలో కొంత భాగాన్ని మాత్రమే డైరెక్ట్ ఈక్విటీకి కేటాయించడం, ఒకే రంగంలో లేదా ఒకే షేరులో ఎక్కువ పెట్టుబడి పెట్టకుండా వైవిధ్యపరచడం చాలా ముఖ్యం.
**రియల్ ఎస్టేట్:**భౌతిక ఆస్తులు:ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లు లేదా వాణిజ్య ఆస్తులను కొనుగోలు చేయడానికి పెద్ద మొత్తంలో మూలధనం అవసరం. అద్దెల ద్వారా క్రమం తప్పకుండా ఆదాయం, ఆస్తి విలువ పెరగడం ద్వారా దీర్ఘకాలికంగా మూలధన వృద్ధి లభిస్తుంది. అయితే నిర్వహణ ఖర్చులు, లిక్విడిటీ లేకపోవడం వంటి సవాళ్లు ఉంటాయి.
**రీట్స్:**రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టడానికి ఇదొక సులభమైన మార్గం. రీట్స్ అనేవి స్టాక్ మార్కెట్‌లో ట్రేడ్ అవుతున్న మ్యూచువల్ ఫండ్స్ లాంటివి. వీటి ద్వారా చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టి, భారీ వాణిజ్య ఆస్తుల యజమాన్యంలో భాగస్వామి కావచ్చు. అద్దెల ఆదాయంలో వాటాను పొందవచ్చు. ఇది తక్కువ రిస్క్‌తో రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను అందిస్తుంది.
**చిన్న వ్యాపారాలు:**పెట్టుబడి పెట్టడం ద్వారా కాకుండా మీ ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా కూడా లక్ష్యాన్ని చేరుకోవచ్చు. ఉద్యోగానికి భంగం కలగకుండా మీ నైపుణ్యాలు లేదా అభిరుచులకు అనుగుణంగా ఫ్రీలాన్సింగ్, ఆన్‌లైన్ సేవలు, కన్సల్టింగ్, లేదా చిన్న ఆన్‌లైన్ వ్యాపారాన్ని ప్రారంభించడం ద్వారా అదనపు ఆదాయాన్ని సృష్టించవచ్చు.ఈ సైడ్ బిజినెస్ ద్వారా వచ్చిన అదనపు ఆదాయాన్ని పైన పేర్కొన్న పెట్టుబడి మార్గాల్లోకి మళ్లించడం ద్వారా అనుకున్న ఆర్థిక లక్ష్యాన్ని మరింత వేగంగా చేరుకోవచ్చు. కొంతమంది విజయవంతమైన చిరు వ్యాపారాల్లో చిన్న మొత్తంలో మూలధనాన్ని పెట్టుబడి పెట్టడం ద్వారా కూడా లాభాలు పొందవచ్చు. కానీ దీనికి ఆ వ్యాపారంపై పూర్తి అవగాహన ఉండాలి. ఇది కొంత రిస్క్‌తో కూడుకుంది.
ఇతర ముఖ్యమైన పెట్టుబడి మార్గాలు
**పీపీఎఫ్:** పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అనేది ప్రభుత్వం మద్దతుతో నడిచే సురక్షితమైన, దీర్ఘకాలిక పెట్టుబడి పథకం. దీనికి 15 సంవత్సరాల లాక్-ఇన్ పీరియడ్ ఉంటుంది. రాబడి స్థిరంగా, పన్ను రహితంగా ఉంటుంది. ఇది తక్కువ రిస్క్ కోరుకునే వారికి అనుకూలం.






# అంతా ట్రంప్ వల్లే..

భారత్ - అమెరికా ట్రేడ్ డీల్ జాప్యం వెనుక అమెరికా అధ్యక్షుడి హస్తం!

*అమెరికా విధిస్తున్న కఠినమైన టారిఫ్ రూల్స్ ఒకవైపు, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని వాషింగ్టన్ జీర్ణించుకోలేకపోవడం మరోవైపు.. ఈ రెండింటి మధ్య ట్రేడ్ డీల్ దోబూచులాడుతోంది. అసలు ఈ రెండు దేశాల మధ్య ఉన్న పేచీ ఎక్కడ? అగ్రరాజ్యం ఆంక్షల నడుమ భారత్ తన ప్రయోజనాలను ఎలా కాపాడుకుంటోంది? ఈ ప్రతిష్టంభనకు గల కారణాలపై ప్రత్యేక విశ్లేషణ..*

## టారిఫ్ యుద్ధం.. అమెరికా అభ్యంతరం

భారత మార్కెట్ ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు కలిగిన మార్కెట్లలో ఒకటి అని అమెరికా వాదిస్తుంది. ముఖ్యంగా హార్లే డేవిడ్‌సన్ వంటి బైకులు, ఐటీ, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న పన్నులను తగ్గించాలని కోరుతోంది.

## రష్యా నుంచి చమురు కొనుగోళ్లు

ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా, పాశ్చాత్య దేశాలు రష్యాపై కఠినమైన ఆంక్షలు విధించాయి. అయితే భారత్ తన ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకుని రష్యా నుంచి రాయితీపై చమురు కొనుగోలు చేయడం ప్రారంభించింది. ఇది అమెరికాలోని కొందరు రాజకీయ నాయకులకు నచ్చలేదు. రష్యాకు ఆర్థికంగా మద్దతు ఇస్తున్నారని అమెరికా భావిస్తుండగా భారత్ తన స్ట్రాటజిక్ అటానమీ(వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి) వైఖరిని స్పష్టం చేసింది. ఈ భౌగోళిక రాజకీయ భేదాభిప్రాయాలు వాణిజ్య చర్చలపై ప్రభావం చూపుతున్నాయి.

## జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ హెూదా

గతంలో అమెరికా భారత్‌కు జీఎస్‌పీ హెూదా ఇచ్చేది. దీని ద్వారా కొన్ని భారతీయ ఉత్పత్తులు సుంకం లేకుండానే అమెరికాలోకి ప్రవేశించేవి. ట్రంప్ మొదటి హయాంలో ఈ హెూదాను రద్దు చేశారు. దీన్ని పునరుద్ధరించాలని భారత్ పట్టుబడుతుండగా, అమెరికా మాత్రం భారత మార్కెట్లలో తమ డెయిరీ, మెడికల్ డివైజ్‌లకు మరింత వెసులుబాటు ఇస్తేనే ఆలోచిస్తామని అంటోంది.

## డేటా గోప్యత, ఈ-కామర్స్ విధానాలు

అమెరికన్ దిగ్గజాలైన అమెజాన్, వాల్‌మార్ట్ (ఫ్లిప్‌కార్ట్), గూగుల్ వంటి కంపెనీలు భారత మార్కెట్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాయి. భారత్ తీసుకొస్తున్న డేటా లోకలైజేషన్(భారతీయ వినియోగదారుల సమాచారం ఇక్కడే ఉండాలి), ఈ-కామర్స్ నిబంధనలు అమెరికాకు ఇబ్బందికరంగా మారాయి. తమ కంపెనీలకు భారత్ 'లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్'(పోటీలో ఉన్న అందరికీ సమాన అవకాశాలు కల్పించడం) కల్పించడం లేదని అమెరికా వాణిజ్య శాఖ తరచుగా ఆరోపిస్తోంది.

## క్రూడాయిల్.. ఎస్-400 పేచీ

ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాపై ఆంక్షలు ఉన్నప్పటికీ భారత్ రష్యా నుంచి ముడి చమురు, రక్షణ పరికరాలను కొనుగోలు చేయడం ట్రంప్‌నకు నచ్చడం లేదు. రష్యా నుంచి చమురు దిగుమతులు కొనసాగిస్తున్నందుకు భారత్‌పై అదనంగా మరో 25% పెనాల్టీ సుంకాన్ని విధించారు. అంటే ప్రస్తుతం కొన్ని భారతీయ ఉత్పత్తులపై మొత్తం 50% సుంకం అమలవుతోంది. భారత్ తన విదేశాంగ విధానాన్ని మార్చుకునేలా ఒత్తిడి తేవడానికి ఈ డీల్‌ను ఒక ఆయుధంగా వాడుతున్నారు.అమెరికా రైతుల ప్రయోజనాలే పరమావధిగా ట్రంప్ పనిచేస్తున్నారు. అమెరికా నుంచి వచ్చే పాలు, పాల ఉత్పత్తులు, బియ్యం వంటి వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని ఆయన కోరుతున్నారు. ఇటీవల భారతీయ బియ్యం ఎగుమతులపై కూడా ట్రంప్ అసహనం వ్యక్తం చేస్తూ అదనపు సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. భారత రైతుల ప్రయోజనాల దృష్ట్యా మన ప్రభుత్వం దీనికి సుముఖంగా లేదు. దీంతో చర్చలు నిలిచిపోయాయి.

## భారత్ వాదన

భారత్ తన దేశీయ పరిశ్రమలను కాపాడుకోవడానికి ఈ పన్నులు అవసరమని చెబుతోంది. డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీ కాలంలో భారత్‌ను 'టారిఫ్ కింగ్' అని పిలవడం, ప్రస్తుతం మళ్లీ అధికారం చేపట్టాక అదే ధోరణి కొనసాగుతోంది.

## ఫార్మా రంగంలో..

అమెరికన్ ఫార్మా కంపెనీలు తమ మందుల పేటెంట్ హక్కుల విషయంలో భారత్ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తున్నాయి. తక్కువ ధరకే జనరిక్ మందులను ఉత్పత్తి చేసే భారత విధానం తమ లాభాలను దెబ్బతీస్తోందని వారి వాదన.డొనాల్డ్ ట్రంప్ అమెరికా ఫస్ట్ విధానంలో భాగంగా భారత్‌తో ట్రేడ్ డీల్‌ను వ్యూహాత్మకంగా వాయిదా వేస్తున్నారని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. 2025లో చోటుచేసుకున్న తాజా పరిణామాలు, ట్రంప్ శైలిని పరిశీలిస్తే దీని వెనుక ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి.

## ప్రతికార సుంకాలు

భారత్ అమెరికా వస్తువులపై ఎంత పన్ను విధిస్తుందో, అమెరికా కూడా భారత వస్తువులపై అంతే పన్ను విధించాలని ట్రంప్ పట్టుబడుతున్నారు. దాంతో 2025 ఆగస్టులో భారత్ నుంచి వచ్చే ఎగుమతులపై ట్రంప్ ప్రభుత్వం 25% రెసిప్రోకల్ సుంకాన్ని విధించింది. భారత్ తన వైపు నుంచి పన్నులు తగ్గించే వరకు ఈ డీల్‌పై సంతకం చేయకూడదనేది ఆయన ఉద్దేశం.

**ఒకటి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ.. మరొకటి వేగంగా దూసుకుపోతున్న ఆర్థిక శక్తి. వ్యూహాత్మకంగా చూస్తే ఇద్దరిదీ విడదీయరాని బంధం. కానీ, వ్యాపారం విషయానికి వస్తే మాత్రం నువ్వా-నేనా అన్నట్లుగా పరిస్థితులు మారుతున్నాయి.గత కొన్నేళ్లుగా భారత్-అమెరికా మధ్య భారీ వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ప్రపంచమంతా ఆశగా ఎదురుచూస్తోంది. అయితే ప్రతిసారీ చర్చలు కొలిక్కి వచ్చే సమయానికి ఏదో ఒక అడ్డంకి పలకరిస్తూనే ఉంది.**

## వ్యక్తిగత ప్రతిష్ఠ, మధ్యవర్తిత్వం

కొన్ని విశ్లేషణల ప్రకారం (ఉదాహరణకు: జెఫరీస్ గ్రూప్ నివేదిక), భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతల సమయంలో తాను మధ్యవర్తిత్వం చేస్తానని ట్రంప్ ఆఫర్ ఇచ్చారు. కానీ భారత్ దాన్ని సున్నితంగా తిరస్కరించడం ఆయనకు నచ్చలేదని, ఆ అసహనం కూడా వాణిజ్య చర్చల జాప్యానికి ఒక కారణమని భావిస్తున్నారు. ట్రంప్ తన మద్దతుదారులకు తాను ఇతర దేశాలతో వాణిజ్యం పరంగా ఒక కఠినమైన బేరసారాలాడే వ్యక్తి అని నిరూపించుకోవాలి. భారత్ నుంచి భారీగా రాయితీలు పొందితేనే అది తనకు రాజకీయంగా విజయం అని ఆయన నమ్ముతున్నారు.

## ప్రస్తుత పరిస్థితి

ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు పూర్తిగా ఆగిపోలేదు. ఇటీవల కూడా అమెరికా వాణిజ్య ప్రతినిధుల బృందం భారత్‌లో పర్యటించింది. అమెరికా పట్టుబడుతున్న మొక్కజొన్న సోయా వంటి ఉత్పత్తులను భారత్‌లోకి అనుమతించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇరు దేశాలు ఈ విషయంలో ఒక అంగీకారానికి వస్తే 2026 ప్రారంభంలో ఈ సుంకాలు తగ్గే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# భారీగా జీతాల పెంపు ఈ రంగాల్లోనే..

**న్యూఢిల్లీ:**భారతీయ కార్పొరేట్ రంగంలో ఉద్యోగుల జీతాల పెరుగుదల నిలకడగా కొనసాగుతోంది. కనీసం వచ్చే ఏడాదైనా వేతనాల పెంపు ఆశించినమేర ఉంటుందని కొందరు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ మెర్సర్ నిర్వహించిన 'టోటల్ రెమ్యునరేషన్ సర్వే' ప్రకారం, 2026 సంవత్సరంలో భారతదేశంలోని కంపెనీలు సగటున 9 శాతం వేతన పెంపును అమలు చేసే అవకాశం ఉంది. దాదాపు 1,500 కంటే ఎక్కువ సంస్థల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.
**రంగాల వారీగా అంచనాలు**
ఈ పెంపులో కొన్ని రంగాలు ఇతర విభాగాల కంటే మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాయి. ఆటోమోటివ్, మ్యానుఫ్యాక్చరింగ్, ఇంజినీరింగ్ రంగాల్లో పనిచేసే ఉద్యోగుల వేతనాలు 9.5 % జీసీసీలో పని చేసే ఉద్యోగులకు సుమారు 9 శాతం మేర పెంపు ఉంటుందని అంచనా.ఈ సందర్భంగా మెర్సర్ ఇండియా రివార్డ్స్ కన్సల్టింగ్ లీడర్ మాలతి కేఎస్ మాట్లాడుతూ..'భారతదేశంలో మెరిట్ ఆధారిత వేతన పెంపు స్థిరంగా ఉండటం అనేది ఆర్థిక వాతావరణం పట్ల సంస్థల నమ్మకాన్ని సూచిస్తుంది. వ్యయ నియంత్రణ పాటిస్తూనే అగ్రశ్రేణి ప్రతిభావంతులను ఆకర్షించేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి' అని చెప్పారు.



**ఇన్సెంటివ్‌లపై ఫోకస్**
ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో కంపెనీలు తమ రివార్డ్ విధానాల్లో మార్పులు చేస్తున్నాయి. కేవలం వార్షిక పెంపుపైనే కాకుండా స్వల్పకాలిక ప్రోత్సాహకాలపై కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. ఖర్చులను అదుపులో ఉంచుతూనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఉద్యోగులను నిలుపుకోవడానికి ఇది ఒక వ్యూహాత్మక చర్యగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.
**నియామకాల్లో తగ్గుదల..**
వేతనాల పెంపు ఆశాజనకంగా ఉన్నప్పటికీ కొత్త నియామకాల విషయంలో కంపెనీలు కొంత అప్రమత్తత పాటిస్తున్నాయి. 2024లో 43 శాతంగా ఉన్న నియామక విస్తరణ ప్రణాళికలు 2026 నాటికి 32 శాతానికి తగ్గే అవకాశం ఉంది. సుమారు 31 శాతం కంపెనీలు నియామకాలపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే ఈ ఏడాదిలో అట్రిషన్ రేటు(ఉద్యోగులు సంస్థలను వదిలి వెళ్లే రేటు) గణనీయంగా తగ్గింది.

# తండ్రిని హత్య చేసిన ఎన్ఆర్ఐ

న్యూయార్క్:ఇల్లినాయిస్‌లోని షామ్‌బర్గ్‌లో భారత సంతతికి చెందిన 28 ఏళ్ల వ్యక్తి, 67 ఏళ్ల వృద్ధ తండ్రిని సుత్తితో మోది దారుణంగా హత్య చేశాడు. థాంక్స్ గివింగ్ వారాంతంలో తండ్రిని చంపినట్లు ఆరోపణలపై అభిజిత్ పటేల్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు ఫస్ట్-డిగ్రీ హత్య కేసు నమోదు చేశారు.కుక్ కౌంటీ ప్రాసిక్యూటర్ల ప్రకారం బాధితుడు అనుపమ్ పటేల్ డయాబెటిస్‌తో బాధపడుతున్నకారణంగా ఇంట్లోనే ఉంటున్నాడు. నవంబర్ 29న కుమారుడు చేతిలో హత్యకు గురయ్యాడు.
కేసు ఏంటీ అంటే..
అనుపమ్ పటేల్ భార్య ఉదయం డ్యూటీకి వెళ్లిపోయింది. తండ్రీ కొడుకులిద్దరు ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. ప్రతీరోజు ఉదయం 8 గంటల తన బ్లడ్ షుగర్ లెవల్స్ గురించి భార్యకు ఫోన్ చేయడం అలవాటు. పైగా అతని గ్లూకోజ్ మానిటర్ భార్య ఫోన్‌కు కనెక్ట్ అయ్యి ఉంది. హత్య జరిగిన రోజు భర్త నుంచి ఫోన్ రాకపోవడం, అతని గ్లూకోజ్ స్థాయిలు పడిపోవడం గమనించింది. ఫోన్‌లో వారితో సంప్రదించాలని ప్రయత్నించినా సమాధానం లేకపోవడంతో ఆందోళన ఇంటికి పరుగు తీసింది. ఎదురుగా కనిపించిన కొడుకు నాన్న బాగానే ఉన్నాడులే అని చెప్పాడు. ఏదో అనుమానం వచ్చి తల్లి చెక్ చేయగా, మంచం మీద రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను చూసి హతాశురాలైంది. వెంటనే పోలీసులకు ఫోన్ చేసింది. వారి సాయంతో భర్తను ఆసుపత్రికి తరలించింది. కానీ అప్పటికే ప్రాణం పోయిందని వైద్యులు ప్రకటించారు. సంఘటనా స్థలంలో ఒక పెద్ద సుత్తిని గుర్తించారు పోలీసులు. అనుపమ్ పటేల్ తలకు తీవ్ర గాయాలు, పుర్రె, ముక్కు ఎముక విరిగినట్టు పోస్ట్ మార్టం రిపోర్ట్‌లో తేలింది. మరోవైపు నిందితుడు అభిజిత్ పటేల్ పోలీసులకు లొంగిపోయాడు. విచారణ సమయంలో, చిన్నతనంలో తండ్రి తనను లైంగికంగా వేధించాడని, అందుకే చంపేశానని, ఇది తన డ్యూటీని అని చెప్పుకొచ్చాడు. అయితే స్కిజోఫ్రీనియా బాధితుడైన అభిజిత్, గతంలో చికిత్స కోసం గతంలో ఆసుపత్రిలో చేరినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. దీంతో అభిజిత్ ఆరోపణలన్నీ భ్రమలు కావచ్చని పోలీసుల అంచనా. దీనికి తోడు గతంలో చాలా సార్లు తండ్రిని చంపేస్తానని బెదరించేవాడట. దీంతో అభిజిత్ తండ్రిని సంప్రదించకుండా చట్టబద్ధంగా నిషేధం 2027 జనవరి వరకు అమల్లో ఉంది. అయితే అతని తల్లిదండ్రులు ఇంట్లో నివసించడానికి అనుమతించారు. కానీ ఇంతలోనే ఘోరం జరిగింది. ఈ నేపథ్యంలో అభిజిత్ పటేల్ నాన్ బెయిలబుల్ కేసులు నమోదైనాయి. అంతేకాదు తల్లిని సంప్రదించకుండా ఉండేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. తదుపరి విచారణ డిసెంబర్ 19న జరగనుంది.

# ఆధార్ డేటా సేఫ్




ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఉడాయ్‌లో సుమారు 134 కోట్ల మంది ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 16వేల కోట్ల అథంటేకేషన్ లావాదేవీలు జరిగాయని కేంద్రమంత్రి తన సమాధానంలో వెల్లడించారు. బలమైన సాంకేతిక, సంస్థాగత భద్రతా చర్యల కారణంగా ఆధార్ డేటా సురక్షితంగా ఉందని తెలిపారు. ఆధార్ డేటా భద్రతకు ఉడాయ్.. డిఫెన్స్- ఇన్- డెప్త్ విధానాన్ని అనుసరిస్తూ బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. ఇందులో ఒక లేయర్ దెబ్బతిన్నా.. మిగిలినవి డేటాకు రక్షణ కల్పిస్తాయని చెప్పారు. ఇది ఎప్పటికప్పుడు ఆధార్ సైబర్ సెక్యూరిటీకి సంబంధించి సూచనలు చేస్తుంటుందని పేర్కొన్నారు. దీనికితోడు స్వతంత్ర ఆడిట్ ఏజెన్సీలు కూడా ఆధార్ ఎకోసిస్టమ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

# పెన్షన్ భిక్ష కాదు - ఉద్యోగుల రాజ్యాంగబద్ధమైన హక్కు

- పెన్షనర్లకు జాగ్రత్తే భద్రత
- జాతీయ పెన్షనర్స్ డేను 800 మంది పెన్షనర్లతో కరీంనగర్‌లో ఘనంగా వేడుకలు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 17(జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని స్థానిక టీఎన్జీవోల సంఘ భవనంలో టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా టీపీసీఏ అసోసి యేషన్ అధ్యక్షులు పెండ్యాల కేశవ రెడ్డి, ఎలదాసరి లింగయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేష్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో కీర్తిశేషులు నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పెన్షన్ అనేది భిక్ష కాదని, దయాదాక్షిణ్యం కాదని, 30-35 సంవత్సరాలు ప్రజాసేవ చేసిన ఉద్యోగికి వృద్ధాప్యంలో సామాజిక, ఆర్థిక భద్రత కల్పించే హక్కు అని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసిందని తెలిపారు. పెన్షన్ వ్యవస్థను పునరుద్ధరింపజేసిన నకారా న్యాయపోరాటానికి జిల్లా పెన్షనర్ల సంఘం, తెలంగాణ ఎన్జీవోల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నేటి కల్తీ యుగంలో పెన్షనర్లు ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు సమిష్టి పోరాటం అవసరమని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులుగా మాట్లాడిన అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేష్ కుమార్ మాట్లాడుతూ, తమ వద్దకు సీనియర్ సిటిజన్లకు సంబంధించిన అనేక కుటుంబ, ఆర్థిక సమస్యలు, మోసాలకు సంబంధించిన కేసులు వస్తున్నాయని, పెన్షనర్లు ఎవరినీ అతిగా నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాజుల నరసయ్య, జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపెల్లి కాళీచరణ్, కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఏ.ఎం. హమీద్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుద్దాల రాజయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, సర్దార్ అర్వీందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్, హజ్గర్ భరద్వాజ్, చల్ల మోహన్ రెడ్డి, నాగుల రాజారామ్, ఆదిరెడ్డి లక్ష్మీరాజం, నరసింహచారి, మక్సుద్ మీర్జా, సత్తయ్య, ఎల్లయ్య, పద్మా రావు, రాజయ్య, లచ్చిరెడ్డి, సుధాకర్, లక్ష్మీ, దయాకర్ రావు, భగవాన్ రెడ్డి, అమ్మ రాజయ్య, నరసయ్య, మహమ్మద్ అజ్గర్ అలీ తదితర ఉద్యోగ సంఘాల నాయకులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు 800 మంది పెన్షనర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో 80 మంది సీనియర్ సిటిజన్లను శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు. పెన్షనర్లకు భోజన సదుపాయాలు, ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసి ఘనంగా గౌరవించినందుకు టీఎన్జీవోల సంఘానికి పెన్షనర్ల సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు.



## సుడా చైర్మన్ ఆధ్వర్యంలో మంత్రులను కలిసిన సర్పంచులు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 17(జనంసాక్షి):** ఇటీవల గెలిచిన కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లను కలిశారు. మంత్రులు గెలిచిన సర్పంచులను అభినందించి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి పథకాలు అమలయ్యే విధంగా చూడాలని సూచించారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఏఏ గ్రామాలకు ఎన్ని నిధులు అవసరమో అంచనాలు రూపొందించి ఇవ్వాలని సూచించారు. సర్పంచుల గెలుపుకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రులను కలిసిన వారిలో చర్లభూత్కూర్, చామనిపల్లి, దుబ్బపల్లి బహదూరాన్ పేట్, జూబ్లీ నగర్, ఎలబోతారం, ఫకీర్ పేట్, చేగుర్తి, నల్లగుంట పల్లె సర్పంచులు, ఉపసర్పంచులు ఇరుకుల్ల ఉప సర్పంచ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాంరెడ్డి రాంరెడ్డి, పంజాల స్వామి గౌడ్, నాయకులు పెంచాల లక్ష్మణ్ రావు, బుర్ర నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# చెక్ డ్యామ్ నిధులు నీళ్లపాలు

- కొట్టుకుపోయిన మానేరు చెక్ డ్యామ్
- అడవి సోమన్‌పల్లి మానేరు వద్ద నిర్మించిన చెక్ డ్యామ్
- గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం

**మంథని, (జనంసాక్షి) :** మానేరు నదిలో నీటి ప్రవాహం పెరగడంతో చెక్ డ్యామ్ కొట్టుకుపోయిన ఘటన మంథని మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మంథని మండలం అడవి సోమన్‌పల్లి గ్రామపరిధిలోని మానేరు నది పై గత ప్రభుత్వ హయాంలో చెక్ డ్యామ్‌ను నిర్మించారు. ఈ చెక్ డ్యామ్‌ను రైతుల పంట పొలాలకు అవసరమైన నీటిని నిల్వ చేయాలనే ఉద్దేశంతో నిర్మించారు. అయితే గురువారం ఉదయం మానేరు నదిలో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో చెక్ డ్యామ్ పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ ఘటన వెనుక నాసిరకం పనులా..? అధికారుల పర్యవేక్షణ లోపమా..? కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా..? లేక గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో విధ్వంసమా..? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. చెక్ డ్యామ్ నిర్మాణానికి వెచ్చించిన నిధులు నీళ్లపాలయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన పై సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, చెక్ డ్యామ్ ఎలా కొట్టుకుపోయిందనే అంశంపై విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బస్సు నుంచి దిగబోయిన వ్యక్తి తీవ్రగాయాలు

**చేవెళ్ల, డిసెంబరు 17 (జనంసాక్షి) :** కదిలిన బస్సు నుంచి దిగబోయిన వ్యక్తి వెనుక చక్రాల కింద పడి తీవ్రగాయాలైన సంఘటన చేవెళ్ల బస్టాండులో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన యాదయ్య బుధవారం సాయంత్రం పటాన్ చెరువు వెళ్లేందుకు స్థానిక బస్టాండులో శంకర్పల్లి బస్సు ఎక్కాడు. కొద్ది దూరం వెళ్లగానే బస్సు మెట్ల పై నిలబడిన అతడు అకస్మికంగా దిగబోయాడు. ఒక్కసారిగా కిందపడిపోవడంతో బస్సు వెనుక చక్రాలు కాలు పై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలై రక్తం రోడ్డు పై పారింది. వెంటనే అక్కడే ఉన్న వారు అతడిని 108 వాహనంలో చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మేరుగైన చికిత్స కోసం నగరంలోని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మూడవ విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- మూడవ విడత పోలింగ్ 85.66 శాతం నమోదు



పెద్దపల్లి,డిసెంబర్ 17(జనంసాక్షి) : జిల్లాలో నిర్వహించిన మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మూడవ విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓదెల మండలం కొలనూరు జెడ్పీహెచ్ఎస్, పెద్దపల్లి మండలం పెద్ద కల్వల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మూడవ విడత 85 గ్రామ పంచాయతీలకు, 636 వార్డులకు నిర్వహించిన పోలింగ్ లో 85.66 % మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఉదయం 9 గంటల వరకు 22.50%, 11 గంటలకు 57.21%, 1 గంట వరకు 82.34% పోలింగ్ నమోదైందని, ఒంటి గంట వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని, వారితో కలిపి మొత్తం పెద్దపల్లి జిల్లాలో మూడవ విడత 85.66% పోలింగ్ నమోదైందని అన్నారు. మూడవ విడత పోలింగ్ నిర్వహించిన పెద్దపల్లి మండలంలో 86.39%, సుల్తానాబాద్ మండలంలో 86.51 శాతం, ఎలిగేడు మండలంలో 83.73%, ఓదెల మండలంలో 84.70% పోలింగ్ నమోదైందని, మొత్తం లక్షా 42 వేల 548 మంది ఓటర్లకు గాను లక్షా 22 వేల 111 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పంచాయతీ ఎన్నికల మూడవ విడత పోలింగ్ సందర్భంగా ఓదెల మండలం కొలనూరు జడ్పీహెచ్ఎస్, పెద్దపల్లి మండలం పెద్ద కల్వల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఏసీపీ గజ్జి కృష్ణ, ఆర్వో లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచులు గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దండి

- మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. : మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి.
- కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దు బీఆర్ఎస్ పార్టీ అండ.
- రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సిన నిధులను ఎవరూ ఆపలేరు..



**తాండూరు డిసెంబర్ 17(జనంసాక్షి) :** నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాలను ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. తాండూర్ నియోజకవర్గ పరిధిలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల పరిధిలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు పార్టీ సీనియర్ నాయకులతో బుధవారం తాండూరులోని ఆయన నివాసంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అనుసరించాల్సిన పలు విషయాలపై చర్చించారు. పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే నని తెలిపారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బరోసాకల్పించారు. రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సిన నిధులను ఎవరూ ఆపలేరని వివరించారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటి స్థానాల్లో బిఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, కోహీర్ శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, నర్సిరెడ్డి(రాజు)తో పాటు పలువురు నాయకులు ,అయాగ్రామాల సర్పంచ్‌లు ,వార్డు మెంబర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## పొలస వ్యవసాయ విద్యార్థుల క్షేత్ర పర్యటన



**రాయికల్ డిసెంబర్ 17(జనం సాక్షి):** రాయికల్ మండలలోని మురళీధార అనుసంధాన గోష్ఠిన కేంద్రం ను వ్యవసాయ కళాశాల పొలాస అసిస్టెంట్ ప్రొఫెసర్ లు డాక్టర్. తిరుపతి మరియు అర్చన మరియు టీచింగ్ అస్సోసియేట్ దీపిక, శ్రావణి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం (నతురల్ ఫార్మింగ్)లో భాగంగా సందర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జన్నాధాపూర్ గ్రామంలో డా. పద్మ నిర్వహిస్తున్నటువంటి ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పెంపకం మరియు ఆవుల పేడ మరియు మూత్రం ద్వారా తయారు చేస్తున వివిధ ఉత్పత్తులు గురించి విద్యార్థులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యంగా ఉపయోగించే జీవామృతం, భీజామృతం, గణ జీవామృతం తయారీ విధానం గురించి క్లుప్తంగా వివరిస్తూ విద్యార్థులతో చూపించడం జరిగినది. పద్మ 5 లేయర్ పద్ధతిలో 81 రకాల మొక్కలను సాగుచేయడం జరుగుతుంది. అదేవిదంగా అల్లిపూర్ గ్రామంలో నీ రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజషన్) సందర్శించి చైర్మన్ శంకర్‌తో ఆ సంస్థ గురించి తెలుసుకోవడం జరిగింది. అదే విధంగా డిఆర్‌డిఏను కూడా సందర్శించి మహిళా సంఘాలు వాటి పనితీరు గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో అల్లీపూర్ రైతు ఉత్పత్తి దారుల సంస్థ డైరెక్టర్లు తిరుమల శంకర్, బొజ్జ దేవేందర్ రావు, సీఈఓ కొల్లూరి రాకేష్, కట్ట రాజేష్, మహిళా సంఘాల సమాఖ్య అధ్యక్షురాలు అనుమల్ల సుజాత తదితరులు పాల్గొన్నారు.

### నిజాంపేట్ గ్రామకంఠ భూమిని


# ప్రగతినగర్‌లో విలీనం చేయొద్దు

- భండారీ లేఔట్‌ను ప్రత్యేక డివిజన్‌గా కొనసాగించాలి
- జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ పేరును 'నిజాంపేట్'గా సవరించండి
- తుర్కచెరువు ఆక్రమణలు తొలగించినందుకు హైడ్రాకు ధన్యవాదాలు
- ప్రభుత్వ భూములను డీమార్కేట్ చేసి ఫెన్సింగ్ వేయించాలి



**నిజాంపేట్, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** నిజాంపేట్ మున్సిపాల్టీ ఇటీవల జీహెచ్ఎంసీలో విలీనమైన నేపథ్యంలో డివిజన్ల ఏర్పాటుపై అభిప్రాయ సేకరణలో భాగంగా బండారీ లేఔట్ సంక్షేమ సంఘం కొన్ని కీలక వినతులు సమర్పించింది. నిజాంపేట్ గ్రామకంటాకు చెందిన భూములను ప్రగతినగర్ వార్డులో విలీనం చేయకుండా, భండారీ లేఔట్‌ను ప్రత్యేకంగా 275వ డివిజన్‌గా కొనసాగించాలని సంఘం అధ్యక్షుడు ఎల్లం బాయి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కూకట్‌పల్లి జోనల్ డిప్యూటీ కమిషనర్ వీ. శ్రీనివాస్ రెడ్డిని కలిసి రెండు వినతిపత్రాలు అందజేశారు. నిజాంపేట్ గ్రామకంట భూములను నిజాంపేట్, భండారీ లేఔట్ డివిజన్లలోనే ఉంచేలా సవరణ చేయాలని కోరారు. అదే రోజు బేగంపేట్‌లోని మెట్రో రైల్ భవనంలో ఎండీ పేషీకి వెళ్లి జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ పేరును సవరించాలని మరో వినతిపత్రం సమర్పించారు. ఒకప్పుడు నిజాంపేట్ క్రాస్‌రోడ్స్‌గా పిలిచే ఈ స్టేషన్ పేరులో 'నిజాంపేట్'ను కలపాలని, అప్పుడే బాచుపల్లి, మల్లంపేట్, పొరుగు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు సులభంగా అర్థమవుతుందని వివరించారు.
ఇటీవల తుర్కచెరువు సమీపంలో రేకులు వేసి ఆక్రమణలు జరుగుతున్నాయని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, బుధవారం ఆ ఆక్రమణలు తొలగించినందుకు ఇన్‌స్పెక్టర్ నరేష్‌కు సంఘం ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. తుర్కచెరువు వద్ద మూడు ప్రభుత్వ భూములను ఆక్రమణదారులు రేకులతో చుట్టేశారని, వాటిని తొలగించి డీమార్కేషన్ చేసి ఫెన్సింగ్ వేసి ప్రజల అవసరాలకు అందుబాటులో ఉంచాలని సర్వే నంబర్లతో సహా బాచుపల్లి ఎంఆర్ఓ వనితా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం కోశాధికారి విజయ రవీంద్ర బాబు పాల్గొన్నారు.

# ఉప్పల్ నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధి చెయ్యండి



**ఉప్పల్ డిసెంబర్ 17 (జనంసాక్షి):** ఉప్పల్ నియోజకవర్గం లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కొరకై ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రెటరీని కలిసిన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల కొరత, ఉపాధ్యాయుల కొరత, కొన్ని పాఠశాల లో మధ్యాహ్నం భోజనం పథకమును కొనసాగించుటకు వంట గదుల కొరత, కొన్ని పాఠశాలలో మరుగుదొడ్డుల కొరత మరియు ఎంపీపీ ఎస్ వెస్లీ నాచారం పాఠశాలకు నూతన భవన నిర్మాణం వంటి వాటిని మంజూరు చేయుట కొరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ముందుగా ఈ సమస్యలను వివరించి వారి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ లబి అజిత్‌రెడ్డిని కలిసి ఉప్పల్ నియోజకవర్గంలోని పాఠశాలలలో సదుపాయాల లేమిని మరియు ఉపాధ్యాయుల కొరతను వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్, బిఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు నాణ్యతతో వేగంగా పూర్తయ్యేలా చర్యలు

**- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ (ఎఫ్ఎసి) జె.అరుణశ్రీ**

**గోదావరిఖని, జనంసాక్షి :**



అభివృద్ధి పనులు నాణ్యతతో వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఎసి) జె. అరుణ శ్రీ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి పనులపై నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో బుధవారం ఆమె సమీక్ష జరిపారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన మనుషులు,యంత్రాలు, వస్తువులు ముందుగానే అందుబాటులో ఉంచుకొని ప్రారంభించిన పని అంతరాయం లేకుండా కాంట్రాక్టర్లు కొనసాగించేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో అభివృద్ధి పని ప్రారంభించని, పూర్తి చేయని కాంట్రాక్టర్‌లకు నోటీసులు జారీ చేసి తగిన కారణం లేకుండా జాప్యం జరిగినట్లు గుర్తిస్తే బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని అన్నారు. ఆక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు పనులు నిరాటంకంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎస్.ఇ గురువీర, ఇఇ. పివి రామన్, ఎసిపి శ్రీహరి, టిపిఎస్.నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, డిఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

# చివరి దశ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- జిల్లాలో మూడు దశల్లో సజావుగా పంచాయతీ ఎన్నికలు : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- వివిధ గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ పరిశీలన
- 3వ విడతలో 86.42 శాతం పోలింగ్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 17(జనంసాక్షి):**
జిల్లాలో మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని, మొదటి, రెండవ విడత ఎన్నికల మాదిరిగానే చివరి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సజావుగా పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మూడో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ లో భాగంగా జిల్లాలోని వి. సైదాపూర్ మండలం దుద్దెనపల్లి ఎలబోతారం, హుజురాబాద్ మండలంలోని తుమ్మనపల్లి గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల సంఖ్య, అప్పటి వరకు నమోదైన పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ, ఆన్లైన్లో నివేదికలు సమర్పించాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఒకటి తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి అనుమతించకూడదనీ కలెక్టర్ అక్కడి ఎన్నికల అధికారులను ఆదేశించారు.

**3వ విడతలో 86.42% పోలింగ్**

మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తంగా 86.42% ఓట్లు పోలయ్యాయి. మండలాల వారీగా పరిశీలిస్తే ఇల్లందకుంటలో 87.05%, హుజురా బాద్‌లో 85.04, జమ్మికుంటలో 85.72 వీణవంక 85.87 సైదాపూర్ 87.85 శాతంగా నమోదయింది.

**కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్**

మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలిం చారు. జమ్మికుంట మండలం మాచినపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాల్లో కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు. వీణవంక మండలం రెడ్డిపల్లి, చల్లూరు, మామిడాలపల్లి లోను కౌంటింగ్ విధానాన్ని పర్యవేక్షించా రు. అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులు లేదా ఏజెంట్ల సమక్షంలో నిష్పక్ష పాతంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించా లని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెల్లడించే వరకు ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకూ అవకాశం ఇవ్వరాదని కలెక్టర్ ఆదేశించారు.

# శేరిలింగంపల్లి అభివృద్ధికి ప్రభుత్వం భారీ నిధులు

- మియాపూర్‌లో రూ.1.77 కోట్లతో పలు పనులకు శంకుస్థాపన
- సురభి కాలనీలో రూ.24 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ ప్రారంభం
- రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది
- సీఎం రేవంత్‌ను గొప్ప రాజనీతిజ్ఞుడిగా అరికెపూడి కొనియాడారు



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 17(జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంతో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతోందని ప్రజాపద్దుల కమిటీ (పిఎస్‌సి) చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. కొనసాగుతున్న అభివృద్ధి పనులే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్‌లో రూ. 1.77 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు పనులకు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన అరికెపూడి గాంధీ... గ్రేటర్ హైదరాబాద్‌ను పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, శేరిలింగంపల్లికి భారీగా నిధులు కేటాయిస్తోం దని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధిని కోరుకుంటూనే ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా ముందుంటానని హామీ ఇచ్చారు. మంజూరైన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా వేల కోట్లు వెచ్చిస్తూ రాష్ట్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టిన తెలంగాణ ప్రభుత్వం... దేశంలో మరే రాష్ట్రం చేపట్టని పనులను చేస్తోందని, ఇది గర్వకారణమని అరికెపూడి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముందుచూపు ఎక్కువని, ఆయనను గొప్ప రాజనీతిజ్ఞుడిగా, వ్యవస్థగా అభివర్ణించవచ్చని కొనియాడారు.

మియాపూర్ పరిధిలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ రోడ్డులో రూ.45 లక్షలతో సీసీ రోడ్డు, టాకీ టౌన్ థియేటర్ రోడ్డు నుంచి మియాపూర్ విలేజ్ మసీదు వరకు రూ.95 లక్షలతో బీటీ రోడ్డు, బొల్లారం ప్రధాన రహదారి నుంచి ప్రజయ్ షెల్టర్ అపార్ట్‌మెంట్ వరకు రూ.37 లక్షలతో సెంట్రల్ మీడియన్ నిర్మాణ పనులకు అరికెపూడి గాంధీ, ఉప్పలపాటి శ్రీకాంత్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా శేరిలింగంపల్లి డివిజన్ పరిధి సురభి కాలనీలో రూ.24 లక్షల అంచనా వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి అధికారులతో కలిసి అరికెపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. చాలాకాలంగా ఉన్న ఈ సమస్య నేటితో తీరిపోనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు తీసుకొచ్చిన సమస్యలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ ఆర్.కృష్ణ, డీజీఎం నరేందర్, మేనేజర్ అభిషేక్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు రాజు యాదవ్, గౌరవాధ్యక్షుడు వీరేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, వార్డు మెంబర్లు శ్రీకళ, వెంకటేశ్వర్లు, రాంబాబు, కొయ్యడ లక్ష్మణ్ యాదవ్, సీనియర్ నాయకుడు చాంద్ పాషా, సురభి కాలనీవాసుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ ఆర్.వెంకట్ రెడ్డి, సెక్రటరీ సి.వి.భాను, వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఏ.జయకృష్ణ, జాయింట్ సెక్రటరీ జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శేరిగూడెం పంచాయతీ ఎన్నికల్లో అక్రమాలు

## మాకు న్యాయం చేయండి.. మైలవరం గంగాభవాని సత్యనారాయణ డిమాండ్





**శంకర్‌పల్లి, డిసెంబర్ 17(జనం సాక్షి) :** శేరిగూడ గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డ్ మెంబర్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని మాకు న్యాయం చేయాలంటూ ఓడిపోయిన అభ్యర్థులు చీర మౌనిక శ్రీనివాస్, మైలారం గంగాభవాని సత్యనారాయణ లు డిమాండ్ చేశారు.వారు ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం బుధవారం శంకరపల్లి మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ప్రస్తుతం శేరిగూడ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన బొల్లారం నివేదిత సోదరి అదే గ్రామానికి ఎన్నికల అధికారిగా రావడం చర్చనీయాంశమైంది. శేరిగూడ గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారుల సిబ్బంది జాబితా ఇవ్వాలని ఆమె తరపు బంధువులు ఎంపీడీవో కార్యాలయంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతూ ఎండిఓను ఘోరావ్ చేశారు.పోలింగ్ అధికారిగా పోటీ చేస్తున్న వ్యక్తికి వరుసకు సోదరి అని ఆమెను ఎన్నికల విధుల్లో ఎలా వేస్తారు అంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఎన్నికల అధికారిగా పాల్గొన్న అనిత( నవిత ) ఈమె రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తూ ఉందని ఆరోపించారు.

ఎన్నికల విధుల్లో పాల్గొన్న జాబితాలో శేరిగూడ గ్రామపంచాయతీ ఎన్నికలలో ఓ ముస్లిం అధికారి పేరు ఉండగా ఈమె విధుల్లో పాల్గొనలేదని వారు ఆరోపించారు. శేరిగూడ గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు సిబ్బంది జాబితా ఎందుకు బయట పెట్టడం లేదంటూ వారు ప్రశ్నించారు.

ఆమె ముఖానికి స్కార్ఫ్ కట్టుకొని పోలింగ్ విధులు నిర్వహిస్తూనే కత్తెర గుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచారం సైతం నిర్వహించిందని వారు ఆరోపించారు. కొంతమంది ఓటర్లకు కేవలం వార్డు మెంబర్ల ఓటర్ స్లిప్పులు ఇస్తూ సర్పంచ్ స్లిప్పులు ఇవ్వకుండా సర్పంచ్ స్లిప్పుల గుర్తుపై కత్తెర గుర్తుకు తానే ఓటు వేసి నివేదిత గెలుపుకు కారణమైందని వారు ఆరోపించారు. జాబితా విడుదల చేయాలని ఓడిపోయిన చీర మౌనిక గంగాభవాని తరపు బంధువులు పెద్ద ఎత్తున ఎంపీడీవో చాంబర్లో నినాదాలు చేశారు.ఈ విషయమై ఎంపీడీవో వెంకయ్య గౌడ్ ఎన్నికలకు సంబంధించిన వ్యవహారం అని తాను మీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతి మేరకు జాబితా ఇస్తానని స్పష్టం చేశారు.మాకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

# నూతన సర్పంచ్‌లను అభినందించిన చేవెళ్ల ఎమ్మెల్యే



**శంకర్ పల్లి,డిసెంబర్ 17 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సంకేపల్లి గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రత్యేకంగా అభినందించారు.గ్రామ సర్పంచ్ గా దేశ్పాండే శ్రీనివాస్, ఉప సర్పంచ్ గా ఉప్పరి రవీందర్ సగర, వార్డ్ మెంబర్లు గా తాళ్లపల్లి రుక్కమ్మ, కవ్వగూడెం మల్లేశం యాదవ్, ఉప్పరి లావణ్య శ్రీనివాస్ సగర,తోకల గోవర్ధన్ యాదవ్, తోకల సబిత పరమేశ్వర్ యాదవ్ లు భారీ మెజారిటీతో విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ ప్రజాప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే ఐదు సంవత్సరాలలో గ్రామాన్ని అభివృద్ధి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టడం కోసం కృషి చేస్తానని, గ్రామాభివృద్ధికి సంపూర్ణంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ప్రజాప్రతినిధులను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం నిరంతరం ఉంటుంది.



## అత్తాపూర్‌లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్

# నూతన షోరూమ్ ప్రారంభం

**రాజేంద్రనగర్,డిసెంబర్17(జనం సాక్షి) :** మలబార్ గోల్డ్, డైమండ్స్ అత్తాపూర్‌లో పిల్లర్ నెం.139 సమీపంలో నూతన షోరూమ్‌ను దక్షిణ భారత నటి (కెజిఎఫ్ హీరోయిన్) శ్రీనిధి శెట్టి చేతుల మీదుగా, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఇది హైదరాబాద్‌లో 17వది, తెలంగాణలో 25వ షోరూమ్ గా మలబార్ నిర్వాహకులు తెలిపారు.దాదాపు 5000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌లో బంగారం, వజ్రాలు, ప్లాటినం, రత్నాభరణాలు, మలబార్ సిగ్నేచర్ కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పారదర్శక ధరలు, బీఐఎస్ హాల్మార్క్ బంగారం, సర్టిఫైడ్ వజ్రాలతో నాణ్యతకు మలబార్ హామీ ఇస్తోందని యాజమాన్య నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా మూడు రోజుల్లో

# అక్రమణలు తొలగించాలి

## ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సమస్యను తెలపాలి : మున్సిపల్ కమిషనర్ బి యాదగిరి



**తాండూరు డిసెంబర్ 17(జనంసాక్షి)** స్వచ్ఛందంగా మూడు రోజుల్లో అక్రమణలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బి యాదగిరి పేర్కొన్నారు. బుధవారంతాండూర్ మున్సిపల్ పరిధిలో రోడ్ల వెంబడి ఆక్రమణలు చేసిన వారు వెంటనే తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి యాదగిరి తెలిపారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం నుండి మార్కెట్ వరకు ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన ఆక్రమణదారులతో మాట్లాడుతూ మూడు రోజులలో ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. మూడు రోజుల్లో స్వచ్ఛందగా తొలగించకపోతే మున్సిపల్ సిబ్బందితో తొలగించడం జరుగుతుందని ఆయన తెలిపారు. తాండూర్ మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు సంబంధించి శానిటేషన్, వీధి దీపాలు, మంచినీటి సరఫరాలకు సంబంధించి వార్డుల్లోని ప్రధాన ప్రాంతాల్లో సంబంధిత ఏరియా ఇన్చార్జి ఫోన్ నెంబర్లను గోడల పై రాయించడం జరిగిందని ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సమస్యను తెలపాలని అక్కడ కూడా కాని పక్షంలో కార్యాలయంలో ఉన్న రిజిస్టర్ యందు వివరాలను నమోదు చేయాలని ప్రజలకు కమిషనర్ సూచించారు. అప్పటికి స్పందించకపోతే ఆ పైనున్న అధికారులకు తెలియజేయాలని కమిషనర్ సూచించారు. 36 వార్డులోని ప్రజలు వారి ఏరియాలో ఉన్న అధికారికి చెప్తే సమస్యలు తొందరగా పరిష్కారం అవుతాయని ఉద్దేశంతో ఈ బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఆయన వెంట టౌన్ ప్లానింగ్ అధికారులు వంశీధర్,, నరేష్, ప్రియా, శానిటరీ ఇన్స్పెక్టర్లు వెంకటయ్య, ఉమేష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ప్రవీణ్ గౌడ్ , తదితరులు ఉన్నారు.

## అవసరమైన నిధులను

# మౌలిక సదుపాయాలకు అందిస్తాం

## తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



**తాండూరు డిసెంబర్ 17(జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం నిరంతరం ఉంటుందని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్నం మహేందర్ రెడ్డి పెద్దేముల్ పర్యటనలో భాగంగా మండల కేంద్రంలో సర్పంచ్ గా విజయం సాధించిన డివై నర్సిములును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా సర్పంచ్ డివై నరసింహులు తో పాటు వార్డు సభ్యులు నాగభూషణం తదితరులను మహేందర్ రెడ్డి శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని చెప్పారు. గతంలో కూడా పెద్దేముల్ గ్రామపంచాయతీ అభివృద్ధికి అనేక నిధులు అందించమన్నారు ఇప్పుడు కూడా అవసరమైన నిధులను మౌలిక సదుపాయాలకు అందిస్తామని మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాజీపూర్ నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, నాగభూషణం, దాసరి సాయిలు, రంగయ్య పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటికి టీడబ్ల్యూజేఎఫ్ ఆహ్వానం

- 20న ఖమ్మం జిల్లా 3వ మహాసభలకు కచ్చితంగా హాజరవుతానని హామీ
- ఆహ్వానపత్రికను అందజేసిన టీడబ్ల్యూజేఎఫ్ బృందం
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కు సైతం ఆహ్వానపత్రిక



**కూసుమంచి : (జనం సాక్షి) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో 20వ తేదీ శనివారం నిర్వహించే యూనియన్ జిల్లా మహాసభలకు కచ్చితంగా హాజరవుతానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంఘం నేతలకు హామీనిచ్చారు. కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూని యన్ నేతలు మంత్రికి బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఆహ్వాన పత్రికలో భాగంగా పేర్కొన్న జర్నలిస్టుల డిమాండ్లను పరిశీలించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులలో జర్నలిస్టుల కుటుంబాలకు పూర్తి స్థాయి ఉచిత వైద్యం అందించాలని, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించాలని, రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని... ఇలా పలు రకాల డిమాండ్లను టీడబ్ల్యూజేఎఫ్ ఆహ్వానపత్రికలో పొందుపరిచింది. వీటిపై మహాసభల సందర్భంగా స్పష్టమైన ప్రకటన చేయాలని టీడబ్ల్యూజే ఎఫ్ బృందం కోరింది. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని ఆహ్వానించిన యూనియన్ బృందంలో జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, నాయకులు దువ్వా సాగర్, కూరాకుల గోపీ, మధుప్రియ, జానీపాష, పెంద్ర అంజయ్య, కర్ణ, ఇమ్మడి సంతోష్ తదితరులు ఉన్నారు.

# హయత్‌నగర్ జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ అత్యవసరం

- డిపో సమీపంలో ప్రతిపాదిత స్థలాన్ని కార్పొరేటర్ పరిశీలన
- పాదచారులకు ప్రమాదకర పరిస్థితులు
- ఇటీవల మెడికల్ విద్యార్థిని మరణం రిమైండర్
- త్వరితగతిన నిర్మాణం, తాత్కాలిక చర్యలకు సూచన



**హయత్‌నగర్, డిసెంబర్ 17 (జనంసాక్షి) :** హయత్‌నగర్ జాతీయ రహదారిపై డిపో సమీపంలో ప్రతిపాదిత ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ (ఎఫ్ఓబి) నిర్మాణానికి అనుకూలమైన స్థలాన్ని డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణ శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసు విభాగం, ఇంజినీరింగ్ నిపుణులతో కలిసి ఆయన ఈ పరిశీలన చేపట్టారు. రహదారి వెడల్పు, పాదచారుల రాకపోకలు, వేగంగా పెరుగుతున్న వాహనాల ఒత్తిడి, సమీపంలోని బస్టాండ్-డిపో కారణంగా ఏర్పడుతున్న ప్రమాదకర పరిస్థితులను వారు సమగ్రంగా అధ్యయనం చేశారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పాదచారులు రోడ్డు దాటేందుకు ప్రాణాలను పణంగా పెట్టాల్సిన దుస్థితి నెలకొందని కార్పొరేటర్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.ఇటీవల వినాయక్ నగర్ కాలనీ వద్ద రోడ్డు దాటుతూ మెడికల్ విద్యార్థిని ఐశ్వర్య దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఘటన ఈ ప్రాంతంలో భద్రతా చర్యల అత్యవసరాన్ని మరోసారి గుర్తు చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాదచారుల ప్రాణరక్షణకు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం తప్పనిసరని స్పష్టం చేశారు. ప్రాజెక్టు ఆమోదం నుంచి నిర్మాణ ప్రారంభం వరకు ప్రతి దశనూ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించిన కళ్లెం నవజీవన్ రెడ్డి... ఎఫ్ఓబి పూర్తయ్యే వరకు తాత్కాలిక భద్రతా చర్యలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారి విస్తరణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీకాంత్, వనస్థలిపురం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు తదితరులు పాల్గొన్నారు.

# యువత గ్రంథాలయాలను వినిగించుకోవాలి

- విపంచి ఫౌండేషన్ రూపొందించిన స్టార్ట్ లైబ్రరి సేవ్ లైబ్రరి పోస్టర్‌ను ఆవిష్కరించిన జాక్ చైర్మన్ ప్రొ.కోదండరామ్
- ఊరూరా గ్రంథాలయ ఏర్పాటే విపంచి ఫౌండేషన్ లక్ష్యం : అనుముల శ్రీనివాస్



హయత్ నగర్, డిసెంబర్ 17 (జనం సాక్షి)
విపంచి ఫౌండేషన్ ఆద్వర్యంలో గ్రంథాలయాల ఆవశ్యకతపై రూపొందించిన "స్టార్ట్ లైబ్రరి- సేవ్ లైబ్రరి" అనే నినాదం తో రూపొంచిన ప్రచార పోస్టర్ ను ప్రొఫెసర్ కోదండ రామ్ హైదరాబాద్ లోని ఆయన నివాసం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదివే అలవాటు అంతరించి పోతున్న ఈ తరుణంలో" స్టార్ట్ లైబ్రరి- సేవ్ లైబ్రరి"అనే నినాదంతో ప్రచార పోస్టర్ రూపొందించి గ్రంథాలయాల అవశ్యకతను గుర్తించడం అభినందనీయం అని ఇది ప్రస్తుత తరుణంలో చాలా కీలకమైన కార్యక్రమం అని వారు అన్నారు. ఈ మద్య యువత పెడదారిన పడుతుంద ని దాని నుండి బయట పడటానికి ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల ఏర్పాటుకు పూనుకోవాలని వారు పిలుపునిచ్చారు. గ్రంథాలయాల వేదికగా సంస్కృతిక, క్రీడా కార్యక్రమాలునిర్వహిస్తూ యువతను భాగస్వామ్యం చేస్తే ఆ ఊరు బాగుపడుతుందని తద్వారా యువత వృద్ధి చెంది దేశ సంపద ఉత్పత్తి లో భాగస్వాములవుతారని, అందరం కలసి మహనీయులు స్ఫూర్తి , ఊరూరా గ్రంథాలయాల స్థాపనకు కృషి చేద్దాం అని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ గ్రంథాలయ సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా అనుముల శ్రీనివాస్ నేతృత్వం లో ఉభయ తెలుగు రాష్ట్రాలలో గ్రామీణ గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందని వారు అన్నారు. తెలంగాణ గ్రంథాలయ సంఘం కూడా ఈ గ్రామీణ గ్రంథాలయాలకు తోడుందని వారు గుర్తు చేశారు. విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ ఊరూరా గ్రంథాలయం ఏర్పాటే తమ లక్ష్యమని రచయితలు, మేధావులు ,పుస్తక ప్రేమికులు, యువత అందరూ సహకరించాలని వారు కోరారు .తెలంగాణ స్టడీ ఫోరం అధ్యక్షులు నక్కెర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ విపంచి ఫౌండేషన్ నేతృత్వం లో స్థానిక సంస్థల లో గెలిచిన సర్పంచ్ లు గ్రంథాలయాలు ప్రారంభించాలని వారు సూచించడం వలన తెలంగాణ వ్యాప్తంగా ఒక చలనం వచ్చిందని వారు అన్నారు. నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గాదె వినోద్ రెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరాం సూచనలను పాటిస్తూ విజ్ఞాన ఉద్యమం చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ గౌరవ సలహాదారు ఆందోజు నాగభూషణము, పెద్దపల్లి జిల్లా వెంకట్రావు పల్లి గ్రంథాలయ సభ్యులు మంద అనిల్, రేచవేణి సతీష్, కొమ్మ కుమార్, కొమ్మ సతీష్, ఎస్కే ఉస్మాన్ పాష, తదితరులు పాల్గొన్నారు.

## శీతాకాల విడిదికి హైదరాబాద్‌కు

# చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- హకీంపేట విమానాశ్రయంలో గవర్నర్, డిప్యూటీ సీఎం స్వాగతం
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- డిసెంబర్ 22 వరకు రాష్ట్రపతి నిలయంలో బస
- 19, 20 తేదీల్లో అధికారిక కార్యక్రమాలు



హైదరాబాద్, డిసెంబర్ 17 (జనం సాక్షి) శీతాకాల విడిది (సదరన్ సోజర్న్) నిమిత్తం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ప్రత్యేక విమానంలో హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు ఆమె రాగా, తెలంగాణ ప్రభుత్వం తరఫున ఘన స్వాగతం లభించింది. రాష్ట్రపతి విమానం నుంచి దిగిన వెంటనే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణ రావు, డీజీపీ బి. శివధర్ రెడ్డి తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి ప్రత్యేక వాహనంలో బొల్లారం పరిధిలోని రాష్ట్రపతి నిలయానికి బయలుదేరారు.రాష్ట్రపతి రాక సందర్భంగా హకీంపేట విమా నాశ్రయం నుంచి రాష్ట్రపతి నిలయం వరకు మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేశారు. అగ్నిమాపక, వైద్య బృందాలను సిద్ధం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించింది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ముందుగా విమానాశ్రయానికి చేరుకున్న వీవీఐపీలను పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.
రాష్ట్రపతి డిసెంబర్ 22 వరకు రాష్ట్రపతి నిలయంలో బస చేయనున్నారు. ఈ పర్యటనలో డిసెంబర్ 19న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్ల జాతీయ సదస్సును ఆమె ప్రారంభిస్తారు. 20న బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవం సందర్భంగా 'టైమ్‌లెస్ విజ్డమ్ ఆఫ్ భారత్: పాత్‌వేస్ ఆఫ్ పీస్ అండ్ ప్రోగ్రెస్' అంశంపై జరిగే సదస్సుకు హాజరై ప్రసంగిస్తారు. ఈ ఏర్పాట్లు జిల్లా పరిపాలన సమన్వయానికి ప్రతీకగా నిలిచాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
18 డిసెంబర్ 2025

# రాజేంద్రనగర్‌లో హైకోర్టు భవన నిర్మాణం

- పనుల పురోగతిని పరిశీలించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ



హైదరాబాద్, డిసెంబర్ 17 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులను రోడ్లు మరియు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్లు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి క్షేత్రస్థాయి ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు మరియు కన్సల్టెంట్లు పాల్గొన్నారు. పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంబంధిత అధికారులకు మరియు సంస్థలకు కీలక ఆదేశాలను జారీ చేశారు. సుమారు రూ. 2583.00 కోట్లు వ్యయంతో 36.52 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న హైకోర్టు భవనం రాష్ట్ర ఐకానిక్ బిల్డింగ్ లా ఉండాలని, అధికారులు అందుకు తగ్గట్టుగా మనసుపెట్టి పనిచేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పనుల్లో జాప్యం కలగకుండా ఉండటానికి, కన్సల్టెంట్లు డ్రాయింగ్ షెడ్యూల్‌ను ముందుగానే అందించాలి. దీనివల్ల కాంట్రాక్ట్ సంస్థ అవసరమైన సిబ్బందిని, యంత్రాలను మరియు సామగ్రిని సిద్ధం చేసుకోవడానికి వీలవుతుంది. కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థను ఆదేశించారు.'నుల పురోగతిపై శాఖా పరమైన అధికారులు కన్సల్టెంట్ మరియు కాంట్రాక్టర్‌తో తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జ్యుడీషియల్ అధికారుల సూచనల మేరకు సవరించిన ఎ÷-లాన్లను వెంటనే సిద్ధం చేసి అనుమతులు తీసుకోవాలని కన్సల్టెంట్లను ఆదేశించారు. అలాగే, జోన్ 2కి సంబంధించిన అటవీ శాఖ అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ చీఫ్ ఇంజనీర్‌కు సూచించారు.

# వాజ్‌పేయ్‌ను రాష్ట్రపతి చేయాలనుకున్న బిజెపి

- వాజ్‌పేయ్ తిరస్కరణతో వెనక్కి తగ్గిన పార్టీ
- అశోక్ టండన్ పుస్తకం 'అటల్ సంస్మరణ్'లో ప్రస్తావన



న్యూఢిల్లీ, డిసెంబర్17 (జనంసాక్షి) : రాష్ట్రపతిగా వాజ్‌పేయి, ప్రధానిగా అద్వానీని చేయాలనుకున్నారా..బిజెపి చేసిన ఈ ప్రయత్నం విఫలం అయ్యిందా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వాజ్‌పేయీ మీడియా సలహాదారుగా ఉన్న అశోక్ టండన్ రాసిన పుస్తకం 'అటల్ సంస్మరణ్'లో ఇప్పుడీ విషయాలు చర్చకు వస్తున్నాయి. అయితే వాజ్‌పేయ్ తిరస్కరణతో ఈ వ్యవహారం బయటరకు ర ఆకుండా పోయిందని తెలుస్తోంది. భారత రాష్ట్రపతి అభ్యర్థిగా ఏపీజే అబ్దుల్ కలామ్ పేరును ఎన్నుకోవడానికి ముందు ఆ పదవికి భాజపా అటల్ బిహారీ వాజ్‌పేయీ పేరును ప్రతిపాదించిందట. ఆ సమయంలో వాజ్‌పేయీ మీడియా సలహాదారుగా ఉన్న అశోక్ టండన్ రాసిన పుస్తకం 'అటల్ సంస్మరణ్' లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. వాజ్‌పేయీ పేరును రాష్ట్రపతి పదవికి ప్రతిపాదించి, ప్రధాని స్థానంలో ఆ పార్టీ అగ్రనేత ఎల్.కె.అద్వాణీని ఎన్నుకోవాలని భాజపా సూచనలు చేసినట్లు అశోక్ టండన్ పేర్కొన్నారు. అయితే పార్టీ చేసిన ఈ ప్రతిపాదనను అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ నిరాకరించినట్లు తెలిపారు. ప్రధానిగా ఉన్న తాను రాష్ట్రపతి పదవికి మారడం సరైన చర్య కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. తాను ఎంతటి ప్రజాదరణ పొందిన నాయకుడిని అయినప్పటికీ.. మెజారిటీ ఆధారంగా రాష్ట్రపతి పదవిని పొందలేనని వాజ్‌పేయీ పేర్కొన్నట్లు అశోక్ టండన్ తెలిపారు. రాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఏకాభిప్రాయం కుదిరేలా చర్చలు జరపడానికి ప్రధాన ప్రతిక్షమైన కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, ప్రణబ్ ముఖర్జీ, మన్మోహన్ సింగ్‌లను ఆయన ఆహ్వానించారన్నారు. అనంతరం రాష్ట్రపతి స్థానానికి ఎన్డీఏ తరఫున ఏపీజే అబ్దుల్ కలామ్‌ను అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నట్లు ప్రకటించారన్నారు. దీనికి కాంగ్రెస్ కూడా మద్దతు తెలపడంతో 2002లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం, ప్రతిపక్షాల మద్దతుతో అబ్దుల్ కలామ్ భారత రాష్ట్రపతిగా ఎన్నికైనట్లు తెలిపారు.వాజ్‌పేయీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోని అనేక ఘటనలను అశోక్ టండన్ తన పుస్తకంలో వివరించారు. అటల్-అద్వానీలకు విధానపరమైన అంశాలపై విభేదాలు ఉన్నప్పటికీ.. భారత రాజకీయాల్లో వారి భాగస్వామ్యం, సహకారం సమతుల్యతకు చిహ్నంగా ఉండేదన్నారు. వారి దిశానిర్దేశరలో భాజపా మరింత అభివృద్ధి చెందినట్లు రాసుకొచ్చారు. మొత్తంగా అద్వానీకి అదృష్టం కలసి రాలేదు. వాజ్‌పేయ్ తరవాత పదేళ్లు యూపిఎ పాలన సాగింది. ఆ సమయంలో రెండుసార్లు ఎన్నికల్లో బిజెపి ప్రతిపక్షానికే పరిమతం అయ్యింది. ఆ తరవాత మోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదించడంతో ఇక అద్వానీకి అవకాశం లేకుండా పోయింది.

# భూపాలపల్లిలో కూలిన చెక్ డ్యామ్



జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 17 (జనంసాక్షి) : మల్హర్ రావు మండలం వల్లెకుంట గ్రామ పరిసరాల్లో మానేరుపై నిర్మించిన చెక్ డ్యాం కొద్దిమేర కూలిపోయింది. 10 మీటర్ల మేర చెక్ డ్యాం గోడ కూలింది. ఫలితంగా నీరంతా దిగువకు వృథాగా పోతోంది. ఘటన జరిగిన సమయంలో చేపలు పడుతున్న ఇద్దరు మత్స్యకారులు ప్రవాహ ఉధృతికి కొద్దిదూరం కొట్టుకుపోయారు. తర్వాత ఈదుకుంటూ ఒడ్డుకు చేరడంతో వారికి ప్రాణాపాయం తప్పింది.

# గన్నవరంలో భారీగా గంజాయి పట్టివేత

విజయవాడ, డిసెంబర్ 17 (జనంసాక్షి) : రాష్ట్రంలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా..మార్పు కనిపించడం లేదు.. గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న పోలీసులకు మాఫియా సవాల్ విసురుతోంది. పోలీసులు ఎక్కడిక్కడ తనిఖీలు నిర్వహించి గంజాయిని తరలించే ముఠాను అడ్డుకుని అరెస్టులు చేస్తున్నారు. తాజాగా గన్నవరంలో గంజాయి అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకుని భారీగా గంజాయిని సీజ్ చేశారు. కృష్ణా జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. గన్నవరంలోని బీబీ గూడెం అండర్ పాస్ వద్ద పోలీసులు బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించి వెంటనే అడ్డుకున్నారు. దాదాపు 112 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న మహారాష్ట్ర పూణెకు చెందిన దీపక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎస్పీ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు పూర్వాపరాలను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వివరించారు. సాధారణ వాహన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నామన్నారు.

# పాఠశాలలకు బాంబు బెదిరింపులు

గాంధీనగర్, డిసెంబర్ 17 (జనంసాక్షి) : గుజరాత్‌లో బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. అహ్మదాబాద్ లోని పలు పాఠశాలలకు బుధవారం ఉదయం బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. నగరంలోని మహారాజా అగ్రసేన్ స్కూల్, వేజల్పూర్ జైడస్ స్కూల్, నిర్మాణ్ స్కూల్, డివైన్ స్కూల్, ఆవిష్కర్ స్కూల్, కలోల్ దేవ్ ఇంటర్నేషనల్ సహా ప్రముఖ పాఠశాలలకు ఈ బెదిరింపులు వచ్చాయి. పాఠశాలల ఆవరణలో పేలుడు పదార్థాలు ఉంచినట్లు బెదిరింపు మెయిల్‌లో పేర్కొన్నారు. అప్రమత్తమైన ఆయా పాఠశాలల యాజమాన్యాలు పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పాఠశాలల వద్దకు చేరుకొని తనిఖీలు చేపట్టారు. విద్యార్థులు, సిబ్బందిని బయటకు పంపి క్షుణ్ణంగా సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ మేరకు బెదిరింపు మెయిల్స్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పాత సామాన్ల డంపింగ్ అగ్నికి ఆహుతి



సిద్దిపేట, డిసెంబర్ 17 (జనంసాక్షి) : సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ఓ పాత ఇనుప సామాన్ల డంపింగ్ యార్డులో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. డంపింగ్ యార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో.. రూ.లక్షల విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. నిల్వ ఉంచిన ప్లాస్టిక్ వస్తువులకు మంటలు అంటుకొని క్షణాల్లో ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# పల్లె ప్రజల్లో కెసిఆర్ సిఎం కావాలన్న ఆకాంక్ష

- సర్పంచ్ ఎన్నికల ఫలితాలే నిదర్శనం: హరీష్ రావు

సిద్దిపేట, డిసెంబర్ 17 (జనంసాక్షి) : కేసీఆర్ సీఎం కావాలని.. బీఆర్ఎస్ మళ్లీ రావాలని ప్లలె ప్రజలు తీర్పునిచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయాని తెలిపారు. సిద్దిపేట జిల్లా నాంచారుపల్లి బీజేపీ సర్పంచ్ నరసింహారెడ్డి ఇవాళ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దకోడూరుకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కపట నాటకాలకు సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని అన్నారు. బీజేపీది సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కాదు.. అది సబ్‌కా బక్వాస్ అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు.. పేదల పథకాలకు ఎసరుపెట్టే కటింగ్ మాస్టర్ అని విమర్శించారు. మహిళలకు రూ.55 వేలు, వృద్ధులకు రూ.44 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని అన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో సింబల్ ఉంటే దుమ్ము రేగేది

- రెండేళ్లలోనే ఈ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- గెలిచిన సర్పంచ్‌ల సన్మానంలో మాజీమంత్రి శ్రీనివాసగౌడ్



మహబూబ్‌నగర్, డిసెంబర్ 17 (జనంసాక్షి) : రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఈ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని మండిపడ్డారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్, వార్డు మెంబర్లను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన సన్మానించారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ పార్టీ ఒకటి, రెండు మించి సర్పంచ్ స్థానాలను గెలవ లేదన్నారు. తమ పార్టీ అభ్యర్థులకు సింబల్ ఉంటే అధిక స్థానాలు కైవసం చేసుకునే వాళ్లమని చెప్పారు. గ్రామాలకు వచ్చే నిధులు ఎవ్వరు ఆపలేరని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యే సరికి.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు బెదిరింపులకు దిగారన్నారు. ఎమ్మెల్యేలు చెప్పే మాటలు అబద్ధమని పేర్కొన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ సర్పంచ్‌లు గెలుపొందిన గ్రామాలకు నిధులు ఇవ్వకుండా ఆ ఊర్లోకి ఎమ్మెల్యేలు అడుగు పెట్టగలరా? అంటూ ప్రశ్నించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ సత్తా చాటాలంటూ ప్రజలకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. గెలిచే అభ్యర్థులను బరిలో నిలబెట్టి కలిసికట్టుగా పని చేద్దామని పార్టీ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ జిల్లాకు రెండేళ్లలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదంటూ పెదవి విరిచారు. మన జిల్లాకు అన్నం పెట్టేది పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ అని గుర్తు చేశారు. గత రెండేళ్లుగా ఈ ప్రాజెక్టును నిలిపేశావరంటూ రేవంత్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ సన్మాన సభకు భారీ ఎత్తున కేడర్ రావడం బట్టి చూస్తే.. బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం రాబోతుందనడానికి ఇదే నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సభకు వచ్చిన క్యాడర్‌ను చూస్తే.. తన కడుపు నిండిపోయిందని చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన వార్డు మెంబర్లు, సర్పంచ్‌లకు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఓటమి పాలైన అభ్యర్థులు ఎవ్వరూ బాధపడ వద్దంటూ సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మీరే సర్పంచ్‌లుగా ఉంటారన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎవ్వరు సంతోషంగా లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను ముఖ్యమంత్రి అవుతాననంటే.. జిల్లాలోని మొత్తం 12 స్థానాలను నుంచి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారని గుర్తు చేశారు. కానీ ఈ జిల్లాకు సీఎం రేవంత్ చేసిందేమీ లేదన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ ముందుకు కదలడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో పని చేసినట్టుగానే అసెంబ్లీ ఎన్నికల్లో పని చేయాల్సి ఉందంటూ కేడర్‌కు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి అన్ని విధాలా కృషి చేద్దామని పార్టీ నేతలకు ఆయన సూచించారు.

# ఎఎన్ఆర్ కాలేజీకి నాగార్జున 2కోట్ల విరాళం



విజయవాడ, డిసెంబర్17 (జనంసాక్షి) : ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున బుధవారం కృష్ణా జిల్లా గుడివాడలో ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం అక్కినేని కుటుంబం తరుఫున రూ.2 కోట్లను అందజేశారు. నాగార్జున మాట్లాడుతూ మనుషులు శాశ్వతం కాదని, మనం చేసే పనులు శాశ్వతమని అన్నారు. తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు చదువుకోకపోయినా వేల మందికి బంగారు భవిష్యత్‌ను ఇచ్చారని పేర్కొన్నారు. 1959 సంవత్సరంలో రూ.లక్ష విరాళం అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సోదరి నాగసుశీల,మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎమ్మెల్యే వెనిగండల్ల రాము,కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# 8 నెలలుగా కాలువ మరమ్మతులపై నిర్లక్ష్యం

- ఫ్లెక్సీతో నిరనస తెలుపుతున్న కాంప్లెక్స్ వ్యాపారులు

నిజామాబాద్, డిసెంబర్17 (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉరి వేసుకున్న నిజామాబాద్ అభివృద్ధి పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ పక్కన ఉన్న లలిత కాంప్లెక్స్ షాప్ రెండర్స్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ జిల్లాలో చర్చకు దారి తీసింది. మురికి కాలువ మరమ్మతుల కోసం మున్సిపాల్ సిబ్బంది గత 8 నెలల క్రితం జేసీబీ ద్వారా పనులు చేపట్టి ఇప్పటివరకు దాన్ని పూడ్చలేదని, ఈ సందర్భంగా మురికి కాలువను సరి చేయమని లలిత కాంప్లెక్స్ షాప్ రెంటల్స్ అందరూ కలిసి మున్సిపాలిటీ సిబ్బందికి ,ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. అయినప్పటికి ఎటువంటి స్పందన రాలేదని మురికి కాలువ నుండి వచ్చే దుర్వాసన, విపరీతంగా పెరుగుతున్న దోమల ద్వారా కాంప్లెక్స్ వాళ్లందరూ అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయని తమ సమస్యను పరిష్కరించే నాధుడే కరువాయాలని కాంప్లెక్స్ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్ పక్కనే ఉన్ మురికి కాలువను చూసుకుంటూ ఎన్నోసార్లు ప్రయాణం చేసిన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే, ఎంపీలకు సమస్య దృష్టికి రావడం లేదని, సమస్య తీరడం లేదు అని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. కాగా, ఫ్లెక్సీలు చూసిన వారంతా సమస్య ఈ ఒక్క ప్రాంతంలో మాత్రమే కాదని నగరం మొత్తం మురికి రోడ్ల పైన గుంతలు, ఎత్తు పెరిగిన మాన్ హోల్స్ తో పట్టణంలో ప్రతి చోట సమస్యలు ఎదురవుతున్నాయని, పట్టించుకునే వారే లేరని చర్చించుకోవడం గమనార్హం.

# కాంగ్రెస్‌కు అనుకూలంగా పోలీసులు తీరు

- మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత
- కుటుంబ సభ్యులుతో కలసి ఓటేసిన మాజీమంత్రి



మెదక్, డిసెంబర్17 (జనంసాక్షి) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తూ బీఆర్ఎస్ మద్దతుదారుల సర్పంచ్ అభ్యర్థులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేశారని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం స్థానిక ఎన్నికల సందర్భంగా స్వగ్రామమైన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు పోలీసుల అండతో దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయకపోగా.. గ్రామాల్లో ఓటర్లను మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని తమకు ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమైన చర్యగా ఆమె విమర్శించారు. పోలీసులు గత రెండు మూడు రోజులుగా వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, మండలంలోని బిజిలిపూర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త ఇంట్లోకి చొరబడి కొట్టడం అమానుషమని అన్నారు.అలాగే కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో బీఆర్ఎస్ మాజీ జడ్పిటిసి ఇంట్లో లిక్కర్ అమ్ముతున్నారంటూ హడావుడి చేయడం రాజకీయ కక్షతో చేసిన చర్యగా ఆరోపించారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో నిన్న రాత్రి పోలీసుల పహారాలోనే డబ్బులు తీసుకువచ్చి లైట్లు ఆపేసి కాంగ్రెస్ నాయకులు డబ్బులు పంపిణీ చేశారని ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. ఇలాంటి అక్రమాలకు పోలీసులు మౌనసాక్షిగా ఉండటం ప్రజాస్వామ్యానికి మచ్చగా పేర్కొన్నారు.ఈ ఘటనలపై వెంటనే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి రోడ్డెక్కి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్ రెడ్డి, కుంట లక్ష్మణ్ ఉన్నారు.

# ఊరిమీద మమకారంతో ఉద్యోగానికి రాజీనామా

- ఉప సర్పంచ్‌గా గెలిచిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



సంగారెడ్డి, డిసెంబర్17 (జనంసాక్షి) : ఊరికి సేవ చేయాలన్న సంకల్పంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉప సర్పంచ్‌గా గెలుపొందాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన ఓ వ్యక్తి ఉప సర్పంచ్ పదవిని దక్కించు కున్నాడు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేసేవాడు. అతడి తల్లిదండ్రులు 18 ఏళ్లపాటు గ్రామంలో పదవుల్లో ఉన్నారు. వారి బాటలోనే సేవ చేయాలని ప్రవీణ్ నిర్ణయించుకున్నాడు. ఉద్యోగాన్ని వదిలి గ్రామానికి వచ్చాడు. ఇటీవల జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలని భావించాడు. అయితే రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో తన అనుచరుడిని సర్పంచ్‌గా గెలిపించుకున్నాడు. ప్రవీణ్ వార్డు మెంబర్‌గా విజయం సాధించి ఉపసర్పంచ్ పదవిని దక్కించుకున్నాడు. సర్పంచ్, ఉపసర్పంచ్ పదవులు తాను కోరుకున్నట్లే రావడంతో మరింత సంతోషంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశాడు. తామిద్దరం కలసి గ్రామాభివృద్ధికి పాటుపడతామని అన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370